www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ**

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 341

మంగళవారం | 26-3-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: పౌర్ణమి ఉ. 2.57 తదుపరి
విదియ; నక్షత్రం: హస్త ఉ. 1.34 తదుపరి చిత్త; వర్జ్యం: రా. 10.24-12.14; దుర్ముహూర్తం: ఉ. 8.44-9.32, రా. 10.18-11.04; అమృతఘడియలు: ఉ. 6.50-8.37; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 6.24

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# పేదల పెన్షన్.. 4 వేలు



## ఒకటో తేదీనే ఇంటికి పంపిస్తా: చంద్రబాబు



కుప్పం సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న చంద్రబాబు

### బయటి ప్రాంతాలకు వెళ్తే ఒకేసారి 3 నెలల పింఛను

- సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి
- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి
- మా మూడు పార్టీల ఎజెండా ఇదే
- 160 అసెంబ్లీ, 24 పార్లమెంటు స్థానాల్లో కూటమిని గెలిపించండి
- మేమొస్తే దోపిడీ, బాదుడు ఉండవు
- కక్షపూరిత రాజకీయాలూ ఉండవు
- డ్రగ్స్, గంజాయికి వైసీపీ దన్ను
- కిళ్లీ కొట్టులో కూడా దొరుకుతున్నాయి
- నిర్లక్ష్యంగా వదిలిస్తే జీవితాలు నాశనం
- దీనిపై నేను గతంలోనే మాట్లాడితే టీడీపీ కార్యాలయంపై దాడిచేశారు
- వేధింపులతో ఊరూవాడా ఆత్మహత్యలే
- ఎవరి ఆస్తులకూ రక్షణ లేదు: బాబు
- కుప్పం నుంచి ఎన్నికల శంఖారావం

- మా కూటమి గద్దెనెక్కితే ప్రజాస్వామ్యం మీద దాడి ఉండదు. వ్యవస్థల నిర్వీర్యం ఉండదు. నమ్మకం, భరోసా ఇచ్చే పాలన మా కూటమితోనే సాధ్యం.
- వైసీపీ దుర్మార్గ పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరవైంది. వారి జోలికొస్తే అదే ఆఖరి రోజు అన్నంతగా పాలన సాగిస్తా.
- నన్ను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు భయపడి పారిపోలేదు. మీ కోసం నిలబడ్డాను. నాకు సీఎం పదవి ముఖ్యం కాదు. నేను అనుభవించిన పదవే అది. రాష్ట్ర ప్రయోజనాలే నాకు ముఖ్యం. - చంద్రబాబు

కుప్పం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు సామాజిక పెన్షన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచుతానని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఒకటో తేదీనే ఇంటికి పంపించేలా చేస్తానన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్లినవారికి మూడు నెలల పెన్షన్ ఒకేసారి ఇచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. సైకో పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమే టీడీపీ, జనసేన, బీజేపీ ఎజెండాగా పేర్కొన్నారు. సోమవారం తన సొంత నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా కుప్పంలో ఆయన పర్యటించారు. మధ్యాహ్నం మహిళలతో సమావేశం అనంతరం బస్టాండు సర్కిల్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. కుప్పం నుంచే ఎన్నికల శంఖం పూరిస్తున్నట్లు

మిగతా 11వ పేజీలో...

# రాసిస్తా రాయలసీమ!



## అస్మదీయులకు జగన్ భారీ భూసంతర్పణ

## మొత్తం 50 వేల ఎకరాలు ధారాదత్తం

ఆంధ్రజ్యోతి పరిశీలన

- పదులు, వందల ఎకరాలు కాదు... రాయలసీమలోనే అక్షరాల యాభై వేల ఎకరాలు కట్టబెట్టేశారు. అది కూడా... ఎన్నికల షెడ్యూలుకు రెండు నెలల ముందు నుంచే ఈ భూ సంతర్పణ మొదలైంది.
- అస్మదీయ కంపెనీలు జనవరి 22వ తేదీన దరఖాస్తు చేయడం.. ఆ వెంటనే అనుమతులు ఇవ్వడం.. కేబినెట్ ఆమోదం తెలపడం.. ఫిబ్రవరి తొలివారంలో సర్కారు ఉత్తర్వులు జారీ చేయడం.. అంతా హడావుడిగా, రహస్యంగా జరిగిపోయింది.
- కడప జిల్లాతో పాటు అన్నమయ్య, అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలలో జగన్ సన్నిహితుల కంపెనీలకు విద్యుదుత్పత్తి సంస్థల స్థాపన పేరిట కారుచౌకగా భూములు కేటాయించారు. అంతే గాక వినియోగదారులపై భారం వేసేలా ఆ సంస్థల నుంచి విద్యుత్ కొనుగోళ్లకు సిద్ధమయ్యారు. అంటే.. ఆ కంపెనీలకు అన్ని విధాలా లాభమన్నమాట.

- ఎన్నికల ముందు హడావుడిగా నిర్ణయం
- జనవరి మూడోవారంలో కంపెనీల దరఖాస్తు
- ఆ వెంటనే అదే నెలలో కేబినెట్ ఆమోదం
- జేఎస్‌డబ్ల్యూకు 20,100.. ఇండోసోల్‌కు 24,750 ఎకరాలు.. ఫిబ్రవరిలో ఉత్తర్వులు
- ఈ వ్యవహారమంతా అత్యంత రహస్యం
- పర్యావరణ అనుమతులు లేకున్నా గ్రీన్‌సిగ్నల్
- భారం పడేలా విద్యుత్ కొనుగోలుకూ ఓకే

జగన్ సర్కారు 'భూ సంతర్పణ' లీలలు తవ్వేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ కుటుంబానికి చెందిన గ్రీన్‌కో కంపెనీకి ఎకరం 5 లక్షలు చొప్పున 1,985 ఎకరాలు కేటాయిస్తూ ఎన్నికల కోడ్‌కు ఒక్కరోజు ముందు ఈ నెల 15న జీవో ఇచ్చేశారు. జగన్ సన్నిహితుడు విశ్వేశ్వరరెడ్డికి చెందిన ఇండోసోల్‌కు 17,633 ఎకరాలనూ అదేరోజు కట్టబెట్టారు. అడ్డగోలు భూదోపిడీపై 'ఆంధ్రజ్యోతి' మరింత లోతుగా ఆరా తీయగా ఇంకొన్ని విషయాలు బయటపడ్డాయి. జనవరిలో 'ఇంతకు మించి' భూ సంతర్పణ జరిగినట్లు వెల్లడైంది. వెరసి.. ఒక్క రాయలసీమలోనే 50 వేల ఎకరాలను కట్టబెట్టారు. 'సీమ'ను అస్మదీయులకు రాసిచ్చేశారు.

12

# రఘురామకు పశ్చిమలో సీటు!

### టీడీపీ నాయకత్వం నిర్ణయం

### అసెంబ్లీ బరిలో నిలిపే యోచన?



- ఒంగోలు లోక్‌సభ అభ్యర్థిగా మాగుంటే
- ఢిల్లీ మద్యం కేసు తీవ్రత నేపథ్యంలో పోటీకి ఆయన కుమారుడు దూరం
- కడప రేసులో శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి?
- అనంతపురంలో పలు పేర్ల పరిశీలన
- 'విజయనగరం' ప్రతిపాదనలో కళా, మీసాల గీత, అప్పలనాయుడు!
- మడకశిర, సూళ్లూరుపేట, గజపతినగరం అసెంబ్లీ అభ్యర్థులకు అసమ్మతి పోటు
- వారి పేర్లపై అధిష్ఠానం పునరాలోచన?

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): నరసాపురం వైసీపీ ఎంపీ రఘురామరాజుకు బీజేపీ టికెట్ ఇవ్వని నేపథ్యంలో ఆయనకు తామే అవకాశమివ్వాలని టీడీపీ నాయకత్వం దాదాపు నిర్ణయానికి వచ్చింది. పశ్చిమ గోదావరిలో ఏదైనా అసెంబ్లీ స్థానంలో బరిలో దించాలని భావిస్తోంది. వాస్తవానికి ఆయనకు నరసాపురం లోక్‌సభ స్థానంలోనే బీజేపీ అభ్యర్థిగా అవకాశం లభిస్తుందని టీడీపీ వర్గాలు అనుకున్నాయి. ఆ దిశగా ముందుగానే సంకేతాలు వచ్చాయని తెలిపాయి. కానీ చివరకు ఆ పార్టీ శ్రీనివాస వర్మ అనే మరో నేతకు అవకాశం కల్పించింది. రఘురామరాజుకు సీటు దక్కకపోవడం

మిగతా 11వ పేజీలో...

# అనారోగ్య టెకీలు!

- ఐటీ ఉద్యోగుల్లో 61% మందిలో హై కొలెస్ట్రాల్
- 37 శాతం మందిలో ఏదో ఒక దీర్ఘకాలిక రుగ్మత
- పాతికేళ్లలోపు వారిలో కొవ్వు స్థాయిలు అస్తవ్యస్తం
- 25-40 లోపు ఉన్న 56 వేల మందిపై అధ్యయనం
- 8 అంశాలపై హెచ్‌సీఎల్ హెల్త్ కేర్ పరీక్షలు
- యాంత్రిక జీవనశైలితో 40 ఏళ్లలోపే ఇబ్బందులు
- చాలామందిలో సంతానలేమి: వైద్య నిపుణులు



హైదరాబాద్, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మీరు ఐటీ ఉద్యోగులా? మీ ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉంటున్నారా? తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటున్నారా? ఇవన్నీ ఎందుకంటే.. ఐటీ ఉద్యోగులు తీవ్ర ఆరోగ్య పరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లు.. వారి హెల్త్ పారామీటర్స్ అస్తవ్యస్తంగా ఉన్నట్లు హెచ్‌సీఎల్ హెల్త్ కేర్ సంస్థ హెచ్చరిస్తోంది. దేశవ్యాప్తంగా 56వేల మంది ఐటీ ఉద్యోగుల ఆరోగ్య స్థితిగతులపై ఈ సంస్థ అధ్యయనం చేసింది వీరిలో 77 శాతం మంది ఆరోగ్య విలువలు చాలా అస్తవ్యస్తంగా ఉన్నట్లు తేల్చింది. ముఖ్యంగా 61 శాతం మంది అధిక కొవ్వు సమస్యతో బాధపడుతున్నట్లు పేర్కొంది. క్లినికల్ స్టడీ చేసిన

మిగతా 2వ పేజీలో...





# ఎండీసీలో మహా మాయగాళ్లు

ఖనిజ తవ్వకాలను పర్యవేక్షించే ఆ విభాగంలో అవినీతి గుట్టలు పడుతోంది. ఒకరిది తవ్వితీస్తే, అదే వరసలో అనేకమంది అక్రమాలు, వసూళ్ల దందా బయటకొచ్చి.. అందరూ చిక్కుల్లో పడతామనే భయంతో ఎవరూ కిమ్మనడం లేదు. ఈ క్రమంలో ఏపీఎండీసీలోని మార్కెటింగ్ విభాగానికి సంబంధించిన ఓ అధికారి వసూళ్లలో సర్వాంతర్యామిగా మారితే, అక్కడి ఆర్థిక విభాగంలోని మరో అధికారి సొంతంగానే రూ.వందల కోట్ల విలువైన కాంట్రాక్టులు చేసే స్థాయికి ఎదిగారు. ఏకంగా స్పెషల్ కౌంటర్‌నే తెరిచారు.

## బెరైటీస్,బొగ్గు, ఇసుక, సర్వేరాళ్లలో కుమ్ముడే కుమ్ముడు

- సర్వాంతర్యామిగా మారిన మార్కెటింగ్ అధికారి
- అన్ని విభాగాల ఫైళ్లూ ఆయనకు చేరాల్సిందే
- 'డిస్కస్' అన్నారంటే కోట్లు కుమ్మరించాల్సిందే
- కార్పొరేట్ లాబీయిస్టుతో కలిసి ఉమ్మడి దందాలు
- అవినీతి కంపులో ఫైనాన్స్ అధికారి
- బిల్ విడుదలవ్వాలంటే ముడుపు కట్టాల్సిందే
- ఆయనను చూసి కిందివారూ చేతివాటం
- ఫోన్‌పే, జీపేల్లో లక్షల రూపాయల లావాదేవీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)లో మహామాయగాళ్లు విజృంభిస్తున్నారు. బరితెగించి మరీ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. బెరైటీస్, బొగ్గు, ఇసుక, సర్వేరాళ్లు తదితర టెండర్లలో చేతివాటాన్ని ప్రదర్శిస్తూ కోట్లరూపాయలు దండుకుంటున్నారు. అది మరీ పరాకాష్ఠకు చేరింది. అధికారికంగా ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల ద్వారా లక్షల రూపాయలు పొందుతున్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?..ఉన్నతస్థాయి అధికారులు కోట్ల రూపాయలు దండుకుంటుంటే కిందిస్థాయి వారు దాన్ని ఆదర్శంగా తీసుకొని రెచ్చిపోతున్నారు. ఎండీసీలోని మార్కెటింగ్ విభాగానికి సంబంధించిన ఓ అధికారి వసూళ్ల దందాలో సర్వం తానై వ్యవహరిస్తున్నారు. ఆర్థిక విభాగంలోని మరో అధికారి ఏకంగా సొంతదుకాణమే తెరిచేశారు. ఆయన ఇప్పుడు రూ.వందల కోట్ల విలువైన కాంట్రాక్టులు చేస్తున్నట్టు సమాచారం. ఇదే ఇప్పుడు ఎండీసీలో హాట్ టాపిక్‌గా మారింది. ఎండీసీలో

మిగతా 12వ పేజీలో...

# పొలం వద్ద నరికి చంపారు

## శ్రీసత్యసాయి జిల్లాలో టీడీపీ నేత దారుణ హత్య





విలపిస్తున్న అమరనాథ్ రెడ్డి కుటుంబ సభ్యులు

- ప్రచారం నుంచి వచ్చిన కాసేపటికే దారుణం
- రాజకీయ కోణంపై సర్వత్రా సందేహాలు
- వ్యక్తిగత కారణాలే అంటున్న పోలీసులు

రాష్ట్రంలో కొనసాగుతున్న హత్యా రాజకీయాలు

నల్లమాడ, మార్చి 25: కీలకమైన ఎన్నికల వేళ.. రాష్ట్రంలో హత్యారాజకీయాలు కొనసాగుతున్నాయి. ఇటీవలే మూడు జిల్లాల ఎస్పీలను పిలిచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి హెచ్చరించినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. తాజాగా శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ నాయకుడు డి. అమరనాథ్ రెడ్డి(42) దారుణ హత్యకు గురయ్యారు. నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన ఆయన.. ఆదివారం పగలంతా టీడీపీ అభ్యర్థి ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం, రాత్రి పొలం వద్దకు వెళ్లారు. సోమవారం

మిగతా 3వ పేజీలో...

## పిల్ల దొంగలు

- బ్యాంకును దోచిన లిటిల్ రాస్కెల్స్
- అమెరికాలో ఘటన.. వారం తర్వాత అరెస్టు.. అందరూ 16 ఏళ్లలోపు వారే

2

## ఎల్‌నినో తగ్గినా.. ఎండలే!

- బలహీనపడుతున్న ఎల్‌నినో
- అయినా మంచి వర్షాలు కురుస్తాయని చెప్పలేం: నిపుణులు



# టెట్ ఫలితాల్లో నాటకం

- షెడ్యూలు ప్రకారం 14నే విడుదల చేయాలి
- కోడ్ వచ్చేవరకు పాఠశాల విద్యాశాఖ మౌనం
- ఇప్పుడు ఈసీ అనుమతికి పంపామని సాకు
- డీఎస్సీ పరీక్షల నిర్వహణ కూడా కష్టమే!
- టెట్ ఫీజులు వెనక్కి ఇవ్వకుండా తాత్సారం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ముందు సాధ్యం కాదని తెలిసినా నిరుద్యోగులను మోసం చేసేలా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన జగన్ సర్కారు అసలు ఉద్దేశం బయటపడుతోంది. డీఎస్సీకి ముందు నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు విడుదల చేయడంలోనే ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఎలాగోలా టెట్ పూర్తిచేసిన పాఠశాల విద్యాశాఖ ఇంతవరకూ ఫలితాల విడుదల ఊసెత్తడం లేదు. ప్రకటించిన షెడ్యూలు కంటే ముందుగానే పరీక్షలు ముగిసినా.. షెడ్యూలు ప్రకారం ఈనెల 14నే టెట్ ఫలితాలు విడుదల చేయాల్సి ఉన్నా మౌనం దాల్చింది. తీరా 16న ఎన్నికల షెడ్యూలు విడుదల చేసిన అనంతరం, ఫలితాల విడుదల అంశంపై ఈసీని స్పష్టత కోరామని

మిగతా 12వ పేజీలో...



3

## డ్రగ్స్ కేసులో కాల్‌డేటా సేకరణ

### అన్ని కోణాల్లో సీబీఐ దర్యాప్తు

- లేబొరేటరీ నివేదిక కోసం ఎదురుచూపులు
- అది అందాకే అరెస్టులకు అవకాశం
- సంధ్య కంపెనీకి 'బస్సు' అప్పగింత
- కాకినాడ పోలీసుల తీరుపై అనుమానాలు

## ఆధారాలు మాయం చేసేందుకు జగన్ మాఫియా కుట్ర

- 'సంధ్య' బస్సులో దొరికిన రికార్డులను సీబీఐకి ఎందుకు ఇవ్వలేదు?
- వ్యవహారమంతా తాడేపల్లి ఆదేశాలతోనే: టీడీపీ

3

# రేవంత్ ఇంటిపై నిఘా



సోమవారం మనవడితో రేవంత్ హోలీ వేడుక



## ప్రతి మాటా వినేశారు!

### ఫోన్ ట్యాపింగ్ కాదు.. ఇంటినే 'ట్యాప్' చేశారు

- ఇందుకోసం ఇజ్రాయెల్ నుంచి పరికరం
- ఆయన నివాసం సమీపంలో సెటప్
- ఎలక్ట్రానిక్స్ డివైజ్‌ల మైక్రోఫోన్‌లోకి చొరబాటు
- రేవంత్ ఇంట్లో సంభాషణలన్నీ విన్న ఎస్ఐబీ
- కన్నడ ఎన్నికల వేళ అక్కడి కాంగ్రెస్ నేతలపైనా..

హైదరాబాద్ సిటీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ గురించి విన్నాం! కానీ... మొత్తం ఇంటినే 'ట్యాప్' చేయడం గురించి విన్నారా? ఇంట్లో చీమ చిటుక్కుమన్నా వినగలిగే 'దొంగ చెవులు' ఉన్నాయని తెలుసా? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విపక్ష నేతగా ఉండగా అదే జరిగింది. ఆయన నివాసంలో కుటుంబ సభ్యులు, ఇతరులు మాట్లాడుకున్న ప్రతి మాటనూ రహస్యంగా వినేశారు. వెరసి... బీఆర్ఎస్ సర్కారు హయాంలో

మిగతా 11వ పేజీలో...

# జేఎన్‌యూకు 30 ఏళ్ల తర్వాత దళిత ప్రెసిడెంట్

» విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన ధనంజయ్



న్యూఢిల్లీ, మార్చి 25: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం ఎన్నికల్లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఓ దళితుడు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) తరఫున పోటీ చేసిన ధనంజయ్ తన సమీప ప్రత్యర్థి అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)కు చెందిన ఉమేశ్ సి అజ్మీరాపై 922 ఓట్ల తేడాతో గెలుపొందారు. 1996-97లో లెఫ్ట్ కూటమికి చెందిన బట్టీలాల్ బైర్వా తర్వాత ఓ దళితుడు జేఎన్‌యూ విద్యార్థి సంఘానికి ప్రెసిడెంట్‌గా ఎన్నికవడం ఇదే తొలిసారి. అలాగే జేఎన్‌యూ విద్యార్థి సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా ఎస్ఎఫ్ఐకి చెందిన అవిజిత్ ఘోష్ గెలుపొందగా, జనరల్ సెక్రటరీగా బిర్సా అంబేడ్కర్ పూలే స్టూడెంట్స్ అసోసియేషన్ (బాప్సా)కు చెందిన ప్రియాంశీ ఆర్యా ఎన్నికయ్యారు. జాయింట్ సెక్రటరీగా లెఫ్ట్ కూటమికి చెందిన మహమ్మద్ సాజిద్ గెలుపొందారు. నాలుగేళ్ల విరామం తర్వాత జేఎన్‌యూలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష కూటమికి చెందిన అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేశారు.

# పిల్ల దొంగలు

బ్యాంకును దోచేసిన 'లిటిల్ రాస్కెల్స్'

అమెరికాలో ఘటన.. వారం తర్వాత అరెస్టు

టెక్సాస్, మార్చి 25: వాళ్లు ముగ్గురూ పిల్లలే. ఒకడి వయస్సు 11 ఏళ్లు. మరొకడికి 12, ఇంకొకడికి 16 ఏళ్లు. ఇంట్లో అడిగితే తల్లిదండ్రులు డబ్బులివ్వలేదో.. మరే వ్యసనానికైనా అలవాటు పడ్డారో.. అవసరాల కోసం ఏకంగా బ్యాంకులోనే దొంగతనానికి పాల్పడ్డారు. క్యాషియర్‌ను బెదిరించి చేతికి అందిన డబ్బులతో ఉడాయించారు. ఈ నెల 14వ తేదీన టెక్సాస్‌లోని వెల్స్ ఫార్గో బ్యాంకులో ఈ ఘటన జరిగింది. ఇదంతా అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డు అయింది. ఈ ముగ్గురి ఫొటోలను ఎఫ్‌బీఐ ఎక్స్‌లో పోస్టు చేస్తూ "ఈ లిటిల్ రాస్కెల్స్‌ను గుర్తించడానికి సాయం చేయండి" అని ప్రజలను కోరింది. అయితే, ఈ ముగ్గురిలో ఇద్దరిని వాళ్ల తల్లిదండ్రులే గుర్తించి ఎఫ్‌బీఐకి ఫోన్ చేసి పట్టించారు. మరో బాలుడిని పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. మొత్తానికి దొంగతనం జరిగిన వారం రోజుల తర్వాత ఈ నెల 21న ఎఫ్‌బీఐ ఆ ముగ్గురు పిల్ల దొంగలను అరెస్టు చేసింది.

# ముంబై ఎయిర్‌పోర్టులో రూ.19.79 కోట్ల కొకైన్!

» విదేశీ మహిళ నుంచి స్వాధీనం

న్యూఢిల్లీ, మార్చి 25: ముంబై ఎయిర్‌పోర్టులో నిషేధిత మత్తు పదార్థం కొకైన్‌తో దిగిందో విదేశీ మహిళ! ఆమె వద్ద రూ.19.79 కోట్ల విలువైన 1979 గ్రాముల విలువైన కొకైన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు పశ్చిమ ఆఫ్రికాలోని సియెర్రా లియోన్ దేశస్తురాలని.. కెన్యా రాజధాని నైరోబీ నుంచి ముంబైలో దిగిందని నిర్ధారించారు. ఆమె లగేజీలోని షూ, మాయిశ్చరైజర్ బాటిల్, షాంపూ బాటిళ్లు బరువుగా ఉండటంతో అనుమానించి తనిఖీ చేయగా పొట్లాల రూపంలో భారీగా కొకైన్ బయటపడినట్లు వెల్లడించారు. ఆమెను అరెస్టు చేశారు.

## లోకం తీరు




## ఉష్ణోగ్రతలు

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కర్నూల | 39.5 | 25.8 |
| నంద్యాల | 39.0 | 26.0 |
| ఏలూరు | 38.0 | 24.0 |
| విజయవాడ | 37.3 | 24.0 |
| తిరుపతి | 37.0 | 24.0 |
| ఒంగోలు | 34.4 | 25.2 |
| బాపట్ల | 33.8 | 23.0 |

## ఎల్‌నినో తగ్గినా.. ఎండలే!

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై తీవ్ర ప్రభావం చూపిన ఎల్‌నినో నెమ్మదిగా బలహీనపడుతోంది. కొద్ది రోజులుగా పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుతుండడం ఇందుకు సంకేతమని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఎల్‌నినో ఇప్పటికిప్పుడు కాకుండా నిదానంగా బలహీనపడుతుందని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో తిరోగమన దశ మొదలైనా వచ్చే రెండు, మూడు నెలలు దేశంలో ఎండలు మాత్రం ఎక్కువగానే ఉంటాయని చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూపర్ ఎల్‌నినో తన తీవ్రత తగ్గించుకునే దిశగా పయనిస్తోందని, అదే జరిగితే ఈ ఏడాది మే నాటికి తటస్థ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. అయితే ఒక్క ఎల్‌నినో బలహీనపడినంత మాత్రాన నైరుతి రుతుపవనాల సమయంలో మంచి వర్షాలు కురుస్తాయని ఒక అంచనాకు రాకూడదని వాతావరణవేత్తలు పేర్కొంటున్నారు. కాగా, గతేడాది జనవరిలో ఎల్‌నినో తీవ్రత మొదలై నైరుతి రుతుపవనాల సీజన్‌లో మరింత బలంగా కొనసాగింది. దీంతో భారత్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఈ యేడు జూన్ నాటికి లానినా ప్రారంభమై క్రమేపీ దాని ప్రభావం పెరుగుతుందని అంచనా.

# లండన్‌లో రోడ్డు ప్రమాదం.. భారతీయ విద్యార్థిని మృతి



లండన్, మార్చి 25: లండన్‌లో ఓ భారతీయ విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. హరియాణాకు చెందిన చేష్టా కొచర్(33) ప్రఖ్యాత లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఈనెల 19న వర్సిటీ నుంచి సైకిల్‌పై ఇంటికి వస్తున్న ఆమెను ఓ ట్రక్కు బలంగా ఢీకొట్టింది. తీవ్ర గాయాలయిన ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చేష్టా కొచర్ గతంలో నీతిఆయోగ్‌లో పనిచేశారు. చేష్టా మృతికి నీతిఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్‌కాంత్ ఎక్స్(ట్విటర్)లో సంతాపం తెలిపారు. చేష్టా భర్త ప్రశాంత్ గౌతమ్ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు.

## ఉజ్జయినీ ఆలయంలో అగ్ని ప్రమాదం!

» పూజారులు సహా 14 మందికి గాయాలు

ఉజ్జయినీ, మార్చి 25: హోలీ పర్వదినాన మధ్యప్రదేశ్ ఉజ్జయినీ మహాకాళేశ్వర్ ఆలయంలో విషాదం చోటు చేసుకుంది. పండుగ కావడంతో సోమవారం తెల్లవారుజాము నుంచే గర్భగుడిలో పూజలు ప్రారంభించారు. ఉదయం 5.55 గంటల సమయంలో 'భస్మహారతి' ఇస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పూజారులు, ఆలయ సేవకులు సహా మొత్తం 14 మంది అందులో చిక్కుకొని గాయపడ్డారు. హారతి సమయంలో కర్పూరం వెలుగుతుండగా గులాల్ చల్లడంతో అగ్గి రాజుకుందని.. గర్భగుడిలో రంగులు పడకుండా కట్టిన వస్త్రాలకు మంటలు అంటుకొని ప్రమాదం జరిగిందని ఉజ్జయినీ కలెక్టర్ నీరజ్ కుమార్ వివరించారు. గాయపడినవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. క్షతగాత్రులకు ఒక్కొక్కరికి రూ.లక్ష సాయంతో పాటు వారికి అత్యుత్తమ చికిత్స ఉచితంగా అందిస్తామని సీఎం మోహన్‌యాదవ్ అన్నారు. ఘటనపై ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు.

## అరుణాచల్ మాదే..భారతే ఆక్రమించింది: చైనా

బీజింగ్, మార్చి 25: పేచీకోరు చైనా మరోసారి అరుణాచల్ ప్రదేశ్ తమదేనని అడ్డగోలు వాదనకు దిగింది. గతంలో అక్కడ తమ ప్రాబల్యం కొనసాగిందని పేర్కొంది. జాంగ్‌నాన్ (అరుణాచల్‌కు చైనా పెట్టుకున్న పేరు)ను భారత్ ఆక్రమించిందని ఆరోపించింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు ఇంకా అస్థిరంగానే ఉందని వ్యాఖ్యానించింది. అరుణాచల్‌పై చైనా వాదనలను పిచ్చి ప్రేలాపన అని, ఇలాంటి హాస్యాస్పద వైఖరి దేశానికి కొత్తేమీ కాదని భారత విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం కొట్టిపారేశారు. దీనిపై స్పందనగా చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ సోమవారం మీడియాతో మాట్లాడారు. జాంగ్‌నాన్ ఎప్పటికీ తమదేనని చెప్పుకొచ్చారు. భారత్ దురాక్రమణకు ముందు అక్కడ చైనా సమర్థ పాలన సాగించిందన్నారు. 1987లో జాంగ్‌నాన్‌కు భారత్ అరుణాచల్ ప్రదేశ్‌గా పేరు పెట్టిందన్నారు. కాగా, అరుణాచల్ గురించి చైనా ఈ నెలలో నాలుగోసారి ప్రస్తావించింది.

## కాంగ్రెస్ ఆరో జాబితా విడుదల

న్యూఢిల్లీ, మార్చి 25: కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ గుంజాల్‌ను పోటీకి దించింది. ఆ పార్టీ సోమవారం ఐదుగురు లోక్‌సభ అభ్యర్థులతో ఆరో జాబితా విడుదల చేసింది. రాజస్థాన్‌లోని కోట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న స్పీకర్ ఓం బిర్లాపై ప్రహ్లాద్ గుంజాల్‌ను బరిలోకి దింపింది. అలాగే అజ్మేర్ నియోజకవర్గం నుంచి రామచంద్ర చౌధరి, రాజ్‌సమంద్ నుంచి సుదర్శన్ రావత్, భిల్వారా నుంచి దామోదర్ గుర్జర్, తిరునల్వేలి నుంచి సి. రాబర్ట్ బ్రూస్‌లను అభ్యర్థులుగా ప్రకటించింది. ప్రహ్లాద్ గుంజాల్ గురువారమే కాంగ్రెస్‌లో చేరారు. ఈయన రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే అనుచరుడు. ఆయన చేరికతో రాజస్థాన్‌లోని హదోతి ప్రాంతంలో కాంగ్రెస్ బలోపేతం అవుతుందని అంచనా. సోమవారం ప్రకటించిన ఆరో జాబితాతో లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ మొత్తం 190 మంది అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది.

## మాస్కోలో ఉగ్రదాడి తజాక్ పౌరుల పనే

» నేరాన్ని అంగీకరించిన నలుగురు ముష్కరులు

మాస్కో, మార్చి 25: మాస్కోలో సంగీత కచేరీపై కాల్పులకు తెగబడి.. 137 మంది మరణానికి కారకులైన నలుగురు ముష్కరులను రష్యా సెక్యూరిటీ సర్వీసెస్ అధికారులు ఆదివారం కోర్టులో ప్రవేశపెట్టారు. ఆ నలుగురిని తజకిస్థాన్‌కు చెందిన దలేర్డ్‌జాన్ మిర్జొయెవ్, సైదాక్రమీ రాచబలిజోవడా, షమ్సీదీన్ ఫరిదునీ, ముఖమ్మద్సోబిర్ ఫైజోవ్‌గా గుర్తించారు. వారందరికీ ముఖంపై ముష్టిఘాతాల గుర్తులున్నాయని, ముఖమ్మద్సోబిర్‌ను వీల్‌చైర్‌పై తీసుకువచ్చారని రష్యా మీడియా పేర్కొంది. ముఖమ్మద్సోబిర్ కోర్టులో ట్రయల్ జరుగుతున్నంతసేపు అపస్మారకస్థితిలో ఉన్నట్లు పేర్కొంది. మిగతా ముగ్గురు తమ నేరాన్ని అంగీకరించినట్లు వివరించింది. కోర్టు ఆ నలుగురు నిందితులను మే 22 వరకు దర్యాప్తు అధికారుల కస్టడీకి అప్పగిస్తూ.. విచారణను వాయిదా వేసింది. ఈ దాడి వెనక ఉక్రెయిన్ హస్తముందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. అయితే.. అమెరికా మాత్రం ఈ ఘటనకు ఇస్లామిక్ స్టేట్(ఐఎస్) ఉగ్రవాదులే కారణమని స్పష్టం చేసింది.

## ఇంటి కోసం బాలుడి కిడ్నాప్.. హత్య

» మహారాష్ట్రలోని గోరేగావ్‌లో ఘోరం

థానే, మార్చి 25: ఒక పెద్ద ఇంటిని నిర్మించాలనే అత్యాశతో డబ్బు కోసం.. ఓ వ్యక్తి తొమ్మిదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి హత్య చేశాడు. మహారాష్ట్ర థానే బద్లాపూర్‌లోని గోరేగావ్ గ్రామంలో ఈ ఘోరం జరిగింది. గోరేగావ్‌లో దర్జీ అయిన సల్మాన్ మౌల్వీకి నూతన ఇంటిని నిర్మించడం కోసం డబ్బు అవసరమైంది. దాని కోసం తన ఇంటి పక్కన నివసించే ఇబాద్ అనే 9 ఏళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేయాలని పథకం రచించాడు. ఆదివారం సాయంత్రం నమాజ్‌కు వెళ్తున్న ఇబాద్‌ను కిడ్నాప్ చేసి అతని తండ్రికి కొత్త నంబర్ నుంచి ఫోన్ చేసి రూ. 23లక్షలు కావాలని డిమాండ్ చేశాడు. భయపడిన ఇబాద్ తండ్రి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా పోలీసులు లొకేషన్‌ను ట్రేస్ చేసి సల్మాన్ ఇంటికి వెళ్లి గాలించగా అతని ఇంటి వెనుక గోనె సంచిలో ఇబాద్ శవం కనిపించింది. సల్మాన్‌తో పాటు అతని సోదరుడు సాఫాన్ మౌల్వీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నేరంలో సల్మాన్ కుటుంబసభ్యుల ప్రమేయం కూడా ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

## వయనాడ్‌లో రాహుల్‌పై సురేంద్రన్ పోటీ

న్యూఢిల్లీ, మార్చి 25: కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీకి గట్టి పోటీనివ్వాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నిర్ణయించుకుంది. ఈమేరకు రాహుల్‌కు పోటీగా బలమైన అభ్యర్థిని వ్యూహాత్మకంగా రంగంలోకి దింపింది. బీజేపీ కేరళ అధ్యక్షుడు కె.సురేంద్రన్.. వయనాడ్ నుంచి పోటీ చేయనున్నట్టు ఆ పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం ఇదే నియోజకవర్గం నుంచి రాహుల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మరోవైపు ఈ నియోజకవర్గం నుంచి సీపీఐ తరఫున అన్నీ రాజా పోటీ చేస్తున్నారు. ఉత్తర కేరళలో ప్రముఖనేతగా ఉన్న సురేంద్రన్.. 2020 సంవత్సరం నుంచి బీజేపీ కేరళ అధ్యక్షుడిగా ఉన్నారు. కోజికోడ్ జిల్లాకు చెందిన ఆయన భారతీయ జనతా యువ మోర్చా వయనాడ్ జిల్లా అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. కేరళలో 20 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26న ఎన్నికలు నిర్వహించనున్నారు.

# దాహం.. దాహం..

## ఈసారి తాగునీటికి కటకటే

» దక్షిణాదితోపాటు పలు ఇతర రాష్ట్రాల్లోనూ సమస్య

» బెంగళూరుపై ఇప్పటికే కనిపిస్తున్న ప్రభావం

» రిజర్వాయర్లలో గణనీయంగా తగ్గిన నీటినిల్వలు



*ఎండాకాలం వస్తోందంటే మండే ఎండలు, ఉక్కపోత, వడదెబ్బ గుర్తుకొస్తాయి. వాటి నుంచి తట్టుకోవటానికి రకరకాల చిట్కాలు, జాగ్రత్తలు పాటిస్తాం. కానీ, ఈసారి ఎండాకాలం వేడితోపాటు తాగునీటి ఎద్దడినీ తీసుకొచ్చే ప్రమాద సంకేతాలున్నాయి. తెలంగాణ, ఏపీతోపాటు ఇతర దక్షిణాది రాష్ట్రాలలో, అటు ఉత్తరాదిలో కూడా తాగునీటికి కటకట నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి.*

దేశంలో తాగునీటి అవసరాలను తీర్చే ప్రధాన రిజర్వాయర్లు 150. ప్రస్తుతం వీటి మొత్తం సామర్థ్యంలో 38 శాతం మేర మాత్రమే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఇది గత దశాబ్ద కాలం సగటు కంటే తక్కువ. దీని ప్రభావం ఇప్పటికే బెంగళూరులో కనిపిస్తోంది. నగరానికి ప్రతి రోజూ 2,600 మిలియన్ లీటర్లు (ఎంఎల్‌డీ) అవసరం కాగా.. ప్రస్తుతం కనీసం 500 మిలియన్ లీటర్ల వరకూ కొరత ఉంటోంది. బెంగళూరుకు 1470 ఎంఎల్‌డీ నీళ్లు కావేరీ నది నుంచి లభిస్తుండగా, 650 ఎంఎల్‌డీ నీళ్లు బోరుబావుల ద్వారా అందుబాటులో ఉంటాయి. కానీ, నగరంలో ఉన్న 14 వేల బోరుబావుల్లో 6,900 ఎండిపోయాయి. అనేక చెరువులు కబ్జాలకు గురై కనుమరుగు కాగా, మిగిలినవి నీళ్లు లేక నెర్రెలు బారాయి. మరోవైపు కావేరి నదిలో నీటిమట్టం తగ్గిపోయింది. ఈ కారణాల నేపథ్యంలో బెంగళూరు దాహంతో కొట్టుమిట్టాడుతోంది. అయితే, ఈ సమస్య ఆ నగరానికే పరిమితమయ్యేలా లేదు. పొరుగునున్న దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుతో పాటు హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్, త్రిపుర, రాజస్థాన్, బిహార్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్ కూడా ఈ వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కోవచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ రాష్ట్రాల్లోని రిజర్వాయర్లలో గత ఏడాదితో పోల్చితే ఈసారి నీటి మట్టాలు గణనీయంగా తగ్గాయి.

### తాగునీటితో కార్లు కడుగుతారా?

బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): తాగునీటికే కటకట మంటున్న పరిస్థితుల్లో.. కార్లు కడగడానికి కావేరీ నీటిని వాడేసిన 22 మందికి బెంగళూరు జలమండలి అధికారులు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున రూ.1.1 లక్షల జరిమానా విధించారు. బెంగళూరు దక్షిణ విభాగం పరిధిలో.. కావేరి నీటిని కార్లు కడగడానికి వృథా చేస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 22 కుటుంబాల గురించి సోషల్ మీడియా ద్వారా స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో జలమండలి అధికారులు రంగంలోకి దిగి జరిమానా వసూలు చేశారు.

### రిజర్వాయర్లలో 38 శాతం నీటి నిల్వలే!

దేశ ప్రజలు తాగు నీటి కోసం ఆధారపడే 150 ప్రధాన రిజర్వాయర్ల పూర్తి సామర్థ్యం 178.784 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం). ఇది దేశంలో అన్ని వనరుల ద్వారా అందుబాటులో ఉండే మొత్తం తాగునీరు 257.812 బీసీఎంలో దాదాపు 69.35 శాతం. గురువారం నాటి రిజర్వాయర్ స్టోరేజీ బులిటన్ ప్రకారం.. ఈ రిజర్వాయర్లలో 67.591 బీసీఎం నీటి నిల్వలున్నాయి. అంటే వాటి మొత్తం సామర్థ్యంలో కేవలం 38 శాతం. గత ఏడాది ఇదే సమయంలో వీటిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు 80.557 బీసీఎం. ఇక గత దశాబ్ద కాలంలో సగటున వీటిలో ఉన్న నీరు 72.396 బీసీఎం. అంటే ఈ ఏడాది రిజర్వాయర్లలో నీరు గణనీయంగా తగ్గిపోయింది. దక్షిణాది రాష్ట్రాల విషయానికొస్తే.. మొత్తం 53.334 బీసీఎంల నీటినిల్వ సామర్థ్యమున్న 42 రిజర్వాయర్లు ఈ రాష్ట్రాల తాగునీటి అవసరాలను తీరుస్తున్నాయి. కానీ, గురువారం నాటి రిజర్వాయర్ స్టోరేజీ బులిటన్ ప్రకారం.. ఈ రిజర్వాయర్లలో ఉన్న నీళ్లు కేవలం 12.287 బీసీఎం మాత్రమే. అంటే, వాటి మొత్తం సామర్థ్యంలో 23 శాతం మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఇదే సమయానికి ఈ రిజర్వాయర్లలో 39 శాతం నీటి నిల్వలు ఉండగా, గత పదేళ్ల సగటు 32 శాతం. తాగునీటికి కటకట పరిస్థితులు దేశవ్యాప్తంగా ఉన్నట్టుగానే దక్షిణాదిలోనూ నెలకొన్నాయని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### కారణాలేమిటి?

గత ఏడాది వర్షాలు సరిగా పడలేదు. 2018 తర్వాత అత్యల్ప వర్షపాతం 2023లోనే నమోదైంది. ఎల్‌నినో కారణంగా గత ఆగస్టు నెల.. గడిచిన వందేళ్లకుపైగా కాలవ్యవధిలో అత్యంత వర్షాభావం ఉన్న మాసంగా వాతావరణ రికార్డుల్లో నమోదైంది. గత ఏడాది రుతుపవనాలు కూడా అంతటా సమానంగా విస్తరించలేదు. కొన్ని ప్రాంతాల్లో వానలు బాగా పడగా.. మరికొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే, ఈసారి తాగు నీటికి కటకట నెలకొంది. కాగా, భారత్‌లోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు గణనీయంగా తగ్గిపోతున్నాయని ఐక్యరాజ్యసమితి ఇటీవల వెలువరించిన నివేదికలో హెచ్చరించింది. వచ్చే ఏడాదికి కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, యూపీ, ఢిల్లీలతో కూడిన వాయువ్యప్రాంతంలో భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోతాయని తెలిపింది.

- సెంట్రల్ డెస్క్

# కేజ్రీవాల్‌కు మద్దతుగా ఆప్ సోషల్ మీడియా ఉద్యమం

» రాజ్యాంగ పరిరక్షణ పేరిట పోరాటం



న్యూఢిల్లీ, మార్చి 25: మద్యం విధానం కేసులో అరెస్టయి కస్టడీలో ఉన్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆమ్ ఆద్మీ పార్టీ అండగా నిలుస్తోంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్యలను ప్రశ్నిస్తుండడంతోపాటు రాజ్యాంగ రక్షణ కోసమంటూ సామాజిక మాధ్యమాల్లో ఉద్యమాన్ని ప్రారంభించింది. ఢిల్లీ మంత్రి అతిషి సోమవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజ్యాంగ రక్షణ కోసం సోషల్ మీడియాలో పోరాటం ప్రారంభించామని చెప్పారు. ఆప్ కార్యకర్తలు, నాయకులు అందరూ 'డీపీ (డిస్‌ప్లే పిక్చర్) కాంపెయిన్' నిర్వహిస్తారని తెలిపారు. 'డీపీ' కింద కటకటాల వెనుక ఉన్న కేజ్రీవాల్ ఫొటో పెడుతారని చెప్పారు. దాని కింద 'మోదీ కే సబ్‌సే బడా దార్ కేజ్రీవాల్' (మోదీని ఎదిరించే మొనగాడు కేజ్రీవాల్) అన్న క్యాప్షన్ పెడుతారు. రెండేళ్ల క్రితం ఉపయోగించిన ఫోన్‌ను కేజ్రీవాల్ ధ్వంసం చేశారని, మద్యం కుంభకోణానికి సంబంధించిన కీలక సమాచారం అందులో ఉండి ఉండవచ్చని ఈడీ వర్గాలు చెప్పడంపైనా అతిషి అభ్యంతరం చెప్పారు. ఆ ఫోన్ కనిపించడం లేదని, అదెక్కడ ఉందో కూడా తెలియదని దర్యాప్తులో కేజ్రీవాల్ చెప్పినట్టు పేర్కొన్నాయి. ఈ కేసులోని సాక్షులు మొత్తం 170 సెల్‌ఫోన్లను పారవేసి, ఆధారాలు నాశనం చేసినట్టు గతంలో ఈడీ వర్గాలు తెలిపాయి. ఇదే విషయాన్ని అఫిడవిట్ రూపంలో జడ్జి ముందు కోర్టులో చెప్పాలని అతిషి డిమాండ్ చేశారు. మరోవైపు కేజ్రీవాల్ భార్య సునీత పలువురు కార్యకర్తలతో కలిసి సోమవారం ఈడీ ప్రధాన కార్యాలయానికి వెళ్లి అక్కడికి విచారణకు హాజరైన కేజ్రీవాల్‌తో మాట్లాడారు. కాగా జైలులో ఉన్న కేజ్రీవాల్‌కు ఎలాంటి కంప్యూటర్లు, కాగితాలు సమకూర్చలేదని ఈడీ స్పష్టం చేసింది. అలాంటప్పుడు ఢిల్లీలోని మంచినీటి సమస్య విషయమై జైలు నుంచే ఏవిధంగా ఆదేశాలిచ్చారో ఆరా తీస్తామని తెలిపింది. జైలు నుంచే ఉత్తర్వులు ఇచ్చారంటూ చెప్పిన మంత్రి అతిషి నుంచి వివరాలు సేకరిస్తామని పేర్కొంది. జైలు నుంచే కేజ్రీవాల్ లేఖ ఇచ్చారంటూ మంత్రి చెప్పడాన్ని బీజేపీ ఖండించింది. అనుకున్న ప్రకారం జరుగుతున్న నాటకమని విమర్శించింది.

# అనారోగ్య టెకీలు!



(మొదటి పేజీ తరువాయి)

తర్వాత హెచ్‌సీఎల్ హెల్త్‌కేర్ ఈ వివరాలు వెల్లడించింది. ఈ స్టడీని 25-40ఏళ్లలోపువారిపై చేశారు. వీరందరికీ వారి పని ప్రదేశాల వద్దే వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. దేశంలోని కార్పొరేట్ వ్యవస్థల్లో పనిచేసే ఉద్యోగుల్లో పెరుగుతున్న అనారోగ్య పరిస్థితులను నివారించే లక్ష్యాన్ని నొక్కి చెప్పడమే ఈ అధ్యయన ప్రధాన ఉద్దేశమని హెచ్ఎస్ఎల్ పేర్కొంది. ఊబకాయం, ప్రిడయాబెటీస్, డయాబెటీస్, ప్రి హైపర్‌టెన్షన్, రక్తపోటు, రక్తహీనత, హైపోథైరాయిడిజమ్, అధిక కొవ్వులాంటి కీలకమైన 8 అంశాలను పరీక్షించారు. ఉద్యోగుల్లో 22%మంది ఊబకాయం, 17% ప్రిడయాబెటిస్‌తో, 11% రక్తహీనత, హైపో థైరాయిడిజంతో, 7% మధుమేహంతో ఇబ్బంది పడుతున్నట్లు అధ్యయనం తేల్చింది. ఉద్యోగుల్లో ప్రతి ఒక్కరూ ఒకటికంటే ఎక్కువ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. పాతికేళ్లలోపు వారిలో కొవ్వు స్థాయిలు చాలా అస్తవ్యవస్తంగా ఉన్నట్లు, వీరిలో 14% రక్తహీనతతో, 13% ఊబకాయంతో, 8%హైపోథైరాయిడిజంతో, 7% ప్రిడయాబెటీస్‌తో బాధపడుతున్నట్లు వెల్లడైంది. ఇలాంటి దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులు చాలా వేగంగా పెరుగుతున్నట్లు కనిపిస్తున్నాయని అధ్యయన సంస్థ తెలిపింది. వయసు పెరిగే కొద్ది ఈ సమస్యలు పెరిగే అవకాశాలున్నాయని.. ప్రధానంగా 40ఏళ్లు దాటిన వారిలో చాలా ప్రమాదకరస్థితిలో ఈ పారామీటర్స్ పెరుగుతున్నట్లు వెల్లడించింది. ప్రధానంగా అధిక కొవ్వు, ఊబకాయం, ప్రి డయాబెటీస్, డయాబెటీస్ ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలిపింది. కేవలం 23% మంది ఉద్యోగుల హెల్త్ పారామీటర్స్ తగిన స్థాయిల్లో ఉన్నాయని వెల్లడించింది. ఇక పరీక్షలు చేయించుకున్న వారిలో 37% మందికి ఒక దీర్ఘకాలిక ఆరోగ్య సమస్య ఉండగా 26% మందిలో రెండు, 11% మందిలో 3రకాల దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలున్నట్లు తెలిపింది. సాధారణంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ)లన్నీ కూడా 40ఏళ్ల తర్వాతే వస్తుంటాయి. కానీ ఐటీ ఉద్యోగుల్లో మాత్రం అవి 30ఏళ్లలోపే కనిపిస్తున్నాయి, ఇందుకు ప్రధాన కారణం వారి జీవనశైలేనని హెచ్‌సీఎల్ హెల్త్‌కేర్ సీఈవో, వైస్ ఛైర్మన్ షికర్ మల్హోత్రా పేర్కొన్నారు. ఐటీ ఉద్యోగులు తప్పక ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐటీ ఉద్యోగులు ఎక్కువగా జంక్ ఫుడ్స్, రెడీమేడ్, ప్రాసెస్డ్ ఫుడ్స్ తీసుకుంటున్నారని, అలాగే గంటల కొద్దీ ఒకేచోట కదలకుండా కూర్చోవడం, జీవనశైలి విధానం వల్ల కూడా వారిలో ఇలాంటి అనారోగ్య సమస్యలు ఎక్కువ కనిపిస్తున్నాయని యశోద ఆస్పత్రికి చెందిన ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డాక్టర్ రాయిడి గోపీ కృష్ణ తెలిపారు.

### ఐటీ ఉద్యోగుల్లో సంతానలేమి సమస్య తీవ్రం

ఐటీ ఉద్యోగులు ఎక్కువగా యాంత్రిక జీవన శైలిని గడుపుతున్నారు. రివర్స్ టైమ్‌లో పనిచేస్తుంటారు. అందుకే వారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. వారి ఉద్యోగ స్థితే అందుకు కారణం. రేయింబవళ్లు పని, వ్యాయామం లేకపోవడం, సరైన డైట్ పాటించకపోవడం, స్మోకింగ్, మద్యపానం, సరిగానిద్రపోకపోవడం లాంటివాటితో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. హెచ్‌సీఎల్ అధ్యయనం కంటే కూడా ఇంకా ఎక్కువ సమస్యలే వారిలో ఉన్నాయి. ఇటీవలికాలంలో వారిలో సంతానలేమి సమస్య తీవ్రత చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఇది బాగా ఆందోళనకరమైన అంశం. అందుకే 25 రాకముందే ఏటా విధిగా అన్ని రకాల టెస్టులు చేయించుకోవాలి. బీపీ, షుగర్‌ను కనీసం 6 నెలలకొకమారైనా చెక్ చేయించుకోవాలి. ఐటీ కంపెనీల యాజమాన్యాలుసైతం విధిగా తమ ఉద్యోగులకు పరీక్షలు చేయించాలి. దాంతో ముందస్తుగా వారి ఉద్యోగుల్లోని అనారోగ్య సమస్యలు గుర్తించవచ్చు. తద్వారా వారి బీమా ఖర్చు తగ్గే అవకాశం ఉంది.

- డాక్టర్ ఎం.వీ.రావు, సీనియర్ కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్, యశోద ఆస్పత్రి, హైదరాబాద్.

# వివాదాస్పద నేతలకు టికెట్ కట్

## బీజేపీ అధిష్ఠానం సంచలన నిర్ణయం



» జాబితా నుంచి ప్రజ్ఞాసింగ్, అనంతహెగ్డే సహా ఐదుగురి పేర్లు తొలగింపు

» వివాదాల నేపథ్యంలో వేరే వారికి చాన్స్

న్యూఢిల్లీ, మార్చి 25: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎన్డీఏ కూటమి 400 స్థానాల్లో విజయం దక్కించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. వివాదాస్పద సిట్టింగ్ ఎంపీలకు ప్రస్తుత ఎన్నికల్లో సీట్లు ఇవ్వరాదని నిర్ణయించింది. వీరిలో ఐదుగురు కీలక నేతలు ఉన్నారు. వీరంతా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంలో దిట్టలుగా పేరొందారు. ఫలితంగా ఆయా సందర్భాల్లో బీజేపీ ఇరుకున పడింది. ఓ సందర్భంలో అయితే ఏకంగా ప్రధాని మోదీ వారి వ్యాఖ్యలను ఖండించాల్సిన పరిస్థితి వచ్చింది. పక్కన పెట్టిన వారిలో అనంతకుమార్ హెగ్డే(కర్ణాటక), ప్రజ్ఞాసింగ్(మధ్యప్రదేశ్), రమేశ్ బిధురి(ఢిల్లీ), పర్వేశ్ సాహిబ్ సింగ్(ఢిల్లీ), జయంత్ సిన్హా(జార్ఖండ్) ఉన్నారు. వీరిని పక్కన పెట్టడం ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలతో పార్టీని ఇబ్బంది పెట్టేవారికి బలమైన సందేశాన్ని ఇచ్చినట్టయింది.

**అనంతకుమార్ హెగ్డే:** కర్ణాటకకు చెందిన బీజేపీ నేత, ఆరుసార్లు ఎంపీగా గెలిచిన అనంతకుమార్ హెగ్డే తాము(బీజేపీ) మరోసారి అధికారంలోకి రాగానే రాజ్యాంగాన్ని మార్చేస్తామని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు పెనుదుమారం రేపాయి. దీనిపై కొన్ని వారాల పాటు వేచి చూసిన బీజేపీ.. సదరు వ్యాఖ్యలు పార్టీకి నష్టం కలిగించేలా ఉన్నాయని భావించి, తాజాగా అనంతకుమార్‌ను ఉత్తర కన్నడ పార్లమెంటు స్థానం నుంచి తప్పించింది. ఈ స్థానాన్ని మరో సీనియర్ నేత విశేశ్వర హెగ్డే కగేరికి కేటాయించింది.

**సాధ్వి ప్రజ్ఞాసింగ్:** మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే, మహాత్మాగాంధీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేని దేశభక్తుడిగా పేర్కొంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై తీవ్ర దుమారం రేగింది. దీంతో ప్రధాని మోదీ రంగంలోకి దిగి ఆమె వ్యాఖ్యలను ఖండించారు. ఆమె క్షమాపణలు కోరినప్పటికీ క్షమించలేనని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఆమె స్థానాన్ని అలోక్ శర్మకు ఇచ్చారు.

**రమేశ్ బిధురి:** ఢిల్లీ దక్షిణ నియోజకవర్గం నుంచి రమేశ్ బిధురి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈయన కూడా వివాదాస్పద వ్యాఖ్యలతో దుమారం రేపారు. పార్లమెంటు లోపల ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన ఎంపీ డానిష్ అలీని దుర్భాషలాడారు. దీంతో రమేశ్ బిధురి స్థానాన్ని తొలిసారి పోటీకి సిద్ధమైన రామ్‌వీర్ సింగ్ బిధురికి కేటాయించారు.

**పర్వేశ్ సాహిబ్ సింగ్ వర్మ:** ఢిల్లీ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వర్మ.. మాజీ సీఎం సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు. కానీ, 2022లో "ముస్లిం జాతిని దేశం నుంచి పూర్తిగా తరిమికొట్టాలి" అని చేసిన వ్యాఖ్యలు దేశంలో పెను సంచలనం సృష్టించాయి. దీంతో ఆయన టికెట్‌ను కమల్‌జిత్ సెహ్రావత్‌కు కేటాయించింది.

**జయంత్ సిన్హా:** జార్ఖండ్‌లోని హజారీబాగ్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే.. 2017లో జార్ఖండ్‌లోని రామ్‌గఢ్‌లో జరిగిన మాంసం వ్యాపారి దారుణ హత్య కేసులో నిందితులైన ఆరుగురికి ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా వారు బెయిల్‌పై బయటకు వచ్చినప్పుడు 2019లో నేరుగా తన ఇంటికి తీసుకువెళ్లి పూలమాలలు వేసి సత్కరించారు. ఇది బీజేపీని ఇరకాటంలోకి నెట్టింది. ఈ నేపథ్యంలో జయంత్ సిన్హా స్థానాన్ని హజారీబాగ్ ఎమ్మెల్యే మానిశ్ జైస్వాల్‌కు కేటాయించారు.



# మళ్లీ కమలం గూటికి 'గాలి'

## బీజేపీలో కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష విలీనం

బెంగళూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష పార్టీని స్థాపించి, ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన గాలి జనార్దనరెడ్డి మళ్లీ కమలం గూటికి చేరారు. బెంగళూరులోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జనార్దనరెడ్డి బీజేపీ తీర్థం తీసుకున్నారు. కల్యాణ కర్ణాటక ప్రగతి పక్ష పార్టీని బీజేపీలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, సీనియర్‌నేత యడియూరప్ప ఆయనను సాదరంగా స్వాగతించి కండువాలుకప్పారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ సభ్యత్వం తీసుకున్నారు. తర్వాత జనార్దనరెడ్డి మాట్లాడుతూ 13ఏళ్ల తర్వాత బీజేపీ కార్యాలయానికి వచ్చానని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బీజేపీతో కలిసి పనిచేయాలని సూచించారన్నారు. తన ప్రతి రక్తపు బొట్టులోనూ బీజేపీ కణాలున్నాయని, అనివార్య కారణాలతో పార్టీని వీడాల్సి వచ్చిందన్నారు. గాలి జనార్దనరెడ్డి భార్య అరుణ, మాజీ మంత్రి టీజాన్ కుమారుడు థామస్ జాన్ బీజేపీలో చేరారు. బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి శ్రీరాములు,ఎంపీలు పీసీ మోహన్, దేవేంద్రప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంధ్య ఆక్వా బస్సులో రికార్డులను సీబీఐకి ఎందుకు ఇవ్వలేదు

**వ్యవహారమంతా తాడేపల్లి ఆదేశాలతోనే: టీడీపీ**

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఓడలో విశాఖ పోర్టుకు వచ్చి పట్టుబడిన డ్రగ్స్ కేసులో ప్రజలను ఏమార్చాలని ప్రయత్నించిన సంధ్య ఆక్వా కంపెనీ అడ్డంగా దొరికిపోయిందని తెలుగుదేశం పార్టీ వ్యాఖ్యానించింది. ఈ మొత్తం వ్యవహారంలో తెరవెనుక ఉన్న వైసీపీ నేతల సలహాలతో విషయాన్ని తప్పుదోవ పట్టించాలని సదరు కంపెనీ అనుకొందని, కాని వీలు కాలేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం ఆరోపించారు. సోమవారం ఆయన ఇక్కడ తమ పార్టీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'బ్రెజిల్ నుంచి విశాఖకు నౌకలో వచ్చిన పాతిక వేల కిలోల డ్రై ఈస్ట్‌లో డ్రగ్స్ కలిసి ఉన్నాయని సీబీఐ అధికారులు కనుగొన్నారు. దానిపై విచారణ జరుగుతోంది. డ్రై ఈస్ట్‌ను సంధ్య ఆక్వా కంపెనీ దిగుమతి చేసుకొంది. సీబీఐ అధికారుల విచారణపై సంధ్య ఆక్వా కంపెనీ ఈ నెల 22న ఒక ప్రకటన విడుదల చేసింది. బ్రెజిల్ వ్యవసాయ మంత్రిత్వ శాఖ జనవరి 17వ తేదీన తాము దిగుమతి చేసుకొంటున్న డ్రై ఈస్ట్‌ను తనిఖీ చేసి అంతా బాగానే ఉందని సర్టిఫికెట్ ఇచ్చారని, ఆ తర్వాతే నౌక అక్కడ నుంచి బయలుదేరి వచ్చిందని అందులో పేర్కొన్నారు. కాని ఈ ప్రకటన నిజం కాదు. డ్రై ఈస్ట్‌తో వస్తున్న నౌక జనవరి 14నే బ్రెజిల్ నుంచి బయలుదేరి వచ్చింది. ఓషన్ నెట్‌వర్క్ సంస్థ తన వెబ్‌సైట్‌లో ఈ వివరాలన్నీ స్పష్టంగా పేర్కొంది. బ్రెజిల్‌లోని శాంటోజ్ పోర్టు నుంచి జనవరి 14వ తేదీ సాయంత్రం బయలుదేరిన ఈ నౌక హ్యాంబర్గ్ పోర్టు మీదుగా ఈ నెల 16న విశాఖకు వచ్చింది. ఈ నౌక జనవరి 14నే అక్కడ నుంచి బయలుదేరితే 17న బ్రెజిల్ వ్యవసాయ శాఖ ఎలా తనిఖీ చేయగలుతుంది? ప్రజలను తప్పుదోవ పట్టించడానికి అసత్యాలతో పత్రికా ప్రకటనలు చేస్తున్నారు' అని ఆయన చెప్పారు. ఈ వ్యవహారంలో కీలకమైన ఆధారాలు మాయం చేయడానికి జగన్ డ్రగ్ మాఫియా విశ్వ ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. 'సంధ్య కంపెనీకి చెందిన బస్సు కాకినాడలోని కొత్త మూలపేట సెజ్ పక్కన రెండు మూడు రోజుల నుంచి అనుమానాస్పదంగా నిలిచి ఉంది. పోలీసుల తనిఖీలో ఆ బస్సులో కీలక ఫైళ్ళు, హార్డ్ డిస్కులు, చెక్‌బుక్కులు దొరికాయి. వీటిని పోలీసులు సీబీఐకి అప్పగించకుండా సంధ్య ఆక్వాకే అప్పగించారు. రికార్డులను నిందితులకే అప్పగించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సీబీఐకి అవి దొరక్కుండా ఉండటానికే వాటిని బస్సులో పెట్టి తరలించారు. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతోనే ఈ వ్యవహారం అంతా చోటు చేసుకొంది. ' అని పట్టాభి అన్నారు.

# డ్రగ్స్ కేసులో కాల్‌డేటా సేకరణ

- అన్ని కోణాల్లో సీబీఐ దర్యాప్తు
- లేబొరేటరీ నివేదిక కోసం ఎదురుచూపులు
- అది అందాకే అరెస్టులకు అవకాశం
- సంధ్య కంపెనీకి 'బస్సు' అప్పగింత
- కాకినాడ పోలీసుల తీరుపై అనుమానాలు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి) కొత్తపల్లి(కాకినాడ), మార్చి 25 : డ్రగ్స్ కేసులో సీబీఐ అధికారులు అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెల 19న సీబీఐ అధికారులు విశాఖలో విచారణ ప్రారంభించగా రెండు రోజుల తరువాత ఇది వెలుగులోకి వచ్చింది. సంధ్య ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రొయ్యల మేత కోసం బ్రెజిల్ నుంచి ఇన్ యాక్టివ్ ఈస్ట్‌ను దిగుమతి చేసుకోగా...దాంతో కలిపి డ్రగ్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ప్రాథమిక పరీక్షలో కొకైన్ ఉందని తేలడంతో కంటైనర్‌ను సీబీఐ సీజ్ చేసింది. అన్ని బ్యాగుల నుంచి శాంపిల్స్ తీసి సెంట్రల్ నార్కోటిక్ డ్రగ్స్ లేబొరేటరీకి పరీక్షల కోసం పంపించింది. మీడియాలో దీనిపై వార్తలు రాగానే సంధ్య ఆక్వా యాజమాన్యం తన పేరు, సంతకం లేకుండా పత్రికా ప్రకటన విడుదల చేసింది. తాము ఇన్ యాక్టివ్ ఈస్ట్‌ను తెప్పించడం ఇదే మొదటిసారి అని, అందులో ఏముందో తెలియదని, డ్రగ్స్ ఉండే అవకాశం లేదని పేర్కొంది. ఇదే విషయమై మరుసటిరోజు విశాఖలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహిస్తామని ప్రకటించింది. కానీ సీబీఐ అధికారులు విచారణకు పిలిచారని పేర్కొంటూ ఆ సమావేశం రద్దు చేసింది. అక్కడ ఏమి జరిగిందో తెలియదు గానీ ఆ తరువాత దీనిపై యాజమాన్యం ఎక్కడా మాట్లాడడం లేదు. మరో వైపు సీబీఐ అధికారులు సంధ్య ఆక్వా వ్యవహారాలు చూస్తున్న సిబ్బంది ఫోన్ కాల్స్ డేటాను సేకరించి, విశ్లేషిస్తున్నారు. అందులో ఇన్ యాక్టివ్ ఈస్ట్‌కు సంబంధించిన అంశాలు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలిస్తున్నారు. ఈ కేసులో ఎవరినీ సీబీఐ ఇప్పటివరకూ అదుపులోకి తీసుకోలేదు. లేబొరేటరీ నుంచి వచ్చే నివేదిక ఆధారంగానే అరెస్టులు ఉంటాయని, దీనికి కొంత సమయం పడుతుందని సీబీఐ వర్గాలు చెబుతున్నాయి.

### బస్సు అప్పగింతపై అనుమానాలు

కాకినాడ జిల్లాలోని సంధ్య ఆక్వా పరిశ్రమకు చెందిన బస్సును పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లకుండా కంపెనీ యాజమాన్యానికి అప్పగించడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విశాఖ పోర్టుకు బ్రెజిల్‌నుంచి వచ్చిన కంటైనర్‌లో భారీగా డ్రగ్స్ బయటపడిన నేపథ్యంలో సీబీఐ అధికారులు సంధ్య కంపెనీలో రెండురోజుల పాటు విస్తృత తనిఖీలు జరిపారు. ఈ క్రమంలో ఈ కంపెనీకి చెందిన ఓ బస్సు రోడ్డు పక్కన అనుమానాస్పదంగా ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు వెళ్లి బస్సులో తనిఖీలు చేసి, అందులో కొన్ని చెక్‌బుక్‌లు, రికార్డులు ఉండడాన్ని గుర్తించారు. బస్సును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లకుండా పోలీసులు సంధ్యా కంపెనీకి తిరిగి అప్పగించారు. అసలు స్వాధీనం చేసుకున్న రికార్డుల్లో ఏం సమాచారం ఉందో, అవి వేటికి చెందినవో పూర్తి స్థాయిలో పరిశీలించకుండా బస్సును వదిలేయడంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అదీ కాకుండా డ్రగ్స్ కేసులో సీబీఐ అధికారులు విచారణ జరుగుతున్న తరుణంలో ఇలా చేయడంపై అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి.



గరుడ సేవలో జస్టిస్ ఎన్వీ రమణ

## శ్రీవారి పున్నమి గరుడసేవలో జస్టిస్ ఎన్వీ రమణ

తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం రాత్రి శ్రీవారికి పున్నమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య ఆలయ నాలుగు మాడవీధుల్లో గరుడసేవను నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడుడిపై కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ కుటుంబ సమేతంగా గరుడసేవలో పాల్గొన్నారు. నైవేద్య విరామ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

### చిన వెంకన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ద్వారకాతిరుమల మార్చి 25 : ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్యార్జిత కళ్యాణంలో పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి మల్లికార్జునరావు దంపతులకు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ అధికారులు

# పొలం వద్ద నరికి చంపారు

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి గమనించారు. రక్తపు మడుగులో ఉండటంతో హత్యకు గురైనట్లు గుర్తించారు. ఈ ఘటనపై అమరనాథ్‌రెడ్డి భార్య సుధమ్మ తమకు ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు.

### పొలం వద్దే దారుణం

టీడీపీ నేత అమరనాథ్‌రెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. తనకున్న పొలంతోపాటు ఇతరుల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నారు. సొంత పొలం వద్దే ఆవులు, ఇతర పశువులను పెంచుతున్నారు. ఎప్పటిలాగే ఆదివారం రాత్రి పాల క్యాన్లు తీసుకుని పొలం వద్దకు వెళ్లారు. పాలు తీసుకుని సోమవారం ఉదయం ఇంటికి రావలసిన భర్త ఎంతసేపటికీ రాకపోవడంతో సుధమ్మ ఫోన్ చేసింది. స్పందించకపోవడంతో అనుమానం వచ్చి, తన అక్క కుమారుడు శ్యామ్‌సుందర్‌రెడ్డిని పొలంవద్దకు పంపింది. ఆయన వెళ్లి చూసేసరికే అమరనాథ్‌రెడ్డి రక్తపు మడుగులో పడివున్నారు. దీంతో తీవ్ర భయాందోళలకు గురైన ఆయన సుధమ్మకు ఫోన్ చేశారు. 'చినాన్నను ఎవరో నరికి చంపేశారు' అని చెప్పారు. దీంతో సుధమ్మ గుండెలు బాదుకుంటూ స్థానికులతో కలిసి పొలం వద్దకు చేరుకున్నారు. భర్త శవాన్ని చూసి సుధమ్మ సొమ్మసిల్లి పడిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అమరనాథ్‌రెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

హంతకుల ఆచూకీని కనిపెట్టేందుకు పోలీసులు అనంతపురం నుంచి డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు.



విలపిస్తున్న అమరనాథ్ రెడ్డి భార్య

హత్య జరిగిన ప్రాంతంలో సంచరించిన పోలీసు జాగిలం.. ఒక్కటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న కుటాలపల్లికి వచ్చింది. గ్రామం నడిబొడ్డున ఉన్న అమరనాథ్‌రెడ్డి ఇంటికి వెళ్లింది. అనంతరం తిరిగి ఘటనా స్థలానికి చేరుకుంది. కాగా, అమరనాథ్‌రెడ్డి హత్యతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అమరనాథ్‌రెడ్డి అందరితోను కలిసిమెలిసి ఉండేవారని, వివాదాల జోలికి వెళ్లేవారు కాదని స్థానికులు తెలిపారు. అమరనాథ్‌రెడ్డిని ఎవరు, ఎందుకు హత్య చేశారో తెలియడం లేదని చెప్పారు.

### వ్యక్తిగత కారణాలవల్లే: ఎస్పీ

వ్యక్తిగత కారణాలతోనే అమరనాథ్‌రెడ్డి హత్య జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. డీఎస్పీ వాసుదేవన్‌తో కలిసి ఆయన ఘటనా స్థలాన్ని పరిశీలించారు. హత్య వెనుక ఎలాంటి రాజకీయ కోణం లేదని, కేవలం వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగి ఉండవచ్చన్నారు.

### రాజకీయ కోణం ఉందా?

హత్యకు గురైన అమరనాథ్ రెడ్డి టీడీపీలో చురుకైన నాయకుడు. చాలాకాలం నుంచి పార్టీలో ఉన్నారు. ఆదివారం సాయంత్రం కూడా ప్రచారానికి వెళ్లి వచ్చారు. దీంతో ఆయన హత్య వెనుక రాజకీయ కోణం ఉందనే చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకుడు హత్యకు గురికావడంతో రాజకీయ కారణాలతోనే హత్య చేసి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కానీ, పోలీసులు మాత్రం వ్యక్తిగత కారణాలతోనే హత్య జరిగి ఉంటుందని తెలిపారు. అయితే, తమకు ఎవరితోనూ వ్యక్తిగత తగదాలు, ఆస్తి గొడవలు లేవని బాధిత కుటుంబం పేర్కొంది.

### అండగా ఉంటాం: పల్లె

అమరనాథ్ రెడ్డి హత్య గురించి తెలియగానే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటాలపల్లికి వెళ్లారు. హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అమరనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పార్టీ సహా తాను వ్యక్తిగతంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఎస్పీ మాధవరెడ్డితో హత్య విషయంపై చర్చించారు. దారుణానికి తెగబడ్డ వారిని వెంటనే గుర్తించి, అరెస్టు చేయాలని కోరారు.

# సుబ్బారావు కుటుంబానిది ప్రభుత్వ హత్యే

- జగన్ పాలనలో బడుగు వర్గాలపై ప్రతాపం
- టీడీపీ అధికారంలోకి రాగానే.. భూమి వెనక్కిస్తాం
- అన్నగా అండగా ఉండి.. చదివిస్తా
- సుబ్బారావు పెద్ద కుమార్తెకు లోకేశ్ భరోసా
- బాధిత కుటుంబానికి టీడీపీ బృందం పరామర్శ



పాల సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నేతలు

కడప, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో ఆత్మహత్యకు పాల్పడిన పాల సుబ్బారావు కుటుంబ సభ్యులను సోమవారం టీడీపీ ప్రతినిధి బృందం పరామర్శించింది. కమిటీ సభ్యుల కొల్లు రవీంద్ర, ఆర్.శ్రీనివాసరెడ్డి, శ్రీరామ్ చినబాబు, జగన్‌మోహన్‌రాజు తదితరులు సుబ్బారావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన సంఘటనకు కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బారావు పెద్దకుమార్తె లక్ష్మీప్రసన్నను టీడీపీ నేత నారా లోకేశ్‌తో ఫోనులో మాట్లాడించారు. 'వైసీపీ నేతల భూదాహానికి బలైన మీ కుటుంబాన్ని తిరిగి తీసుకురాలేను. కానీ, అన్నయ్యలా అండగా నిలిచి ఆదుకుంటాం. నీవు చదువుకునేంత వరకు నేనే చూసుకుంటా.. ఉద్యోగం కల్పిస్తాం. అధికారంలోకి వచ్చిన వెంటనే 3.10 ఎకరాల భూమిని తిరిగి ఇస్తాం' అని లోకేశ్ భరోసా ఇచ్చారు. అనంతరం కొల్లు రవీంద్ర విలేకరులతో మాట్లాడుతూ సుబ్బారావు కుటుంబానికి ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. 'సుబ్బారావుకు తండ్రి వారసత్వంగా వచ్చిన భూమికి 2020-21లో పీఎం కిసాన్ నిధులు జమయ్యాయి. పాస్ బుక్ ఉంది. అడంగల్‌లో కూడా పేరుంది. అయినా వైసీపీ నేతలు ఆ భూమిని కొట్టేశారు. న్యాయం కోసమని తిరిగి తిరిగి వేసారిన సుబ్బారావు కుటుంబంతో సహా ఆత్మహత్యకు పాల్పడ్డారు. వైసీపీ అరాచకాలతో సుబ్బారావు కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. ఇది ప్రభుత్వ హత్యే' అని కొల్లు విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ భూమిని తిరిగి పెద్దకూతురికి అందిస్తామని చెప్పారు. బాధిత కుటుంబానికి పార్టీ తరపున రూ.10లక్షలు అందిస్తామన్నారు. డీఎస్పీ వైసీపీకి వత్తాసుగా పలకడం దారుణం అన్నారు. చెడు వ్యసనాలు, క్రికెట్ బెట్టింగ్‌లతో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్నారని డీఎస్పీ చెప్పడం సిగ్గుచేటని.. ఒక బాధ్యత గల అధికారిగా ఉండి ఇలా మాట్లాడవచ్చా? అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో వంద మంది బీసీలను హత్య చేశారన్నారు. అధికారంలోకి వచ్చాక ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు.

### వైసీపీని ప్రశ్నిస్తే ఎంతకైనా తెగిస్తారు: సంజీవ్‌కుమార్

'వైసీపీ ప్రభుత్వంలో ప్రశ్నిస్తే వారు ఎంతకైనా తెగిస్తారు. నేను వైసీపీలో ఎంపీగా ఉన్నాను. నందం వెంకటసుబ్బయ్య హత్య జరిగితే మాట్లాడకుండా నా గొంతు నొక్కేశారు' అని కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఆయన సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సుబ్బారావు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలన్నారు. ఆ కుటుంబం ఆత్మహత్యకు కారకులైన అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. బీసీల కడుపుకొట్టి మా రక్తంతో అన్నం తినడం ఏ మాత్రం భావ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయంపై పోరాడేందుకు బీసీలంతా నడుం బిగించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబు సీఎం కావాలని, చేనేతలందరూ ఆలోచించి ఓట్లు వేయాలని కోరారు.

## శ్రీవారి సేవలో జస్టిస్ రోహిణి



తిరుమల, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రోహిణి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

# కనీస వేతన స్కేలు అమలు చేయాల్సిందే!

- కేజీబీవీల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులకు హైకోర్టు ఊరట
- సవరించిన స్కేలు 2022 జనవరి నుంచి అమలు
- 12 వారాల్లో ఆ బకాయిలు చెల్లించాలని ఆదేశం

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో(కేజీబీవీల్లో)ని కాంట్రాక్ట్ ఉద్యోగులకు కనీస వేతన స్కేలు అమలుచేయాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. 2022లో సవరించిన వేతన స్కేలును పరిగణనలోకి తీసుకొని, వారికి వేతన బకాయిలను 12 వారాల్లో చెల్లించాలని స్పష్టం చేసింది. సవరించిన వేతన స్కేలును 2022 జనవరి 1 నుంచి అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. వేతన స్కేలు అమలు విషయంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. అయితే, కేజీబీవీల్లోని బోధనా సిబ్బంది బదిలీలను నిలుపుదల చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. బదిలీల విషయంలో పాఠశాల విద్యాశాఖ 2022 జూన్ 29న జారీ చేసిన జీవో 103ను ధర్మాసనం సమర్థించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును పాక్షికంగా సవరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. తమకు కనీస వేతన స్కేలు అమలు చేసేలా ఆదేశించాలని, అలాగే వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరుతూ పలువురు కేజీబీవీ కాంట్రాక్టు టీచర్లు 2022లో హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి పిటిషనర్లకు కనీస వేతనం చెల్లించాలని 2022 సెప్టెంబరు 27న తీర్పు ఇచ్చారు. వ్యాజ్యాల దాఖలుకు ముందు వారు ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నారో, అక్కడే కొనసాగించాలని ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వుల జీవోను రద్దు చేయలేదు. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కాంట్రాక్టు టీచర్లు, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి వేర్వేరుగా ధర్మాసనం ముందు అప్పీళ్లు దాఖలు చేశారు. కనీస వేతనం చెల్లించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ పాఠశాల విద్యాశాఖ అప్పీల్ వేయగా, బదిలీ ఉత్తర్వులు రద్దు చేయాలని టీచర్లు అప్పీల్ వేశారు.

## గామన్ బ్రిడ్జిపై సాంకేతిక మరమ్మతులకు తక్షణ చర్యలు

**ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న**



కొవ్వూరు గామన్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ప్రద్యుమ్న, కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు, మార్చి 25: తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు నుంచి కొవ్వూరు వరకూ గోదావరిపై నిర్మించిన గామన్ బ్రిడ్జి కుంగిన చోట తక్షణ మరమ్మతు చర్యలు తీసుకోనున్నట్టు ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న తెలిపారు. కొవ్వూరు వద్ద గామన్ బ్రిడ్జి 53వ స్తంభం వద్ద కుంగడంతో కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే మార్గంలో వాహన రాకపోకలను సోమవారం పూర్తిగా నిలుపుదల చేశారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత పరిశీలించారు. స్థానిక అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ, పోలీసు, రెవెన్యూ అధికారులతో ట్రాఫిక్ మళ్లింపుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రద్యుమ్న మాట్లాడుతూ గామన్‌బ్రిడ్జికి చెందిన సాధారణ తనిఖీల్లో భాగంగా నిర్వహణ సంస్థ 56, 57 స్పాన్ మధ్య సాంకేతిక పరమైన లోపాలను గుర్తించిందన్నారు. వంతెనపై వాహన రాకపోకలు సాగిస్తున్న సమయంలో వైబ్రేషన్ అధికస్థాయిలో ఉన్నట్టు గుర్తించామన్నారు. తక్షణ మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. బేరింగులు మాత్రమే దెబ్బతిన్నాయని, వంతెన భద్రతకు ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా వంతెనపై ఒకవైపు మాత్రమే వాహన రాకపోకలకు అనుమతించామన్నారు. సాధ్యమైనంత త్వరగా మరమ్మతులు పూర్తిచేసి వంతెనపై రెండు మార్గాల్లో వాహన రాకపోకలను అనుమతిస్తామన్నారు.

# సమాజంలో జగన్ చిచ్చు

- గత ఎన్నికల్లో కులాన్ని వాడుకుని లబ్ధి పొందారు
- ఈసారి మతం, ప్రాంతాలనూ ప్రయోగిస్తున్నారు
- నంబర్ వన్ 420...సొంత బాబాయ్‌నే హత్య చేయించారు
- ఐదేళ్లలో కొత్త పరిశ్రమలు లేవు.. ఉన్నవన్నీ పరార్
- జగన్ కుయుక్తులకు పడిపోవద్దు
- మంగళగిరి ప్రచారంలో లోకేశ్ విజ్ఞప్తి



తాడేపల్లి ఫైన్‌ఉడ్ అపార్టుమెంట్‌వాసులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

మంగళగిరి, మార్చి 25: జగన్ తన స్వార్థ రాజకీయప్రయోజనాల కోసం సమాజాన్ని విచ్ఛిన్నం చేసే కుట్రలకు పాల్పడుతున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆరోపించారు. 2019 ఎన్నికల్లో కులాలను రెచ్చగొట్టి లబ్ధి పొందిన జగన్, ఈ ఎన్నికలలో కులంతోపాటు మతం, ప్రాంతమనే భావాలను కూడా రెచ్చగొడుతూ సమాజాన్ని చీల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న లోకేశ్ తన ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తాడేపల్లిలోని ఫైన్‌ఉడ్ అపార్టుమెంట్‌వాసులతో జరిగిన 'బ్రేక్‌ఫాస్ట్ విత్ లోకేశ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. జగన్ కుట్రలు, కుతంత్రాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ కోరారు. "దేశం మొత్తంమీద జగన్ వంటి దొంగ..420 మరొకరు లేరు. గత ఎన్నికల్లో లబ్ధి కోసం సొంత బాబాయిని హత్య చేయించి ఆ పాపాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వలేక నిధులను మురగబెట్టిన అసమర్థ ముఖ్యమంత్రి ఈయన. మంగళగిరిలో, కేంద్రం రూ. 1800 కోట్ల వ్యయంతో ఎయిమ్స్ ఆసుపత్రిని నిర్మిస్తే దానికి కనీసం తాగునీటి సదుపాయాన్ని కల్పించలేకపోయారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు వచ్చే పెట్టుబడిదారులకు జేటాక్సు వేయడం, లేక కులం రంగు పులిమేయడంతో చాలమంది పొరుగురాష్ట్రాలకు తరలివెళ్లిపోతున్నారు. భారత్ బయోటెక్‌ను ఒరిశాకు, అమర్‌రాజాను తెలంగాణకు జగన్ తరిమేశారు. దీంతో రాష్ట్రానికి వచ్చే ఆదాయంతోపాటు యువత ఉపాధి అవకాశాలను కోల్పోయింది. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బాగా దెబ్బతింది. ఇప్పుడు రాష్ట్ర భవిష్యత్తు కోసం పరిశ్రమలను తీసుకురావాలంటే పెట్టుబడిదారుల్లో మళ్లీ నమ్మకాన్ని కల్పించాలి. వచ్చే పదేళ్లపాటు ప్రజాప్రభుత్వం ఉంటుందన్న నమ్మకాన్ని వారిలో కల్పిస్తేనే పరిశ్రమల స్థాపన సులభతరం అవుతుంది. జగన్ దృష్టంతా అవినీతి సంపాదనపైనే. అభివృద్ధి, ఉపాధి కల్పనపై ఆయనకు శ్రద్ధ కొంచెం కూడా లేదు. జగన్ రూ . 12 లక్షల కోట్ల అప్పులు చేసి బటన్ నొక్కడంతో ఆ భారమంతా మళ్లీ ధరల పెంపు, పన్నుల రూపంలో తిరిగి ప్రజలనెత్తినే పడింది. చంద్రబాబు నేతృత్వంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాజధాని అమరావతి నిర్మాణపనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభిస్తాం. దేశంలోనే మోడల్ సిటీగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. మా హయాంలో అమరావతి నిర్మాణం పూర్తిచేయకుండా కాలాన్ని వృథా చేశామన్న విమర్శల్లో వాస్తవం లేదు. ఆ సయమంలో ప్రపంచంలోనే అతిపెద్ద ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను చాలా విజయవంతంగా పూర్తిచేశాం. మాస్టర్‌ప్లాన్లు, డిజైన్లు పూర్తిచేసి పనులను ప్రారంభించాం. మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాలన్నింటినీ భర్తీ చేస్తాం. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నేరాలకు చెక్ పెడతాం. ముఖ్యంగా రాష్ట్రంలో శాంతిభద్రతలను పూర్తిగా సంరక్షిస్తాం" అని లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రం సీజ్

**మన్యం జిల్లా వద్ద దట్టమైన అడవిలో గుర్తింపు**



మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రంలో సామగ్రిని సీజ్ చేసిన బీఎస్ఎఫ్ బృందం

సాలూరు రూరల్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల వేళ ఏవోబీ(ఆంధ్రా ఒడిసా సరిహద్దు ప్రాంతం)లో మావోయిస్టుల ఆయుధ తయారీ కేంద్రాన్ని భద్రతా దళాలు గుర్తించి సీజ్ చేశాయి. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల సమీపాన ఒడిశా రాష్ట్రంలోని సుంకి ప్రాంతం దట్టమైన అడవుల్లో ఆదివారం సాయంత్రం ఆ ఆయుధ తయారీ కేంద్రాన్ని గుర్తించారు. ఆ వివరాలను బీఎస్ఎఫ్ సీవోబీ డి.కాయ్ 65 బెటాలియన్‌కు చెందిన కమాండ్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కెర్‌కెట్టా సోమవారం ఒడిశా మీడియాకు వెల్లడించారు. ఆయుధ తయారీ కేంద్రం మన్యం జిల్లా పాచిపెంట మండలం కుంతాం బడేవలస, పద్మాపురం గ్రామాలకు మూడు, నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎన్నికల నేపథ్యంలో ఒడిశాలోని సుంకి క్యాంప్ బీఎస్ఎఫ్ జవాన్లు ఏవోబీ అడవుల్లో ఆదివారం గాలింపు చేపట్టారు. ఆ సమయంలో ఏవోబీ సరిహద్దు వద్ద సంచరిస్తున్న ఇద్దరిని వారు ప్రశ్నించారు. దీంతో ఆయుధ తయారీ కేంద్రం గురించి తెలిసింది. వెంటనే అక్కడకు చేరుకున్న జవాన్లు తుపాకీ తయారీకి వినియోగించే హేండ్ బౌలర్, ట్రిగ్గర్ మెకానిజం, ఫిల్లర్లు, హేమర్, స్లీపర్, చేజల్, ఫైల్, కత్తులు, ఇనుప బిట్, రంపం తదితర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు ఏపీ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఏవోబీకి వెళ్లే పి.కోనవలస, దండిగాం, పద్మాపురం తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

## బీఎస్పీ మలి జాబితా విడుదల

**5 లోక్‌సభ, 50 శాసనసభ అభ్యర్థుల ప్రకటన**

తిరుపతి, మార్చి 25: ఎన్నికల బరిలో పోటీపడనున్న బీఎస్పీ అభ్యర్థుల రెండవ జాబితాను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, కో ఆర్డినేటర్, విశ్రాంత ఐపీఎస్ పూర్ణచంద్రరావు సోమవారం తిరుపతిలో ప్రకటించారు. శాసనసభకు పోటీచేసే 50 మంది అభ్యర్థులను ఇదివరకే ప్రకటించామని, ఇప్పుడు మరో 50 మంది అభ్యర్థులను రెండో జాబితాలో ప్రకటిస్తున్నట్టు చెప్పారు. అలాగే 25 పార్లమెంటు స్థానాలకుగాను ఇదివరలో 11 మంది అభ్యర్థులను ప్రకటించామని, ఇప్పుడు మరో ఐదుగురు అభ్యర్థులను ప్రకటిస్తున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకు, 25 పార్లమెంటు స్థానాలకు బీఎస్పీ పోటీ చేస్తోందని చెప్పారు.

## రేషన్ డీలర్ల రాష్ట్ర కార్యాలయం ప్రారంభం

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్స్ సమాఖ్య రాష్ట్ర నూతన కార్యాలయాన్ని సోమవారం విజయవాడలో ప్రారంభించారు. స్థానిక మొగల్‌రాజ్‌పురం రెవెన్యూ కాలనీలోని సత్యా అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన కార్యాలయాన్ని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ ప్రారంభించారు. రేషన్ డీలర్స్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు, ఆ సమాఖ్య ముఖ్యనేత ఫణికుమార్, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన డీలర్ సంఘ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెలాఖరులోగా బకాయిలు చెల్లించాలి: ఏపీటీఎఫ్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను ఈనెలాఖరులోగా చెల్లించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ, డీఏ, సరెండర్ లీవుల బకాయిలు రూ.5500 కోట్లను ఈనెలాఖరులోపు చెల్లిస్తామని జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారని, వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. దీనిపై చీఫ్ సెక్రటరీకి లేఖ రాసినట్టు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉమ్మడి 'పశ్చిమ'లో నేడు, రేపు భువనేశ్వరి పర్యటన

ఏలూరు, మార్చి 25 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా ఈనెల 26, 27 తేదీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో మనస్తాపంతో మృతిచెందిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు. ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ పరిధిలోని ఎర్రంపేట, కన్నాయగూడెం, బయ్యన్నగూడెం., చింతలపూడి నియోజకవర్గంలో పేరంపేట, చింతలపూడి ప్రాంతాల్లో ఆమె మంగళవారం పర్యటిస్తారు. రెండో రోజు బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజకవర్గాల పరిధిలోని బాధిత కుటుంబాలను ఆమె పరామర్శిస్తారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# భూటాన్ బంధం!

భూటాన్‌లో భారీ వర్షాల కారణంగా నిలిచిపోయిన భారతప్రధాని నరేంద్రమోదీ పర్యటన, వాతావరణం కాస్తంత మెరుగుపడటంతో మరుసటిరోజునే జరిగిపోయింది. స్వదేశంలో సార్వత్రిక ఎన్నికల ఒత్తిడి వంటివి పక్కనబెట్టి రెండురోజులపాటు ప్రధాని ఈ పర్యటన జరపడం భూటాన్‌కు భారతదేశం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం. ఇచ్చిన మాట ప్రకారం వచ్చినందుకు భూటాన్ ప్రధాని దాషో షెరింగ్ తోబ్గే దీనిని 'మోదీకి గ్యారంటీ'గా అభివర్ణించారు. బీజేపీ ఎన్నికల నినాదం భూటాన్ ప్రధాని నోటి నుంచి రావడం అటుంచితే, తోబ్గే భారత్ అనుకూలుడని అంటారు. భూటాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి. జనవరిలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తోబ్గే తన తొలివిదేశీపర్యటన భారతదేశంలోనే జరిపారు. ఆయన తిరిగివెళ్ళిన నాలుగురోజుల్లోనే మోదీ ఆ సుహృద్భావానికి కొనసాగింపుగా తాను ఆ దేశంలో కాలూనారు. నరేంద్రమోదీని భూటాన్ పాలకులు ఘనంగా స్వాగతించారు, గౌరవించారు, 2021లో ప్రకటించిన భూటాన్ అత్యున్నత పౌరపురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు.

స్వదేశంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రధాని ఈ పర్యటనకు సంకల్పించడం విశేషం. ఆర్థికంగా బలోపేతమవుతున్న భారతదేశం నుంచి భూటాన్ మరింత ఆర్థిక సహకారాన్ని ఆశించడం సహజం కనుక, భూటాన్ పంచవర్ష ప్రణాళికకు భారత్ ఆర్థిక సహకారాన్ని రెట్టింపు చేయడానికి నిర్ణయించడం సరైన చర్య. భూటాన్ అభివృద్ధికి భారతదేశం కట్టుబడి ఉన్నదని ప్రధాని తన పర్యటనలో హామీ ఇచ్చారు. అక్కడి యువతలో నైపుణ్యాల మెరుగుపరచే శిక్షణాకార్యక్రమాన్ని భారతదేశం పూర్తిగా తన ఖర్చుతో నిర్వహిస్తున్నది. థింపూలో భారతదేశం నిర్మించిన ఆస్పత్రి ఆరంభమూ జరిగింది. అసోంను ఆనుకొని ఉన్న భూటాన్ ప్రాంతాల్లో గెలెప్హు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ ప్రాజెక్టు ఆ దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తుంది. భూటాన్ కొత్త ప్రధాని భారతదేశంలో పర్యటించడం, ఇప్పుడు నరేంద్రమోదీ ఆ దేశంలో కాలూని అనేక ఒప్పందాలు చేసుకోవడం ద్వారా ఉభయదేశాల మధ్యా సాన్నిహిత్యం పెరుగుతుంది, ఆర్థిక, వాణిజ్య బంధం హెచ్చుతుంది.

ఇటీవలికాలంలో చైనాకు భూటాన్ మరింత దగ్గరవుతున్న విషయం తెలిసిందే. భారతదేశానికి సాంస్కృతికంగానూ, సహజసిద్ధంగానూ ఉపఖండంలోని దేశాలతో ఉన్న సంబంధాలను చైనా తన ఆర్థికబలంతో ప్రభావితం చేస్తున్నది. వేగంగా ఎదిగి భారతదేశంకంటే ఆర్థికంగా నాలుగురెట్లు శక్తిమంతంగా తయారైన కారణంగా డబ్బు వెదజల్లి చాలా దేశాలను అది తనవైపునకు తిప్పుకోగలుగుతోంది. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు, బంగ్లాదేశ్ ఇలా ప్రతీదేశానికీ అది అప్పులు ఇస్తోంది, ప్రాజెక్టులు కడుతోంది. భూటాన్ కూడా ఈ ప్రభావానికి అతీతంగా ఏమీ లేదు. చైనా—భూటాన్ సరిహద్దు చర్చలు ఆ సాన్నిహిత్యానికి ఓ ఉదాహరణ. సరిహద్దు ప్రాంతాల్లోని భూములను ఉభయదేశాలు పరస్పరం బదలాయించుకొనేందుకు ఉద్దేశించిన కార్యక్రమం ముందుకు కదిలిన పక్షంలో భారతదేశం రక్షణపరంగా చాలా సమస్యలు ఎదుర్కోవాల్సివస్తుంది. సిలిగురి కారిడార్‌ను, అరుణాచల్‌ప్రదేశ్‌లో సరిహద్దు ప్రాజెక్టులను ఇది ఇబ్బందుల్లో పడవేస్తుంది. చైనాతో తన చర్చలు ఒక కొలిక్కివచ్చేవరకూ కొన్ని ప్రాజెక్టుల విషయంలో కాస్తంత నెమ్మదిగా పోవాలంటూ భూటాన్ ఇటీవల భారతదేశానికి ఓ సందేశం పంపిందని కూడా వార్తలు వచ్చాయి.

చైనా తన ఆర్థికబలంతో భూటాన్‌ను తనవైపు తిప్పుకుంటున్న విషయం అందరికీ తెలిసిందే. దౌత్యసంబంధాలు అధికారికంగా లేనప్పటికీ భూటాన్‌ను చైనా ప్రభావితం చేయగలుగుతున్నది, సరిహద్దు ఒప్పందాల పేరిట కీలకమైన ప్రాంతాలను తన గుప్పిట్లోకి తెచ్చుకొని భారతదేశాన్ని ఆత్మరక్షణలో పడవేసేందుకు ప్రయత్నిస్తున్నది.

ఈ నేపథ్యంలో భారత ప్రధాని పర్యటనకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. ఉభయదేశాల బంధాన్ని ఆయన బద్దలు కొట్టలేనిదిగా అభివర్ణించారు. రెండుదేశాల భద్రత పరస్పర సహకారం మీద ఆధారపడి ఉన్నదని ఆయన గుర్తుచేశారు. 'భారత్ కోసం భూటాన్, భూటాన్ కోసం భారత్ అన్నది ఏ మాత్రం తారుమారుచేయలేని ఈ ప్రాంతపు వాస్తవికత' అని సంయుక్త ప్రకటన వ్యాఖ్యానించడం సంతోషించదగ్గ విషయం.

# కేజ్రీవాల్ అరెస్ట్‌పై యాగీ ఎందుకు?

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎట్టకేలకు 9 సమన్ల తర్వాత ఈడీ అరెస్టు చేసింది. దీంతో దేశ వ్యాప్తంగా ప్రతిపక్ష నేతలందరికీ కాకపుట్టుకొచ్చినట్లున్నది. తన కుమార్తె కవితను అరెస్టు చేసినప్పుడు నోరు విప్పని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నుంచి ఢిల్లీలో రాహుల్ గాంధీ వరకూ విపక్ష నేతలందరూ ప్రకటనలు గుప్పించారు. అవినీతిపరులను అరెస్టుచేయడం రాజ్యాంగ వ్యతిరేకమని, అప్రజాస్వామికమని రకరకాలుగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకమైతే ఈసారి విచిత్రంగా ప్రతిపక్షాలన్నీ తమ అవినీతిని సమర్థించుకోవడానికి ఏకమవుతున్నాయి. కాని అవినీతిపరులైన నేతలంతా దేశాన్ని కాపాడడం కోసం కాకుండా, తమను తాము కాపాడుకోవడానికి ఏకమవుతున్నందువల్ల 1975 నాటి పరిస్థితులకూ, 2024 నాటి పరిస్థితులకూ చాలా తేడా ఉన్నది. నాడు రాజ్యాంగాన్ని ఇష్టారాజ్యంగా ఉల్లంఘించినందుకు ప్రతిపక్షాలు ఏకమయ్యాయి. కాని ఇవాళ అవినీతిపరులకు వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని ఖచ్చితంగా అమలు చేస్తున్నందుకు ప్రతిపక్షాలు ఏకమవుతున్నాయి. రాజ్యాంగసంస్థల్ని విమర్శిస్తున్నాయి. కోర్టులు అవినీతిపరులను జైలుకు పంపినప్పుడు వాటిని కూడా ఆక్షేపిస్తున్నాయి. ఏ రాజ్యాంగమూ, ఏ న్యాయవ్యవస్థా అవినీతిపరులను ఉపేక్షించాలని, చట్టాన్ని అమలు చేయకూడదని చెప్పదు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

నల్లధనాన్ని అరికట్టడం లేదేందుకు, అవినీతిని రూపుమాపడం లేదెందుకు. అని ప్రధానమంత్రిని నిలదీస్తున్న ప్రతిపక్షాలంతా ఇవాళ వారి అవినీతి సొమ్మునే ఈడీ, సీబీఐలు బహిర్గతం చేస్తున్నందుకు దిక్కులేని పరిస్థితిలో ఉన్నాయి. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న ప్రతిపక్ష నేతలు ఇప్పుడు మిత్రులుగా మారుతున్నారు. ఏ కేజ్రీవాల్ అయితే కాంగ్రెస్ అవినీతికి వ్యతిరేకంగా 2013లో పోరాడారో అదే కేజ్రీవాల్ తానే అవినీతిపరుడై అవినీతి కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ కూరుకుపోయారని, అవినీతిపరుడైన కేజ్రీవాల్ అధికారంలో ఉన్నంతవరకూ విచారణ సరిగా సాగదని కొద్ది రోజుల క్రితం విమర్శించిన కాంగ్రెస్ నేతలే ఇప్పుడు ఆయనపై సానుభూతి ప్రకటిస్తున్నారు.

2019 ఎన్నికలకు ముందు ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మన వీరసైనికులు దాడులు చేసినప్పుడు కూడా ఇదే విధంగా మోదీ చిత్తశుద్ధిని, మన వీరసైనికుల పాటవాన్నీ శంకించిన ప్రతిపక్షాలు ఈ సార్వత్రిక ఎన్నికల ముందు తమ అవినీతినే ఒక ప్రచారాస్త్రంగా మార్చాయి. నిజానికి మోదీ అధికారంలోకి వచ్చిన రోజే అవినీతి పట్ల జీరో టాలరెన్స్ (ఏ మాత్రం సహించని) వైఖరిని అవలంబిస్తానని ప్రకటించారు. గత ఏడాది ముగిసిన జీ-20 సమావేశాల్లోనే కాదు, అనేక అంతర్జాతీయ సమావేశాల్లో నల్లధనాన్ని అరికట్టేందుకు దేశాల మధ్య సంఘటిత కార్యాచరణ గురించి మోదీ మాట్లాడుతూనే ఉన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా ఉన్న కాంగ్రెస్ పాలన పుణ్యమా అని ఇవాళ దేశంలో సగానికి పైగా రాజకీయ నాయకులు అవినీతిపరులని ప్రజలు అనుకునే పరిస్థితి వచ్చింది. ఆ అభిప్రాయం మార్చేందుకే మోదీ శతధా ప్రయత్నిస్తున్నారు. ఆయన చేపట్టిన చర్యల వల్లే ఇవాళ ఒక కొలిక్కి వచ్చి అవినీతిపరులు ఆత్మరక్షణలో పడ్డారు. పెద్ద నోట్ల రద్దు, బినామీ ఆస్తుల బిల్లు, వెల్లడించని ఆదాయం, విదేశీ ఆస్తులపై పన్ను బిల్లు మొదలైన అనేక చర్యల ద్వారా లక్షలకోట్ల నల్లధనం వెల్లడైంది. ఒక్క మనీలాండరింగ్ నిరోధక చట్టం మూలంగానే దేశంలో దాదాపు రూ. లక్షన్నర కోట్ల మేరకు అక్రమ ఆస్తులను ఏజన్సీలు స్వాధీన పరుచుకున్నాయి. మోదీకి ముందు పదేళ్ల పాటు పాలించిన యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ చట్టం ప్రయోగించి కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే స్వాధీనపరుచుకున్న విషయం కాంగ్రెస్ నేతలకు తెలుసు. కాంగ్రెస్ హయాంలోనే బ్యాంకులను రూ.22 వేల కోట్ల మేరకు లూటీ చేసినవారు విదేశాలకు పారిపోయారు. మోదీ హయాంలో నాడు పారిపోయిన వ్యక్తుల నుంచే రూ20 వేల కోట్ల మేరకు ఆస్తులను స్వాధీన పరుచుకున్నారు.




**నిజానికి నల్లధనాన్ని అరికట్టేందుకే అన్ని రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమకూర్చే విధానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ సహా ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని ఉపయోగించుకుని నిధులు తెచ్చుకున్నాయి. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ఇంతకంటే మెరుగైన పద్ధతిని దేనినైనా సూచిస్తే మోదీ ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది. అంతేకాని తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మోదీని అవినీతిపరుడని విమర్శించడం అర్థరహితం.**

గత ఏడాది కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఆర్ఎస్, రాష్ట్రీయ జనతాదళ్, సమాజ్‌వాది పార్టీ, శివసేన (యుబిటి), నేషనల్ కాన్ఫరెన్స్, ఎన్‌సీపీ, డిఎంకే, వామపక్షాలతో సహా 14 పార్టీలు తమను సీబీఐ, దర్యాప్తు సంస్థలు వేధిస్తున్నాయంటూ సుప్రీంకోర్టుకు వెళితే అలాంటిదేమీ లేదని ఆ సంస్థలు తమ పని తాము చేసుకుపోతున్నాయని త్రోసిపుచ్చింది. 'రాజకీయ పార్టీలు సామాన్య పౌరుల కంటే గొప్పవేం కావు. సామాన్యులూ, రాజకీయనేతలు ఒకటే అని న్యాయవ్యవస్థ భావిస్తుంది. అటువంటప్పుడు రాజకీయ నేతల అరెస్టులు ఉండకూడదని కోర్టులు ఎలా చెబుతాయి? నేతలు నేరాలు చేశారా లేదా అని చూడకుండా నిర్ణయం తీసుకోవడం ప్రమాదకరం' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జెబి పర్దీవాలా అన్నారు. సుప్రీంకోర్టు వైఖరి గ్రహించిన కాంగ్రెస్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. రాజకీయనాయకులైనంత మాత్రాన అవినీతిపరులు చట్టానికి అతీతులు కాలేరు. సామాన్య ప్రజలకు భిన్నమైన చట్టాలేవీ రాజకీయ నాయకులకు ఉండవు అని తెలిసినప్పటికీ ప్రతిపక్షాలు ఏజెన్సీలను తప్పుపట్టడం మానుకోలేదు. కేజ్రీవాల్ అరెస్టు కాగానే అవి నానా యాగీ చేస్తున్నాయి.

ఇవాళ ఎన్నికల బాండ్లలో అత్యధిక మొత్తం బీజేపీకి లభించాయని విమర్శిస్తున్నవారు దేశంలో బీజేపీయే అతి పెద్ద పార్టీగా మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నదన్న వాస్తవాన్ని విస్మరిస్తున్నారు. ఎన్నికల బాండ్ల ద్వారా మోదీ ప్రభుత్వం నల్లధనాన్ని ఏమీ ప్రోత్సహించలేదు. వివిధ కార్పొరేట్ సంస్థలు చట్టబద్ధంగానే నిధులు సమకూర్చాయి. ఆ మొత్తాన్ని వారు తమ ఖాతాల్లో చూపించి, ఆదాయపన్ను శాఖ ద్వారా ఆడిట్ చేసుకోవాల్సి ఉంటుంది. నిజానికి నల్లధనాన్ని అరికట్టేందుకే అన్ని రాజకీయ పార్టీలకు కార్పొరేట్లు ఎన్నికల బాండ్ల ద్వారా నిధులు సమకూర్చే విధానాన్ని ప్రవేశపెట్టారు. అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్‌తో సహా ప్రాంతీయ పార్టీలు ఈ విధానాన్ని ఉపయోగించుకుని నిధులు తెచ్చుకున్నాయి. వాటి వాటి స్థాయి, విస్తృతిని బట్టి నిధులు లభించాయి. పోనీ రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ఇంతకంటే మెరుగైన విధానం ఏమైనా ఉంటే సూచిస్తే మోదీ ప్రభుత్వం తప్పకుండా ఆమోదిస్తుంది. అంతేకాని తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు మోదీని అవినీతిపరుడని విమర్శించడం అర్థరహితం. జాతీయవాద పార్టీ అయినందువల్లే బీజేపీ 2 సీట్ల నుంచి 303 సీట్ల వరకు పెరగగలిగింది. అలాంటి పార్టీని ఓడించేందుకు ఇవాళ అవినీతి పాలన చేసిన, వారసత్వ రాజకీయాల నుంచి వచ్చిన విచ్ఛిన్నకర శక్తులన్నీ ఏకం కావడాన్ని దేశ ప్రజలు గమనిస్తున్నారు. 2024 జూన్ 4న ఈ శక్తులకు చరమగీతం పాడనున్నారు.

# ముసురుకుంటున్న రజాకార్ మనస్తత్వం!

ఫాసిస్టులు పోయారు! నాజీలు నాశనమొందారు! ఎంత గట్టిగా చెప్పుకొన్నా ఇది అర్థసత్యమే! భావజాలంగా ఫాసిజం పోలేదు. నాజీయిజమూ కనుమరుగు కాలేదు. కొత్తరూపాల్లో అవి కనపడుతూనే ఉన్నాయి. రజాకార్లు ఇప్పుడు లేరు. కానీ రజాకర్ మనస్తత్వం పుంజుకుంటోంది. జాతి, మత ఆధిక్యతా భావాలు.. ప్రజాస్వామ్యం— సామాజిక సమానత్వంపై వ్యతిరేకత.. అసమ్మతి అణచివేత కేంద్రంగా ఫాసిస్టు మనస్తత్వం ఉంటుంది. రజాకార్ మనస్తత్వానికి ఇదే పునాది. రజాకార్ల దురాగతాలపై ఎన్ని సినిమాలైనా తీయొచ్చు. ఎన్ని కథలైనా రాయొచ్చు. ఇప్పుడు ముసురుకుంటున్న ప్రమాదం రజాకార్ మనస్తత్వమే. రజాకార్ల ఆగడాల గురించి అలుపెరగకుండా మాట్లాడుతున్న వారే దీన్ని ప్రదర్శిస్తున్నారు.

గెలుచుకున్న రాజ్యం ఎల్లకాలం ముస్లింల ఆధిపత్యం కింద ఉండాలన్న భావన రజాకార్లను నడిపించింది. ఇందుకోసం చాలా వాదనలు తెరపైకి తీసుకొచ్చారు. పాలించే అధికారం నవాబుకు కాకుండా ముస్లిం ప్రజలకే చెందుతుందనేది అందులో ప్రధానమైంది. నిజాం నవాబు కేవలం ఆ అధికారానికి పరిరక్షకుడు మాత్రమే. ఆ పరిరక్షకుడికి ప్రమాదం వస్తే ముస్లింలందరూ పోరాడాలని ప్రచారం చేశారు. అందుకోసం ముస్లింలు స్వచ్ఛంద సైనికులుగా మారాలని పిలుపునిచ్చారు. రజాకార్ల పుట్టుకకు పూర్వరంగమిది. 1920ల నుంచి ప్రజాప్రాతినిధ్య పాలన కోసం దేశంలో ఉద్యమాలు ఊపందుకున్నాయి. నిజాం సంస్థానంలోనూ వాటి ప్రతిస్పందనలు తలెత్తాయి. ముస్లింలను సంఘటితపరచటానికి 1927లో ఏర్పాటైన ఇత్తెహాద్ ఉల్ ముసల్మీన్ సంస్థ 1936 నాటికి రాజకీయ సంస్థగా మారింది. ఇత్తెహాద్ స్థాపకుల్లో నవాబ్ బహదూర్ యార్ జంగ్ ఒకరు. సార్వభౌమాధికారం ముస్లిం ప్రజలదే అన్న సిద్ధాంతానికి రూపకర్త ఆయనే. ప్రజల్లో పెరిగే ప్రజాస్వామ్య ఆకాంక్షలను, ప్రాతినిధ్య ప్రభుత్వ ఏర్పాటును అడ్డుకోవటమే క్రమేపీ ఇత్తెహాద్ అజెండాగా మారింది. 1946లో ఇత్తెహాద్ అధ్యక్షుడిగా ఖాసింరజ్వీ ఎన్నికయ్యాడు. అప్పటి నుంచి రజాకార్లు చెలరేగిపోయారు. మూడేళ్ల పాటు నిజాం సంస్థాన రాజకీయాలను రజ్వీ శాసించాడు. రాజ్యాధికారాన్ని కాపాడుకోవటానికి నిజాం కూడా రజ్వీకి చేదోడుగా నిలిచాడు. రజ్వీ నిజాం సంస్థానంలో పుట్టలేదు. ఇక్కడ చదవలేదు. కానీ స్థానిక ముస్లింలకు తిరుగులేని నాయకుడయ్యాడు. అతని పిలుపుతో వేలమంది స్వచ్ఛంద సైనికులయ్యారు. నైజాంను శాసించటమే గాక, ప్రధానిగా ఎవరు ఉండాలో అతనే నిర్దేశించాడు. భారత్‌తో వ్యవహరించాల్సిన తీరుపై ఆదేశాలిచ్చాడు. యూపీలో పుట్టి అలీఘడ్‌లో లా చదివిన రజ్వీకి నైజాం సంస్థానంపై ఇంతపట్టు ఎలా వచ్చింది? ఆపరేషన్ పోలో (పోలీసు చర్య) అనంతరం రజ్వీపై పెట్టిన కొన్ని కేసులు ఎందుకు వీగిపోయాయి. ఘోర దారుణాలకు ఏడేళ్ల శిక్షను మాత్రమే అనుభవించి పాకిస్తాన్ ఎలా వెళ్లిపోగలిగాడు? నిజాం సంస్థానం చివరి ప్రధానిగా వ్యవహరించిన లాయక్ అలీపై కేసులెందుకు పెట్టలేదు? గృహ నిర్బంధం నుంచి పాక్‌కు ఎలా పారిపోగలిగాడు? ఉక్కుమనిషి పటేల్ హోంమంత్రిగా ఉన్నప్పుడే ఇదెలా జరిగింది? ఇలాంటి ప్రశ్నలెన్నో ఉన్నాయి. బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన నరేంద్ర చపల్‌గావ్‌కర్ వాటిల్లో కొన్నిటిని చాలా ఆసక్తికరంగా వివరించారు. 'ద లాస్ట్ నిజాం అండ్ హిజ్ పీపుల్' పేరుతో ఆయన రాసిన పుస్తకంలో అవన్నీ దొరుకుతాయి.




**జాతి, మత ఆధిక్యతా భావాలు.. ప్రజాస్వామ్యం–సామాజిక సమానత్వంపై వ్యతిరేకత.. అసమ్మతి అణచివేత కేంద్రంగా ఫాసిస్టు మనస్తత్వం ఉంటుంది. రజాకార్ మనస్తత్వానికి ఇదే పునాది. రజాకార్ల ఆగడాల గురించి అలుపెరగకుండా మాట్లాడుతున్నవారే దీన్ని ప్రదర్శిస్తున్నారు.**

1900 మే 31న పుట్టిన (కొన్నిచోట్ల 1902 జూలై 17గా ఉంది) రజ్వీ న్యాయవాదిగా లాతూర్ (మహారాష్ట్ర) వచ్చాడు. అక్కడే ఇత్తెహాద్‌లో చేరాడు. అతివాదిగా గుర్తింపు తెచ్చుకున్నారు. 1946 డిసెంబరులో ఇత్తెహాద్ అధ్యక్షుడు అయ్యాడు. ఇత్తెహాద్‌కు ఆనాటికి రెండు ముఖ్యమైన లక్ష్యాలు ఉండేవి. ముస్లిం పాలక రాజ్యంగా నిజాం సంస్థానాన్ని యథాతథంగా కొనసాగించటం అందులో మొదటిది. భారత్‌లో చేరకుండా స్వతంత్రంగా ఉండటం రెండోది. మొదటి దాని కోసం ముస్లింల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టటం ప్రారంభించారు. రెండో దానికోసం భారత్‌తో విలీనం ఊసెత్తకుండా హిందువులను భయభ్రాంతులకు గురిచేశారు. కమ్యూనిస్టుల నేతృత్వంలో మొదలైన తెలంగాణ సాయుధపోరుపై కూడా రజాకార్లు విరుచుకుపడ్డారు. ముస్లిం పాలనను దెబ్బతీసే ఉద్యమంగానే రజాకార్లు దీన్ని భావించారు. రకరకాల దారుణాలు, ఉద్యమాలతో నిజాం సంస్థానం అట్టుడుకుతున్న పరిస్థితుల్లోనే దేశ విభజనకు రంగం సిద్ధమైంది. బ్రిటిష పాలకులు దేశాన్ని వీడటం ఖాయమైపోయింది. అప్పుడే నిజాం ప్రభుత్వం కొన్ని సంస్కరణలను ప్రకటించింది. వీటి ప్రకారం ప్రతి జిల్లా నుంచి ఒక హిందూ, ఒక ముస్లిం ప్రతినిధిని చట్ట సభలకు ఎన్నుకుంటారు. జాగీరుదార్లు, సర్దార్ల ప్రతినిధులూ ఎన్నికవుతారు. ప్రభుత్వమూ మరికొందరిని నామినేట్ చేస్తుంది. ఒకటి మాత్రం స్పష్టంగా కపడుతుంది. ముస్లింల ఆధిక్యతకు ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. కాంగ్రెస్ వీటిని తిరస్కరించింది. ముస్లిం స్థానాలన్నిటినీ ఇత్తెహాద్ కైవసం చేసుకుంది. సభాపక్షం నేతగా రజ్వీ ఎన్నికయ్యాడు. ఉదారవాది, పాలనానుభవం ఉన్న ప్రధాని మీర్జా ఇస్మాయిల్‌ని రజాకార్లు పనిచేయనివ్వలేదు. విసిగిపోయి రాజీనామా చేశారు. 'రజాకార్ల ఆగడాల కట్టడికి మీ నుంచి ఒక్క మాట వస్తే చాలు' అని ఇస్మాయిల్ లేఖ రాసినా నిజాం నుంచి ఉలుకూపలుకూ లేదు.



■ రాహుల్ కుమార్

1947 ఆగస్టు 15 నాటికి కశ్మీర్, జునాగఢ్, నిజాం సంస్థానాలు మాత్రమే భారత్‌లో విలీనానికి దూరంగా ఉన్నాయి. నిజాం ప్రతినిధి బృందం (ప్రధాని ఛత్తారీ, వాల్టర్ మాంక్టన్, సుల్తాన్ అహ్మద్)తో అప్పటికే డిల్లీలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఇరుపక్షాలూ ఒక నిర్ణయానికి వచ్చాయి. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యూనికేషన్లు మినహా మిగతా అంశాలన్నీ నిజాం ప్రభుత్వం కిందే ఉండేటట్లుగా ముసాయిదా తయారైంది. 1947 అక్టోబరు 26న నిజాం మంత్రివర్గం దానికి ఆమోదం తెలిపింది. నిజాం కూడా అందుకు సరేనని సంతకాన్ని ఒక రోజు వాయిదా వేస్తాడు. మరుసటి రోజు ఉదయానికి పరిస్థితి భయానకంగా మారుతుంది. రజ్వీ ఆదేశాలతో రజాకార్లు ప్రతినిధి బృందం ఇళ్లను చుట్టిముట్టి బీభత్సం సృష్టిస్తారు. అత్యవసర మంత్రివర్గ సమావేశాన్ని నిజాం తన ఇంట్లో ఏర్పాటుచేసి రజ్వీని దానికి ఆహ్వానించాడు. ఒప్పందాన్ని రజ్వీ మొత్తంగా వ్యతిరేకిస్తాడు. రజ్వీని నిలువరించలేని నిజాం వైఖరికి నిరసనగా ప్రధానితో పాటు ప్రతినిధి బృందం రాజీనామా చేస్తుంది. ఆ తర్వాత డిల్లీలో చర్చల కోసం కొత్త ప్రతినిధి బృందం ఏర్పాటవుతుంది. ఎట్టకేలకు 1947 నవంబరు 29న భారత—నిజాం ప్రభుత్వాల మధ్య యథాతథ ఒప్పందం కుదురుతుంది. ఏడాది పాటు అమల్లో ఉండాల్సిన దానిపై తొలి నుంచి ఉల్లంఘనలు ఆరోపణలు వెల్లువెత్తాయి. షరతుల ప్రకారం భారత సైన్యం హైదరాబాద్ నుంచి వైదొలగింది. ఇక ఒప్పందానికి విరుద్ధంగా నిజాం ప్రభుత్వం ఆయుధ సేకరణనూ మొదలుపెట్టింది. మరోవైపు పాక్‌తో సంప్రదింపులూ మానలేదు. రహస్యంగా రూ.20 కోట్ల సహాయాన్ని అందచేసింది. భారత్ కరెన్సీ నిజాం సంస్థానంలో చెల్లుబాటు కాదని ప్రకటించింది. ఐరాస భద్రతామండలి తలుపుతట్టింది. భారత సైన్యం సంస్థానంలోకి రాకుండా చూడాలని విజ్ఞప్తి చేసింది.. పాక్, బ్రిటన్‌లలో ప్రభుత్వం తరఫున ప్రతినిధులనూ నియమించింది. తొలి నుంచి తమకు చేదోడుగా ఉన్న ప్రధాని మీర్ లాయిక్ అలీ అండ చూసుకుని రజాకార్లు మరింతగా విజృంభించారు. విలీనం కోసం గవర్నర్ జనరల్ లార్డ్ మౌంటన్ బాటన్ చేసిన విన్నపాలనూ నిజాం లెక్కచేయలేదు. రజాకార్ల దారుణాలు, విస్తరిస్తున్న రైతాంగ సాయుధ పోరాటం, స్వతంత్రంగా ఉండేందుకు నిజాం చేస్తున్న ప్రయత్నాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఆపరేషన్ పోలోతో అయిదు రోజుల్లోనే నిజాం ప్రభుత్వం లొంగిపోతుంది. లాయిక్ అలీని గృహనిర్బంధంలో ఉంచుతారు. రజ్వీని అరెస్టుచేసి కేసులు పెడతారు. ఏడేళ్ల జైలు శిక్ష మాత్రమే పడుతుంది. 1957లో జైలు నుంచి విడులైన తర్వాత ఇత్తెహాద్ సమావేశంలో పాల్గొంటాడు. తాను పాక్‌కు వెళుతున్నాననీ కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని కోరతాడు. ఎవరూ ముందుకు రారు. అబ్దుల్ వహీద్ ఓవైసీని రజ్వీ నామినేట్ చేస్తాడు. 1957లో కరాచీకి వెళ్లి 1970లో అక్కడే చనిపోతాడు.

నెహ్రూ నిర్వాకం వల్ల కశ్మీర్ సమస్య జటిలమైందనీ, అసంబద్ధమైన విధానాలతో ఆర్టికల్ 370ని రూపొందించారనే విమర్శ ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. పటేల్ సమర్థంగా వ్యవహరించి హైదరాబాదుకు ఆ పరిస్థితి లేకుండా చేశారన్న పొగడ్తలూ అందరికీ తెలిసినవే. జరిగిన పరిణామాలను చూస్తే హైదరాబాదు పట్ల కొంత ఉదారత ప్రదర్శించినట్లు కనపడుతుంది. సంస్థానానికి ఉన్న రాజకీయ ప్రాధాన్యం దీనికి కారణం కావచ్చు. విలీనానికి ఒప్పుకోని ఏ సంస్థానంతోనూ హైదరాబాదు తరహాలో యథాతథ ఒప్పందం జరగలేదు. ఇక లాయిక్ అలీతో 1948 మేలో డిల్లీలో జరిపిన చర్చల్లో వి.పి.మేనన్ కొన్ని ముఖ్య ప్రతిపాదనలను చేశారు. పటేల్ వాటిని ఆమోదించారు. వీటి ప్రకారం: 1) తాత్కాలిక క్యాబినెట్ వెంటనే ఏర్పాటుకావాలి. ఇందులో 50 శాతానికి తగ్గకుండా ముస్లిమేతరులు ఉండాలి. 2) ఓటు హక్కుని విస్తృతపరచి 1950 జనవరి 1 నాటికి రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు జరపాలి. పరిషత్తులో 60 శాతం ముస్లిమేతరులు ఉండాలి. పరిషత్తుకు బాధ్యత వహించే ప్రభుత్వం ఏర్పడాలి 3) పరిషత్తు నూతన రాజ్యాంగాన్ని రూపొందిస్తుంది 4) భారత—హైదరాబాదు మధ్య సంబంధాలను కొత్త రాజ్యాంగం నిర్దేశిస్తుంది. 5) ఉద్యోగాల్లో ముస్లిమేతరుల సంఖ్య 1954 జనవరి 1 నాటికి 60 శాతానికి చేరుకోవాలి. వీటినీ నిజాం అంగీకరించలేదు. ఆమోదం తెలిపితే కొన్నేళ్లపాటు హైదరాబాదు స్వతంత్ర రాజ్యంగా కొనసాగేది. ఆ తర్వాతి పరిణామాలు ఏ మలుపులు తిరిగేవో ఇప్పుడు ఊహించనూలేం. విలీనం ఇంత హింసాత్మకంగా మారిన వ్యవహారం మరొకటి లేదు. అయినా నిజాంపైనా, లాయక్ అలీపైనా ఎలాంటి కేసులూ పెట్టలేదు. పైపెచ్చు నిజాంకు రాజ్‌ప్రముఖ్ పదవినీ కట్టబెట్టారు. పటేల్ ఆమోదంతో జరిగిన ఈ నిర్ణయాలపై చాలా వ్యాఖ్యానాలు చేయవచ్చు. అతిగా ఆలోచిస్తే హిందూత్వ రాజకీయ పరిభాషలో ముస్లిం బుజ్జగింపుగానూ భావించొచ్చు. మరోవైపు అతి ప్రాంతీయ మమకారం నిజాం పాలనపై నిష్పాక్షిక అంచనాను మసకబారుస్తోంది.

# అంగన్‌వాడీ అమ్మల ధర్మాగ్రహం!

న్యాయపరమైన డిమాండ్లతో 42 రోజులపాటు మండుటెండలను, షోకాజ్ నోటీసులను సైతం లెక్క చేయకుండా, ప్రభుత్వ బెదిరింపులకు లొంగకుండా లక్ష 25 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు రాష్ట్ర వ్యాప్తంగా చేసిన ఉద్యమాన్ని మోసపు హామీలతో ప్రభుత్వం నీరుగార్చింది. విధుల్లో చేరి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఏ హామీ అమలుకు జీవో ఇవ్వలేదు. సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న ఒక్క హామీకి తప్ప, మిగతా 11 హామీల్లో ఏ ఒక్క హామీకి జీవో జారీ చేయలేదు. ఎన్నికల కోడ్ రాకతో సమ్మె కాలానికి వేతనం ఇస్తామన్న హామీ కూడా అమలుకు నోచుకోలేదు.

అంగన్‌వాడీల సర్వీస్ కాలంలో ఎన్నడూ చూడని వేధింపులు నేడు చోటు చేసుకుంటున్నాయి. అంగన్‌వాడీలు చేసిన తప్పేంటి? పనిభారం తగ్గించాలని, వేధింపులు ఆపాలని కోర్టు తీర్పులను, చట్టాలను అమలు చేయాలని కోరటం పెత్తందారులకు నచ్చలేదా? ఐదేళ్లు దాటి ఎన్నికలు సమీపిస్తున్నా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నించే హక్కు అంగన్‌వాడీ ఉద్యోగులకు లేదా? వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చటం, పదవీ విరమణ ప్రయోజనం రూ.5 లక్షలకు పెంపు, సంపూర్ణ పోషణ చార్జీల పెంపు, టీఏ డీఏల చెల్లింపులు, నాలుగేళ్ల బకాయిలు విడుదల చేయాలని, పదోన్నతులు కల్పించాలని, పదవీ విరమణ వయసును 62కు పెంచాలని.. అన్న ఏ ఒక్క డిమాండ్‌ను పరిష్కరించలేదు. బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు కేటాయించకుండా ఆ భారం కూడా అంగన్‌వాడీలే మోయాల్సిన పరిస్థితిని సృష్టించారు.



**గడచిన ఐదేళ్లలో అంగన్‌వాడీలు అకుంఠిత దీక్ష, పట్టుదలతో పోరాటం చేశారు. ఈ పోరాటం ఎప్పటికీ వృథా కాదు. న్యాయపరమైన డిమాండ్లను చెవికి ఎక్కించుకోకుండా వేధింపులకు గురిచేసిన అవినీతి, అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దించి మన సమస్యలను పరిష్కరించే పాలకులనే ఎన్నుకుందాం. అంతిమ విజయం అంగన్‌వాడీలదే.**

సమ్మె విరమించి విధుల్లో చేరినప్పటి నుంచి గతంలో ఎన్నడూ లేనివిధంగా సూపర్‌వైజర్‌ల తనిఖీలు, సమీక్షలు అంటూ వేధింపులకు గురిచేస్తున్నారు. ఎన్నికలకు ముందు జగన్మోహన్ రెడ్డి వేతనాల పెంపుపై ఇచ్చిన హామీలు అమలు చేయమని కోరటం నేరమా? ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు వేయడానికి, తన బినామీ కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికి వేల కోట్లు మంచినీళ్ల ప్రాయంగా వెచ్చించే జగన్‌రెడ్డికి అంగన్‌వాడీలకు జీతం పెంచడానికి మాత్రం మనసు రాకపోవడం దుర్మార్గం కాక మరేమిటి? చట్టబద్ధంగా, ప్రజాస్వామిక పద్ధతుల్లో ఆందోళనలు చేసినవారిపై అక్రమ కేసులు పెట్టి నేటికీ తొలగించకపోవటం నమ్మకద్రోహం కాదా? అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యుటీ వర్తింపజేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా ప్రశ్నించినవారిపై కేసులు పెట్టటం దేనికి సంకేతం? గ్రామాల్లో చిన్నారుల ఆలనా పాలనా చూసే అంగన్‌వాడీ కార్యకర్తలను నేరస్థులుగా చూస్తారా? ప్రభుత్వానికి, ప్రజలకు ఎటువంటి ఉపయోగంలేని ప్రభుత్వ సలహాదారులకు వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ గ్రామాల్లో అమ్మల సేవలందించే అంగన్‌వాడీలకు ఇచ్చే అరకొర వేతనాలు కూడా సకాలంలో చెల్లించకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం కాదా? ఏ నాయకుడైనా నమ్మకంతో ప్రజల మనసులను గెలుచుకోవాలే తప్ప, కుట్రలతో కుయుక్తులతో ఓట్ల రాజకీయానికే పాల్పడరాదు. నమ్మకాన్ని కోల్పోయిన వారికి బుద్ధి చెప్పడానికి రేపనేది వుంటుందని జగన్ రెడ్డి మర్చిపోకూడదు

మూడు నెలలకొకసారి తనిఖీలు నిర్వహించే సూపర్‌వైజర్లు వారానికి మూడుసార్లు కేంద్రాలకు వెళుతూ కేంద్రాలు పరిశుభ్రంగా లేవు, ఫొటోలు తీసి పెట్టటంలేదు, పిల్లల హాజరు సంఖ్య తక్కువగా ఉంది అంటూ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. కేంద్రాలకు పిల్లలను తీసుకొచ్చేందుకు కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ సిబ్బంది నేరుగా పిల్లల ఇళ్లకు వెళ్లి వారిని తీసుకరావడంలో జాప్యం జరుగుతోంది. సూపర్ వైజర్లు తనిఖీలకు వెళ్లినప్పుడు దాన్ని కూడా తప్పుబడుతున్నారు. సమ్మె సమయంలో సచివాలయ సిబ్బంది కేంద్రాల తాళాలు పగులగొట్టి అందులోని సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు తప్పులతడకగా రికార్డుల్లో రాశారు. దీంతో పెద్ద ఎత్తున బఫర్ స్టాక్ మిగులు ఆన్‌లైన్‌లోకి వెళ్లిపోయాయి. ఈ బఫర్ సక్‌ను మినహాయించి మిగిలిన సరుకులను ప్రభుత్వం సరఫరా చేయటంవలన అంగన్‌వాడీ కేంద్రాల్లో పెద్దఎత్తున కొరత ఏర్పడి లబ్ధిదారులకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది. సమ్మె కాలానికి కేంద్రాల అద్దెలు, కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో వాటి అదనపు భారం కూడా అంగన్‌వాడీల మీదే పడింది. ప్రభుత్వం ఇచ్చే ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు సరిపోక అంగన్‌వాడీలు తమ చేతి డబ్బులు వదిలించుకోవలసి వస్తున్నది. అంగన్‌వాడీ కేంద్రాలలో కూడా వివక్షత కన్పిస్తుంది. 300 జనాభాకు తక్కువ ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు మినీ వర్కర్ అనే పేరుతో వర్కర్ పని, హెల్పర్ పని ఒకరితోనే చేయిస్తున్నారు.

గత ఐదేళ్లలో ప్రభుత్వ అవినీతి, అసమర్థత, అరాచకత్వంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణాలోపం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం సరిగా అందడంలేదు. నాసిరకం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కేంద్రాలకు తరలించిన ఘటనలు కోకొల్లలు. 'నాడు—నేడు' కింద చేపట్టిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల్లో కూడా భారీ అవినీతి చోటు చేసుకుంది. నాసిరకపు కట్టడాలు, మరమ్మత్తులతో కార్యకర్తలు, చిన్నారుల ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గల గర్భిణులు, బాలింతలకు డ్రై రేషన్ పంపిణీలో యాప్‌లు పెట్టటంతో ఫొటోలు అప్‌లోడ్ కాక లబ్ధిదారులకు సరుకులు వెళ్లక పడుతున్న ఇబ్బందుల గురించి ప్రభుత్వం ఒక్క రోజు కూడా సమీక్షించింది లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే గ్రామీణ ప్రాంతాల్లో రూ.10వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12వేలు ఆదాయం మించకూడదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న 51 వేల అంగన్‌వాడీ సిబ్బందికి సంక్షేమ పథకాలతో పాటు వితంతు, ఒంటరి, దివ్యాంగ పింఛనుకు దూరం చేశారు. 2019 జూన్‌లో అంగన్‌వాడీ కార్యకర్తల వేతనాన్ని రూ.1000 చొప్పున పెంచడంతో వేతనం రూ.10500 నుంచి రూ.11500కు చేరింది. అంటే పెరిగింది 9.5 శాతమే. ఆదాయ పరిమితి నిబంధనలు పెట్టి అమ్మ ఒడి, ఆసరా, పెన్షన్ వంటి ఎన్నో సంక్షేమ పథకాల్లో కోత కోశారు. పిల్లల సంరక్షణ నుంచి, గర్భిణీల పోషణ వరకు అన్ని కార్యక్రమాలు చూసే అంగన్‌వాడీలకు తక్కువ జీతం ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటూ సంక్షేమం గురించి ఒక్క రోజు కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి అన్ని విధులు నిర్వహిస్తున్నప్పటికీ వారి మాదిరి వేతనాలు, పెన్షన్‌లు, ఇతర సదుపాయాలు ఉండవు.

గడచిన ఐదేళ్లలో ఏ శాఖ ఉద్యోగులు చేయని రీతిలో అంగన్‌వాడీలు అకుంఠిత దీక్ష, పట్టుదలతో పోరాటం చేశారు. ఈ పోరాటం ఎప్పటికీ వృథా కాదు. న్యాయపరమైన డిమాండ్లను చెవికి ఎక్కించుకోకుండా వేధింపులకు గురిచేసిన అవినీతి, అసమర్థ ప్రభుత్వాన్ని గద్దె దించి మన సమస్యలను పరిష్కరించే పాలకులనే ఎన్నుకుందాం. అంతిమ విజయం అంగన్‌వాడీలదే. ఒక్కో అంగన్‌వాడీ కార్యకర్త అపరకాళిగా మారి జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని భస్మం చేయడం ఖాయం

• ఆచంట సునీత

# కాలంలో నిలిచిన కమ్యూనిస్టు నేత

ధర్మ బిక్షం ఒక వ్యక్తి కాదు. ఉద్యమ శక్తి బాల్యం నుండి తేజవంతమైన రూపంతో డిబేట్స్‌లో, హాకీ, ఫుట్‌బాల్ ఇతర క్రీడల్లో ఆయన చురుకైన పాత్రను పోషించాడు. ఒకవైపు ఉపాధ్యాయుల మెప్పు పొందుతూ మరొకవైపు విద్యార్థులకు ఆదర్శ నాయకుడిగా, సమాజంలో ప్రజా సమస్యలపై పోరాటాల్లో కూడా ముందు ఉండేవాడు. ఎక్కడ ప్రజా సమస్యలు ఉంటే అక్కడికి ఆయన వెళ్లేవాడు. పోరాట కార్యక్రమాలను తన వ్యక్తిగత గుర్తింపు కోసం చేసేవాడు కాదు. సకల విద్యార్థిలోకం శ్రేయస్సు కోసం, సంక్షేమం కోసం, ప్రగతి కోసం, సమాజం మార్పు కోసం ఆలోచిస్తూ, ప్రజా పోరాటాలను నిర్వహించేవాడు.



భూస్వాముల, జమీందారుల, దొరల పేరు వింటేనే భయపడే రోజుల్లో దొరతనం గురించి, భూస్వాముల ఆగడాల గురించి, దోపిడీ గురించి, అధ్యయనం చేశాడు. ఈ విషయాలన్నింటినీ ప్రజలకు, విద్యార్థులకు, కార్మికులకు, రైతులకు వివరంగా మీటింగ్‌లు పెట్టి వివరించేవాడు. రైతులకు వ్యవసాయ కార్మికులకు రాత్రిపూట మోట బావుల కాడ కాగడాల వెలుగులో వారిలో భయాన్ని పోగొట్టి బానిసత్వ జీవితాన్ని వదలగొట్టి చైతన్య జ్వాలలను నింపి, మనిషి జీవితం గొప్పతనాన్ని, స్వాతంత్ర్య ప్రాధాన్యతను, వివరించాడు. వారిలో దేశ భక్తిని రగిలించాడు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడడానికి యువతను మానసికంగా శారీరకంగా సంసిద్ధులను చేసిన మహాయోధుడు ధర్మ బిక్షం.

నిజాం నవాబు ప్రజా వ్యతిరేక పాలనపై రజాకార్ల రాక్షసకృత్యాలపై నిప్పులు కక్కిన ధర్మ బిక్షం జీవితం మాత్రం నిత్యం నిప్పుల గుండంలో నడుస్తున్నట్లు ఉండేది. నిజాం ప్రభుత్వం ఆయన్ని ఒక ప్రమాదకరమైన విప్లవకారుడిగా ప్రకటించింది. ధర్మ బిక్షం కనబడితే కాల్చివేయాలని ఆదేశాలు ఉన్నాయి. పోలీసులు ఆయనను పట్టుకొని కాల్చివేద్దామని ప్లాన్ చేశారు. కానీ ప్రజలు అయనకు కవచకుండలం లాగా ఉండటం వలన వారి పన్నాగం పటాపంచలయింది.

ధర్మ బిక్షం ఎమ్మెల్యేగా మూడుసార్లు, ఎంపీగా రెండుసార్లు విజయం సాధించారు. ప్రజల మనిషిగా పేరుపొందాడు. చట్టసభల్లో ప్రజల పక్షాన తన గొంతు వినిపించారు. సామాజిక, రాజకీయ, వ్యక్తిత్వ విలువలను పాటించి చట్టసభల గౌరవాన్ని పెంపొందించడంలో, కాపాడటంలో ఆయన ఆదర్శనీయమైన పాత్రను పోషించారు. ఓటును డబ్బులకు అమ్ముకుంటున్న ఈ రోజుల్లో, చట్ట సభల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్యకరమైన మాటలతో పోటీలుపడుతున్న ఈ తరుణంలో ధర్మ బిక్షం జీవితాన్ని ఒక మంచి గ్రంథంగా ప్రతి ఒక్కరు చదువుకోవలసిన సామాజిక అవసరం ఉంది. సమాజ మార్పుకు ఆయన చేసిన పోరాటాలు, త్యాగాలు, చూపిన ధైర్యం, ఆదర్శ జీవితం సదాస్ఫూర్తిదాయకం.

– కె.వి.ఎల్
తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





# నిన్ను కోరి వర్ణం

ముద్దబంతిలాంటి మోముపై ముచ్చటైన పసుపు రంగు ముత్యంలా మెరిసింది. నీలాల వర్ణం నిండు నీలమై మనసును ఆకాశమంత ఆనందంలో ముంచేసింది. అంబరాన్నంటే సంబరాలకు ఎరుపు రంగు ఎర్రటి తివాచీ పరిచింది. గులాబీ రంగు గుండెలపై గూడు కట్టుకుంది. హోలీ ఆనంద వేడుకలతో నగరం సోమవారం ఇంద్రధనస్సులా సప్తవర్ణాలను ఒలికించింది.



- నాలుగు నెలల కిందట.. అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు స్టేషన్‌కు వచ్చి తన ఇంట్లో రూ.12 లక్షలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేశాడు. ఆ సొమ్మును రికవరీ చేసిన పోలీసులు బాధితుడి వద్ద నుంచి రూ.80 వేల వరకూ వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి.
- నెల కిందట ఇదే స్టేషన్ పరిధిలోని ఓ బార్‌లో మందుబాబులు ఘర్షణ పడ్డారు. ఈ గొడవలో ఓ యువకుడు తీవ్రగాయాలపాలయ్యాడు. ఈ ఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసి, స్టేషన్ బెయిల్ నిమిత్తం ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వేలు దండుకున్నట్లు తెలిసింది.
- న్యూఆర్ఆర్ పేట అరుణోదయ నగర్‌లో గత నెలలో ద్విచక్ర వాహనం దొంగతనం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారు. వీరిలో ఒకరికి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. మిగిలిన ఇద్దరికి స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు రూ.30 వేలు చేతులు తడిపినట్లు సమాచారం.

పేరుకే ఫ్రెండ్లీ పోలీస్.. కానీ, అక్కడ కాసులున్నోడు, ప్రభుత్వ పెద్దల అండ ఉన్నోడితోనే ఫ్రెండ్‌షిప్ చేస్తారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ కల్పించాలనే రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ.. ఖద్దర్ నాయకులకు ఇక్కడి ఖాకీలు దాసోహమంటారు. న్యాయం కోసం స్టేషన్ గడప తొక్కే సామాన్యుడికి ఆశించిన సహాయాన్ని మాత్రం అందించని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పనితీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ష్.. గప్‌చుప్..!

## అజిత్‌సింగ్‌నగర్ పీఎస్ రూటే సెపరేటు

- నేరాలు దాచేందుకు పోలీసుల ఆపసోపాలు
- అర్ధరాత్రి దాటాకే కేసుల నమోదు
- మీడియాకు, ప్రజలకు తెలియకుండా గోప్యత
- స్టేషన్ ఆవరణలో జోరుగా సివిల్ పంచాయితీలు
- పాత కేసుల విచారణకు పాతర
- స్టేషన్ బెయిల్ కోసం రూ.వేలల్లో వసూలు




**అజిత్‌సింగ్‌నగర్ :** అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ రూటే సెపరేటు. వైసీపీ ప్రభుత్వ పాలనలో జరుగుతున్న నేరాలను మీడియాకు, ప్రజలకు తెలియకుండా గోప్యంగా ఉంచేందుకు ఇక్కడ చట్టాలను తుంగలో తొక్కుతారు. ఈ స్టేషన్‌లో కొంతమంది అధికారులు, సిబ్బంది అవినీతికి ఆజ్యం పోస్తూ ప్రవర్తిస్తుంటారు. ముందు రోజు జరిగిన సంఘటన అయినా, ఉదయం జరిగిన నేరమైనా, చోరీలైనా, మిస్సింగ్ కేసులైనా, చివరకు ప్రతిపక్ష నాయకులపై నమోదు చేసే అక్రమ కేసులైనా అర్ధరాత్రి సమయాల్లో చేపడతారు. ఫలితంగా తమ ప్రాంతాల్లో జరుగుతున్న నేరాలు మీడియా ద్వారా ప్రజలకు చేరనీయకుండా చేస్తున్నారు.

### మామూళ్లపైనే శ్రద్ధ

స్టేషన్ అధికారులకు మామూళ్లపై ఉన్న శ్రద్ధ నేరాల నియంత్రణపై ఉండట్లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా గంజాయి, బ్లేడ్‌బ్యాచ్ అధికంగా ఉండే న్యూఆర్‌ఆర్‌పేట, సింగ్‌నగర్ లూనా సెంటర్, చెత్త డంపింగ్ యార్డ్, రైల్వేట్రాక్ ప్రాంతాలపై నిఘా కొరవడిందని, వీరి ఆగడాలు రోజురోజుకూ పేట్రేగిపోతున్నాయంటూ స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొత్త అపార్ట్‌మెంట్ల ప్రాంతంలో అల్లర్లు అధికంగా జరుగుతున్నాయని, ఎన్ని ఫిర్యాదులు చేస్తున్నా వారిని అదుపు చేయడం లేదంటున్నారు. స్టేషన్ పరిధిలో ఎవరి స్థాయికి తగ్గట్టు వారు జేబులు నింపుకోవడంపైనే అధిక దృష్టి సారిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా మద్యం దుకాణాలపై నిఘా కొరవడింది. సమయం దాటినా కూడా బార్లలో మందు అమ్మకాలు జరుపుతుండటంతో గొడవలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసుల బీట్ల పేరుతో సిబ్బంది కూడా రోడ్డుపై తోపుడుబళ్లు, చిరు వ్యాపారుల వద్ద డబ్బులు దండుకునే పనులపైనే శ్రద్ధ చూపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

### అటు స్వామిభక్తి.. ఇటు కాసుల కక్కుర్తి..

స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాల బురదను ప్రభుత్వంపై పడకుండా చూస్తున్నామని చెప్పుకొంటూ కొంతమంది అధికారులు స్వామిభక్తిని చాటుకుంటున్నారు. న్యాయం కోసం వచ్చిన వారిని ఒకటి రెండు రోజుల వరకూ తిప్పి కాసుల కోసం రాజీలు పడేలా చేయడం, అది కాకపోతే అర్ధరాత్రులు కేసులు నమోదు చేసి బెయిల్ నిమిత్తం 41 సీఆర్‌పీసీ నోటీసులతో దండుకోవడం చేస్తున్నారు.

### నిద్దరోతున్న నిఘా

స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందా లేదా, పోలీసుల విధి నిర్వహణలో ఏమైనా లోపాలు ఉంటున్నాయా, చట్టానికి లోబడే సిబ్బంది నడుచుకుంటున్నారా లేదా, లంచాలు ఏమైనా తీసుకుంటున్నారా అనే అంశాలను గమనిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించేందుకు ప్రతి స్టేషన్‌కు ఓ నిఘా వర్గం ఉంటుంది. ఈ స్టేషన్‌కు కూడా నిఘా వర్గం ఉన్నప్పటికీ పోలీసులు ఏమాత్రం జంకు లేకుండా తమ పనులు చేసుకుంటున్నారు. వసూళ్లలో కొంత 'స్పెషల్'కు కూడా వెళ్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి.

# పశ్చిమాన పొత్తు పొడుపు

## విజయవాడ పశ్చిమకు బీజేపీనే..

- సుజనా చౌదరి పేరు దాదాపు ఖరారు
- ఇంకా పోరాడుతున్న పోతిన మహేశ్
- మూడు పార్టీలు కలిస్తే విజయం సునాయాసమే..



**(విజయవాడ-ఆంధ్రజ్యోతి) :** విజయవాడ పశ్చిమ.. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దృష్టి కేంద్రీకృతమైన నియోజకవర్గం. బీజేపీ అభ్యర్థిగా సుజనా చౌదరి బరిలోకి దిగుతున్నారన్న ప్రచారంతో ఎన్నికల వేడి మరింతగా రాజుకుంది. మైనారిటీల సీటుగా పేర్కొనే విజయవాడ పశ్చిమ నుంచి బీజేపీ పోటీ చేయడం, అది కూడా ఆ పార్టీలో ప్రముఖ నేతగా ఉన్న సుజనా చౌదరి పోటీలో ఉంటారన్న ప్రచారంతో ఎక్కడ చూసినా ఇదే చర్చ జరుగుతోంది.

### మైనారిటీల ప్రాబల్యమెక్కువ

ఈ నియోజకవర్గం 1967లో ఆవిర్భవించింది. నాటి నుంచి 12 సార్లు ఎన్నికలు జరిగితే ఐదుసార్లు మైనారిటీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో ఐదుసార్లు సమీప ప్రత్యర్థులుగా నిలిచారు. అలాంటి సీటు నుంచి బీజేపీ పోటీ చేయడం ఆసక్తిని పెంచే అంశమే. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 2.51 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో సుమారు 40 వేల వరకు మైనారిటీ ఓటర్లు. ఎస్సీలు, బీసీలు సింహభాగం ఉన్నారు. వీరి ఓట్లు సుమారు 1.20 లక్షల వరకు ఉంటాయి. బీసీల్లో కూడా నగరాల సంఖ్య ఎక్కువ. టీడీపీ ఆవిర్భావం తర్వాత ఒకే ఒక్కసారి మాత్రమే ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బీఎస్ జయరాజ్ 1983లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 2009 నుంచి ఎన్నికలను పరిశీలిస్తే.. 2014లో మాత్రమే బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. ఆ ఎన్నికల్లో టీడీపీతో పొత్తులో భాగంగా బీజేపీ అభ్యర్థిగా వెలంపల్లి శ్రీనివాస్ పోటీ చేశారు. ఆయనకు 60,072 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి, వైసీపీ అభ్యర్థి జలీల్‌ఖాన్ 3,100 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మిగిలిన ఏ ఎన్నికల్లోనూ బీజేపీకి 5 వేలకు మించి ఓట్లు రాలేదు.

### వ్యూహంతోనే విజయావకాశాలు

టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా కూటమి అభ్యర్థిగా సుజనా చౌదరి ఈ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగనున్నారు. ఈ మూడు పార్టీలు కలిస్తే ఇక్కడ బీజేపీ గెలుపు అసాధ్యమేమీ కాదు. కానీ, జనసేన నుంచి టికెట్ ఆశించి భంగపడిన పోతిన మహేశ్ ఏ మేరకు సహకరిస్తారన్నది ప్రశ్నార్థకం. ఇప్పటికీ మహేశ్ తనకు సీటు కేటాయించాలంటూ పోరాడుతున్నారు.
ఈ అవరోధాన్ని అధిగమించగలిగితే కూటమి అభ్యర్థికి సగం విజయం దక్కినట్టే. ఆ తర్వాత టీడీపీలో జలీల్‌ఖాన్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా కీలక నేతలుగా ఉన్నారు. వీరంతా ప్రస్తుతం టీడీపీలో ఉన్నా.. ఎవరికివారే అనే రీతిలో ఉన్నారు. వీరిని సమన్వయం చేసుకుని ఎన్నికల బరిలోకి వెళ్తే కూటమి అభ్యర్థి గెలుపు పెద్ద కష్టమేమీ కాదు.



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ (సాయంత్రం) : 6-21 (మంగళ)

సహర్ (ఉదయం) : 4-54 (బుధ)

**తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం** - 6లో..

# అధికార పార్టీ సేవలో పోస్టల్ ఉద్యోగి

## విధులు మాని ఉదయభాను ప్రచారంలో..



తిరుమలగిరిలో ఉదయభానుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న పోస్ట్‌మేన్ వసంతరావు (సర్కిల్‌లో)

**జగ్గయ్యపేట రూరల్, మార్చి 25 :** విధులకు డుమ్మాకొట్టి అధికార పార్టీ సేవలో తరిస్తున్నాడో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. జగ్గయ్యపేట చెరువుబజార్, ముత్యాలమ్మ వీధి రోడ్డులో ఉత్తరాలు బట్వాడా చేయాల్సిన పోస్ట్‌మేన్ పి.వసంతరావు సోమవారం విధులకు డుమ్మాకొట్టి తిరుమలగిరిలో వైసీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ అభ్యర్థి సామినేని ఉదయభానుతో ప్రచారంలో పాల్గొన్నాడు. పార్టీలో పలువురు చేరికలు, కార్యకర్తల అంతరంగిక సమావేశంలోనూ పాల్గొన్నాడు. అంతేకాదు.. మైకు అందుకుని ప్రభుత్వ భజన చేశాడు. దీనిపై నందిగామ పోస్టల్ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా, ఉద్యోగులు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకూడ దని, ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎలక్షన్ టీమ్ రెడీ

- ఎలక్షన్ డ్యూటీల ప్రక్రియ పూర్తి
- ఎన్నికల సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ

- 6లో..

**23 వేల మందితో పోలింగ్‌కు సిద్ధం**

# ఆదివారం అనూహ్యంగా..

ఉచిత దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు



## దుర్గమ్మ దర్శనానికి ఆదివారం ఒకటే రద్దీ

శుక్రవారం దుర్గమ్మ దర్శనమంటే భక్తులకు ఎంతో ప్రీతిపాత్రం. కానీ, ఇప్పుడు భక్తుల సెంటిమెంట్ ఆదివారానికి కూడా మారింది. ఆదివారం అమ్మను దర్శించుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈనెల ప్రారంభం నుంచి ఇది స్పష్టంగా కనిపిస్తోంది. ఇంటర్ పరీక్షలు పూర్తవడం, ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, రాజకీయ నాయకుల దర్శనాలతో ఆదివారమొస్తే ఇంద్రకీలాద్రి నిత్య కల్యాణం పచ్చతోరణంలా కళకళలాడుతోంది. ఇక టెన్త్, డిగ్రీ పరీక్షలు పూర్తయితే భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

- ఈ మూడు వారాల్లో భారీగా పెరుగుదల
- 30 వేల నుంచి 40 వేలకు..
- రూ.500, రూ.300, రూ.100 టికెట్లకూ అంతే..
- దేవస్థానానికి భారీగా ఆదాయం
- లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా కూడా..
- సిఫార్సు దర్శనాలు తగ్గితే మరింత ఆదాయం

**(ఆంధ్రజ్యోతి-విజయవాడ) :** ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ ప్రతి శుక్రవారం కనిపించే విషయమే. ఇక ఆదివారం కూడా రద్దీ ఓ మోస్తరుగానే ఉంటుంది. కానీ, గత మూడు, నాలుగు వారాలుగా భక్తుల సంఖ్యను పరిశీలిస్తే.. అనూహ్యంగా పెరిగిందని ఆలయ వర్గాలు చెబుతున్నాయి. ప్రతి ఆదివారం భక్తుల రద్దీ ఉంటుందని, కానీ ఈ మధ్య మరింతగా పెరిగిందని అంటున్నాయి. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు పూర్తవ్వడంతో విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 3, 4 తేదీల్లో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మొత్తం విద్యాసంస్థలకు సెలవులిస్తే ఇంద్రకీలాద్రి మరింత రద్దీగా కనిపించడం ఖాయమని అధికారులు చెబుతున్నారు.

### వారంవారం హెచ్చు

ఆలయ గణాంకాల ప్రకారం ఒక ఆదివారానికి తర్వాత వచ్చే ఆదివారానికి భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది.

- ఈనెల 10వ తేదీన రూ.500 టికెట్ ద్వారా 1,157 మంది దర్శనం చేసుకున్నారు. దీనిద్వారా రూ.5లక్షల78వేల500 ఆదాయం వచ్చింది. రూ.300 టికెట్ ద్వారా 700 మంది దర్శనం చేసుకోగా, రూ.2లక్షల10వేల ఆదాయం సమకూరింది. రూ.100 టికెట్ ద్వారా 3,612 మంది దర్శనం చేసుకున్నారు. దీనిద్వారా రూ.3లక్షల61వేల200 ఆదాయం దేవస్థానానికి సమకూరింది.
- ఈనెల 17వ తేదీన రూ.500 టికెట్ ద్వారా 2,003 మంది దర్శనం చేసుకోగా, రూ.10లక్షల1500 ఆదాయం లభించింది. రూ.300 టికెట్ ద్వారా 1,008 మంది దర్శనం చేసుకున్నారు. ఈ టికెట్ల ద్వారా రూ.3లక్షల26వేల400 ఆదాయం వచ్చింది. ఇక రూ.100 టికెట్ ద్వారా 5,018 మంది చేసుకోగా, రూ.5లక్షల1800 ఆదాయం చేకూరింది.
- 24వ తేదీన రూ.500 టికెట్ ద్వారా 2,319 మంది చేసుకోగా, రూ.11లక్షల59వేల500 ఆదాయం వచ్చింది. రూ.300 టికెట్ ద్వారా 1,302 మంది దర్శనం చేసుకోగా, రూ.3లక్షల90వేల600 ఆదాయం లభించింది. రూ.100 టికెట్ ద్వారా 6,248 మంది దర్శనం చేసుకోగా, రూ.6లక్షల24వేల800 ఆదాయం చేకూరింది. కేశఖండన టికెట్ల ద్వారా ఈనెల 10వ తేదీన రూ.54,560 ఆదాయం రాగా, 17న రూ.1,17,120, 24న రూ.1,17,120 ఆదాయం వచ్చింది. భక్తుల రద్దీ పెరగడంతో ప్రసాదాల విక్రయం ద్వారా వచ్చే ఆదాయంలోనూ పెరుగుదల కనిపిస్తోంది. రాబోయే రోజులన్నీ సెలవులు కావడంతో ఈ ఆదాయం మరింత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

### ఉచిత దర్శనానికి భారీ పెరుగుదల

అర్జిత టికెట్ల ద్వారానే కాదు.. ఉచిత దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్యలోనూ భారీగా పెరుగుదల కనిపించింది. సాధారణంగా ఆదివారాల్లో 25 వేల నుంచి 30 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. కానీ, ఈ నెల ఆదివారాల్లో రద్దీ అనూహ్యంగా పెరిగింది. ప్రతి ఆదివారం సుమారు 35 వేల నుంచి 40 వేల మంది భక్తులు దర్శనానికి వస్తున్నారని ఆలయ వర్గాలు చెబుతున్నాయి.



రెడ్డిగూడెంలో టీడీపీ నాయకులతో వసంత వెంకట కృష్ణప్రసాద్

## అమరావతిని సర్వనాశనం చేసిన జగన్

▸ వసంత వెంకట కృష్ణప్రసాద్



**జి.కొండూరు/రెడ్డిగూడెం, మార్చి 25 :** ఎన్నికల ముందు అమరావతిని రాజధానిగా చెప్పి తర్వాత మూడు రాజధానులుగా మాట మార్చి అమరావతిని జగన్‌రెడ్డి సర్వనాశనం చేశారని మైలవరం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ విమర్శించారు. సోమవారం కట్టుబడిపాలెంలో టీడీపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వసంతకు గ్రామస్థులు ఘనస్వాగతం పలకగా మహిళలు హారతులు పట్టారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రపంచీకరణ నేపథ్యంలో పట్టణాల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఏపీలో పరిశ్రమలు రాక యువత భవిష్యత్తు నాశనమవుతోందని, సమగ్ర అభివృద్ధి జరగడం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలు మౌలిక సదుపాయాలు, వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని శ్రేణులకు సూచించారు. రెడ్డిగూడెంలో సోమవారం కృష్ణప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి, దాసరి శివన్నారాయణలతో ఆయన చర్చలు జరిపారు. రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ కోసం చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాఘవాపురంలోని సత్తిరెడ్డి పద్మావతి(పెద్దమ్మతల్లి)లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

## అప్పులు, పన్నులతో నడ్డివిరిచిన జగన్

▸ దేవినేని ఉమామహేశ్వరరావు



**గొల్లపూడి :** సంపద సృష్టి చేతకాక అప్పులు, పన్నులతో జగన్‌రెడ్డి ప్రజల నడ్డి విరిచాడని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. గొల్లపూడిలో సోమవారం ఆయన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఐదేళ్ల పాలనలో చెత్త పన్నులన్నీ వేసిన జగన్ ఔరంగజేబునే మించిపోయాడని ఎద్దేవా చేశారు. అభివృద్ధి చేయకపోగా అద్దె, ఆధారిత ఆస్తి పన్ను విధానాన్ని తీసేసి ఆస్తి మూలధన విలువ ఆధారంగా పన్ను విధిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల పెంపుతో వేలకోట్ల భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి భంగపాటు తప్పదన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు.



తమిరిశలో ఇంటింటి ప్రచారంలో వెనిగండ్ల రాము

## టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి : వెనిగండ్ల

**నందివాడ :** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో రావాలని గుడివాడ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం 'బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమం రావి వెంకటేశ్వరరావు, పిన్నమనేని వెంకటేశ్వరరావు, పిన్నమనేని పూర్ణ వీరయ్య, మాగంటి శ్రీనివాసరావు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెనిగండ్లకు తమిరిశ గ్రామంలో కార్యకర్తలు పూలతో స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరిగి 'బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ' పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులు కూడా వాడేసుకుని గ్రామాలను అంధకారంలో ఉంచారన్నారు. రావి మాట్లాడుతూ, కల్లబొల్లి మాటలు చెబుతూ ప్రజలు సమస్యలు పట్టని నానికి ప్రజలు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. దానేటి సన్యాసిరావు, మద్దాల కరుణాకరరావు, వెంకటేశ్వరరావు, నాగరాజు, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

## వైసీపీతో విసిగెత్తి టీడీపీలోకి చేరికలు : రవీంద్ర

**మచిలీపట్నం టౌన్, మార్చి 25 :** అవినీతి, అక్రమాలకు నెలవైన వైసీపీతో విసిగిపోయిన కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి, మచిలీపట్నం ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. 19వ డివిజన్‌లోని వైఎస్ఆర్ కాలనీలో సోమవారం 50 కుటుంబాలు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, జనసేన నేత బండి రామకృష్ణల సమక్షంలో తెలుగుదేశంలో చేరాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రజలకు ఎన్నో లాభాలున్నాయన్నారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, బందరులో పేర్ని నాని కుటుంబసభ్యుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, బచ్చుల బోసుబాబు, మోటమర్రి బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో తాతయ్య, చినబాబు

**తాతయ్య సమక్షంలో..**

**జగ్గయ్యపేట:** వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే రాష్ట్రం, పిల్లలు భవిష్యత్ నాశనమవుతుందని బీజేపీ, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీరాం తాతయ్య అన్నారు. సోమవారం తొర్రగుంటపాలెంకు చెందిన తోట నరసింహారావు, కలాల పుల్లయ్య, తాటి శ్రీనివాసరావు, రేవంత్, కుటుంబం సైదా, నిఖిల్, మక్కపేట నాగేశ్వరరావు, పూర్ణచంద్రరావు, నాగుల్‌మీరా, గోపీ, మాసారపు సాయికృష్ణలు వైసీపీకి గుడ్‌బై చెప్పి టీడీపీలో చేరారు. 31వ వార్డు శాంతినగర్‌కు చెందిన అధికార పార్టీకి చెందిన దేవభక్తుని రమేష్‌బాబు, నాగేశ్వరరావు, ఎం.బాబు, ఎల్.గోపినాథ్, జి.నరేంద్ర, బి.శ్రీకాంత్‌లు తాతయ్య సమక్షంలో టీడీపీలో చేరారు.



వైసీపీ నుంచి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బోడె ప్రసాద్, పార్థసారథి

**సారథి, బోడె సమక్షంలో..**

**ఉయ్యూరు :** ముదునూరు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ పాలడుగు సత్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు బీసీ, ఎస్సీ, ఓసీ నాయకులు సోమవారం టీడీపీలో చేరారు. పాలడుగు సత్యనారాయణ 50మందికి పైగా అనుచరులతో కలిసి వైసీపీని వీడి పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు. పార్థసారథి కార్యాలయంలో పెనమలూరు టీడీపీ ఇన్‌చార్జ్ బోడె ప్రసాద్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధితోపాటు, రైతులకు టీడీపీతోనే న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో వైసీపీని వీడినట్టు సత్యనారాయణ తెలిపారు.

## తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు ప్రారంభం

**పెనుగంచిప్రోలు, మార్చి 25 :** పెనుగంచిప్రోలు తిరుపతమ్మ చిన్న తిరునాళ్లు సోమవారం అఖండ జ్యోతి స్థాపనతో ప్రారంభమయ్యాయి. ఈవో కె.రమేష్‌నాయుడు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి లాంఛనంగా తిరునాళ్లకు శ్రీకారం చుట్టారు. తొలుత ఆలయ స్థల దాత చింతయ్య తరఫున తూర్పు బజార్ దళితులు అమ్మవారికి తొలిబోనం సమర్పించి పూజలు చేశారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, వేల్పుల రవికుమార్, ముండ్లపాటి ప్రసాదరావు, కర్ల వెంకటేశ్వర్లు, ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తున్న తూర్పు బజార్ దళితులు

**అమ్మవారికి రూ.1.81 కోట్ల ఆదాయం**

తిరుపతమ్మ దేవస్థానం వద్ద వ్యాపారాలు, వివిధ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగ వేలంలో రూ.1.81 కోట్ల ఆదాయం సమకూరినట్టు ఇవో రమేష్‌నాయుడు చెప్పారు. బేడా మండపంలో వేలం నిర్వహించగా ఆలయ అధికారులు, వ్యాపారులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో విద్యుత్ కాంతులతో తిరుపతమ్మ దేవస్థానం

# ప్రహసనంగా వాహన తనిఖీలు

▸ చెక్‌పోస్టుల వద్ద పెరిగిన రద్దీ

▸ సిబ్బంది కొరత, అరకొరగా చెకింగ్

**జగ్గయ్యపేట రూరల్, మార్చి 25 :** ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో తనిఖీలు ప్రహసనంగా మారాయనే ఆరోపణలు వస్తున్నాయి. మండలంలోని గరిపాడు, ముక్త్యాల, గండ్రాయి గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. గరికపాడు వద్ద 65వ నంబరు జాతీయ రహదారి కావటంతో నిత్యం వందల వాహనాలు వస్తుంటాయి. అన్ని వాహనాలను తనిఖీ చేయటం సిబ్బందికి కత్తి మీద సాములా మారింది. జాతీయ రహదారిపై ప్రధాన రహదారిని బారికేడ్లతో మూసి సర్వీస్ రోడ్డులో వాహనాలు వచ్చేలా ఏర్పాటు చేయటంతో అటుగా వచ్చే భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు కూడా ఒకేసారి రావటం అరకొర సిబ్బందితో తనిఖీలు చేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో భారీ వాహనాల ప్రవేశానికి ప్రధాన మార్గం, ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను మరొక వరుసలో తనిఖీ చేసేవారు. నేడు ఒకే దారిలో భారీ, చిన్న వాహనాలను తనిఖీ చేస్తుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా సిబ్బందికి కూడా కత్తిమీద సాములా మారాయి.

**ఆ వాహనాల తనిఖీలు శూన్యం**

ప్రభుత్వ, ఎమ్మెల్యే, ఎంపీ, ఛైర్మన్, ప్రెస్, పోలీస్, తదితర స్టిక్కర్‌లతో పాటు సైరన్ మోగిస్తూ వస్తున్న వాహనాలను చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని, ఆ వాహనాలను ఆపితే మా వాహనాలు కూడా తనిఖీ చేస్తారా అని మాట్లాడుతుండటంతో సిబ్బంది మిన్నకుంటున్నారని, ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరుతున్నారు.



తనిఖీల కోసం బారులు తీరిన వాహనాలు



**సిబ్బంది కొరతతో ఇక్కట్లు**

జాతీయ రహదారిపై మూడు షిఫ్టుల్లో తనిఖీలు చేస్తున్నా అరకొర సిబ్బందితో వందల సంఖ్యలో వస్తున్న వాహనాలను తనిఖీ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెక్‌పోస్టు వద్ద కనీస వసతులు కూడా లేవని, ఏదైనా అవసరమైతే 15 కి.మీల దూరంలోని జగ్గయ్యపేట, లేకుంటే రామాపురం క్రాస్‌రోడ్డు గానీ వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు మండుతున్న ఎండలు, వాహనాల నుంచి వచ్చే వేడి, కాలుష్యంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. పోలీస్, ఎక్సైజ్, కమర్షియల్ ట్యాక్స్ అధికారులు తనిఖీలలో పాల్గొంటున్నా సింహభాగం భారం పోలీసులపైనే పడుతున్నది. మిగిలిన శాఖలు నామమాత్రంగాపాల్గొంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బందికి రెండింతలు సిబ్బందిని ఏర్పాటు చేస్తే తనిఖీలు పటిష్టంగా నిర్వహించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు స్పందించాలని వాహనదారులు సూచిస్తున్నారు. అదనపు సిబ్బంది, వసతులు కల్పిస్తే తనిఖీలు పారదర్శకంగా సాగుతుందని చెబుతున్నారు.

# బుద్ధప్రసాద్‌కు సీటు ఇవ్వాల్సిందే..

▸ తెలుగు తమ్ముళ్ల తిరుగుబాటు

▸ అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయించటంపై ఆగ్రహం

▸ రాజీనామాలకు సిద్ధమని ప్రకటన

**అవనిగడ్డ, మార్చి 25 :** టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అవనిగడ్డ నియోజకవర్గ సీటును జనసేనకు కేటాయిస్తూ పార్టీ నిర్ణయం తీసుకోవటం పట్ల తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అవనిగడ్డలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ ఇంటి వద్ద సోమవారం ఉదయం జరిగిన అత్యవసర సమావేశంలో పార్టీ శ్రేణులు, నేతలు పాల్గొని సమన్వయ కమిటీతో గానీ, నియోజకవర్గ ఇంచార్జ్‌తో గానీ ఎలాంటి సంప్రదింపులు లేకుండా అవనిగడ్డ సీటును జనసేనపార్టీకి ఎలా కేటాయిస్తారంటూ పలువురు నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. వైసీపీ అరాచకాలపై అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి బుద్ధప్రసాద్‌ను కాదని, ఎక్కడి నుంచో డబ్బు సంచులతో దిగుతున్న వారికి సీటు కేటాయిస్తే తాము పనిచేయాలా అని ప్రశ్నించారు. కార్యకర్తల అభీష్టానికి వ్యతిరేకంగా అధినాయకత్వ నిర్ణయాన్ని తాము సమర్థించబోమని, అవసరమైతే పార్టీ సభ్యత్వాలకు రాజీనామా చేస్తామని కొందరు ప్రకటించగా, మరి కొందరు తెలుగుదేశం కండువాతోనే స్వతంత్రంగా పోటీచేసి సత్తా చూపుదామని పిలుపునిచ్చారు. పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ నేత రావి చిట్టిబాబు, టీడీపీ సీనియర్ నేత యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అవసరమైతే స్వతంత్రంగా పోటీ చేసి సత్తా చాటుదామని మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు సూచించారు.

**ఊహించలేదు : మండలి వెంకట్రామ్**

1972 నుంచి తమ కుటుంబం రాజకీయాల్లో ఉందని, పార్లమెంట్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వ్యక్తిగా తాత మండలి వెంకట కృష్ణారావుకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న తనతండ్రి బుద్ధప్రసాద్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ మంచి పేరు ఉందని, అలాంటి కుటుంబానికి నేడు కనీసం సమాచారం ఇవ్వకుండా సీటును వేరే వారికి కేటాయించే పరిస్థితి వస్తుందని ఊహించలేదని మండలి బుద్ధప్రసాద్ తనయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. సీటు జనసేనకు ఎలాంటి పరిస్థితుల్లో కేటాయించాల్సి వచ్చిందో తమకు చెప్పి ఉంటే తాము స్వాగతించి ఉండేవారమన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు



బాలాజీ బృందం కూచిపూడి నాట్యాభినయం



కేరళ బృంద కూచిపూడి నృత్య ప్రదర్శన

ఆద్యంతం భక్తిభావం..

## కూచిపూడి అభినయం

**కూచిపూడి, మార్చి 25 :** బాలాత్రిపుర సుందరిదేవి సమేత రామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆరవ రోజైన సోమవారం శ్రీ సిద్దేంద్ర కళావేదికపై కూచిపూడి నాట్యాంశాలు ఆద్యంతం భక్తిభావంలో ముంచెత్తాయి. సప్పా శివకుమార్ శిష్యబృందం మూషిక వాహన, అదివో, అల్లదివో, కొండలలో నెలకొన్న అంశాలు ప్రదర్శించారు. దొడ్డా బాలాజీ (హైదరాబాద్) శిష్య బృందం దశవతార శబ్దం, దేవి స్తుతి, ఎందరో మహానుభావులు అంశాలను ప్రదర్శించారు. అనంతరం పసుమర్తి శ్రీ వల్లీ శిష్యబృందం మూషిక వాహన, వినాయక కౌత్వం అంశాల్లో హవభావాలు ఆకట్టుకున్నాయి. దేవరకొండ శ్రీనివాస శిష్యబృందం బ్రహ్మాంజలి, శివపార్వతీ అంశాలు ప్రదర్శించి మెప్పించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రత్తయ్య శర్మ, శ్రీలక్ష్మీ గోవర్ధనం కేరళ శిష్య బృందం గణేశ కౌత్వం, పూజా నృత్యం, జతి స్వరం, దశవతార శబ్దం అంశాలు ప్రదర్శించి నాట్యాంశాలకు వన్నె తెచ్చారు. అనంతరం కళాకారులను మెమొంటోలతో ఘనంగా సత్కరించారు.

# భూ హక్కుల చట్టాన్ని అడ్డుకుందాం

▸ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

**చల్లపల్లి, మార్చి 25 :** దున్నే వానికే భూమి ఉద్యమ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో భూ హక్కుల చట్టాన్ని ఎదుర్కోవాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ పిలుపునిచ్చారు. పేద, మధ్య తరగతి రైతుల భూములు, ఆస్తులు, సాగు హక్కులను కాలరాసే ఉద్దేశ్యంతో తెచ్చిన ఆంధ్రప్రదేశ్ భూమి హక్కుల యాజమాన్య చట్టం-2023ను రద్దు చేయాలని కోరుతూ రైతుకూలీ సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో చల్లపల్లి ఏటీఎం సెంటరులో సోమవారం సాయంత్రం బహిరంగ సభ జరిగింది. రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జె.జగన్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఝాన్సీ మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వ్యవసాయాన్ని స్వదేశీ దోపిడీ వర్గాలకు, కార్పొరేట్లకు అప్పగించటానికి ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలుచేయటంలో దూకుడుగా వెళుతోందన్నారు. దీనిలో భాగంగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేత శాశ్వత భూ హక్కుల చట్టం-2023 చేయించారన్నారు. ఈ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే రైతులకే కాక సామాన్య ప్రజల ఆస్తులకు కూడా భద్రత ఉండదన్నారు. ఇప్పటివరకూ భూమి హక్కుల వివాదాలపై రెవెన్యూ రికార్డుల ఆధారంతో కోర్టుకి వెళ్లి హక్కులను సాధించుకునేవారనీ, ఈ చట్టం ద్వారా ల్యాండ్ టైటిల్ అధికారి ఇచ్చినటువంటి ధృవీకరణ పత్రాలే శాశ్వత పట్టాలుగా ఉండబోతున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతాంగ భూములను కట్టబెట్టడం కోసం చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. రైతాంగం దున్నే వానికి భూమి హక్కు నినాదంతో భూ హక్కు చట్టం రద్దుకు ఉద్యమించాలన్నారు. జనసాహితి రాష్ట్ర అధ్యక్షుడు దివి కుమార్, రైతుకూలీ సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి యు.వీరబాబు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, సభాధ్యక్షులు జె.జగన్‌లు ప్రసంగించారు. భూ చట్టం పూర్తిస్థాయిలో అమలైతే జరిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ

23 వేలమందితో

# ఎన్నికల టీమ్ రెడీ

▸ విధుల ప్రక్రియ పూర్తి.. పూర్తి స్థాయిలో శిక్షణ

▸ భారీ స్థాయిలో వాహనాల వినియోగం

▸ కమ్యూనికేషన్ కోసం శాటిలైట్ల ఫోన్లు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల టీమ్ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సిబ్బంది కసరత్తు పూర్తిచేసింది. జిల్లా వ్యాప్తంగా 23 వేలమంది ఎన్నికల సిబ్బందిని పూర్తిస్థాయిలో సిద్ధం చేయటం జరిగింది. సెక్టార్ ఆఫీసర్లు-169 మంది, సెక్టార్ పోలింగ్ ఆఫీసర్లు-169 మంది, మైక్రో అబ్జర్వర్స్ 900 మందిని ఎంపిక చేశారు. ప్రిసైడింగ్ ఆఫీసర్స్‌గా 2236 మందిని, పోలింగ్ ఆఫీసర్స్‌కు 10246 మందిని, బూత్‌లెవల్ ఆఫీసర్లుగా 1863 మందిని, నోడల్ అధికారులుగా 16 మందిని రిటర్నింగ్ ఆఫీసర్లు 8 మంది, సహాయ రిటర్నింగ్ అధికారులు 44 మంది, ఎలక్ట్రోరల్ ఆఫీసర్లు 7మంది, సహాయ ఎలక్ట్రోరల్ ఆఫీసర్లు 36 మందిని నియమించారు. పోలింగ్ పర్యవేక్షణ కోసం 7200 మంది పోలీసు బలగాలు అవసరమని నిర్ణయించారు. మొత్తం ఐదు కంపెనీల బలగాలకు ఇప్పటి వరకు నాలుగు కంపెనీల బలగాలు వచ్చాయి. ప్రధాన చెక్‌పోస్టులతో పాటు.. పొరుగు జిల్లాల నుంచి ఎన్టీఆర్ జిల్లాకు అనుసంధానమైన మార్గాలు, ఎన్టీఆర్ జిల్లా నుంచి విజయవాడలోకి అనుసంధానమైన మార్గాలలో ప్రత్యేక అవుట్‌పోస్టులు ఏర్పాటు చేయటంతో పాటు విధులు కూడా చేపట్టారు.

**పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ**

ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎవరు ఎలాంటి విధులు నిర్వహించాలన్న దానిపై ఇప్పటికే సుశిక్షితులను చేసింది. ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణ మొదలు కొని, పోలింగ్ సన్నద్ధత, పోలింగ్ ముందు ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్, పోలింగ్ రోజున ఈవీఎంల ఆపరేషన్, ఎన్నికలు ముగిశాక ఈవీఎంలను సీల్ చేయటం, కౌంటింగ్ సమయంలో వాటిని ఓపెన్ చేయటం, లెక్కించటం వంటి వాటిపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వటం జరిగింది. ప్రవర్తనా నియమావళికి సంబంధించి పనిచేసే ఎంసీసీ ఆఫీసర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు సంబంధించిన సిబ్బందికి ఈఎస్ఎంఎస్ అప్లికేషన్‌పై ఎలా పనిచేయాలో శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు సువిధ అప్లికేషన్ ద్వారా నామినేషన్లను ఎలా స్వీకరించాలో శిక్షణ ఇవ్వటం జరిగింది. పోలింగ్ విధులకు సంబంధించి సంబంధిత ఉద్యోగులకు శిక్షణ ఇవ్వటం జరిగింది.

**వెయ్యికి పైగా వాహనాలు సిద్ధం**

ఎన్నికల నేపథ్యంలో, జిల్లా ఎన్నికల యంత్రాంగం మొత్తం 1185 వాహనాలను ఉపయోగించబోతోంది. 2014 సార్వత్రిక ఎన్నికలలో 769 వాహనాలను ఉపయోగించగా.. 2019 సార్వత్రిక ఎన్నికలలో 1055 వాహనాలను ఉపయోగించటం జరిగింది. ప్రస్తుతం జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ 1185 వాహనాలను ఉపయోగించాలని నిర్ణయించటం గమనార్హం. ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, ఎలక్ట్రోరల్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు, ఎంసీసీ బృందాలు, పోలింగ్ ఆఫీసర్ల కోసం కార్లు వంటి వాహనాలను సమకూర్చుతున్నారు. పోలింగ్ విధులు నిర్వహించే వారి కోసం బస్సులను కేటాయించనున్నారు. భద్రతా సిబ్బంది కోసం 728 వాహనాలను సిద్ధం చేయనున్నారు. పోలింగ్ సిబ్బంది కోసం 385కు పైగా బస్సులను సిద్ధం చేయనున్నారు.

**శాటిలైట్ ఫోన్ల వినియోగం**

ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వహించే అధికారుల దగ్గర నుంచి పోలింగ్ సిబ్బంది వరకు కమ్యూనికేషన్ కోసం భారీ ఎత్తున టెలికమ్యూనికేషన్ సేవలను ఉపయోగించుకుంటున్నారు. శాటిలైట్ ఫోన్లు, శాటిలైట్ ఆధారిత మొబైల్స్ ఇతర సెట్లను ఉపయోగించనున్నారు. జిల్లా ఎన్నికల అధికారి ప్రధానంగా శాటిలైట్ ఫోన్‌ను ఉపయోగించనున్నారు. వీహెచ్ఎఫ్ బేస్ సెట్స్-500, రిపీటర్స్-9, వీహెచ్ఎఫ్ హ్యాండ్ సెట్స్-290 మొత్తం కలిపి 800 అత్యాధునిక కమ్యూనికేషన్ సెట్స్‌ను ఉపయోగించబోతున్నారు.

## ఏఐటీయూసీ జిల్లా మహాసభలు వాయిదా

**గుడివాడ, మార్చి 25 :** ఈ నెల 27, 28 తేదీల్లో గుడివాడలో నిర్వహించాల్సిన ఏఐటీయూసీ 12వ జిల్లా మహాసభలను వాయిదా వేస్తున్నట్టు జిల్లా కన్వీనర్ టి.తాతయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో జిల్లా మహాసభల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినప్పటికి ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్టు తెలిపారు. ఆహ్వానసంఘం సభ్యులు సత్యనారాయణ సూచన మేరకు జూలై 27, 28 తేదీల్లో నిర్వహించాలని నిర్ణయించినట్టు తాతయ్య తెలిపారు.

## కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన ఉద్యోగుల తొలగింపు

**పెనమలూరు :** ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఉద్యోగులపై అధికారులు వేటు వేశారు. పెనమలూరు మండలం పెదపులిపాక పంచాయతీ శానిటరీ సూపర్‌వైజరుగా పనిచేస్తున్న షేక్ సుభాని, పీఏసీఎస్ ఉద్యోగిగా పనిచేస్తున్న షేక్ ఖలీల్ పాషాలు ఇటీవల మంత్రి జోగి తనయుడు జోగి రాజీవ్ సమక్షంలో వైసీపీలో చేరి పార్టీ కండువాలు కప్పుకోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'పెనమలూరులో ఉద్యోగుల బరితెగింపు' కథనంపై ఉన్నతాధికారులు స్పందించారు. ఇరువురినీ విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**పెదపులిపాకలో ప్రలోభాలు కొనసాగింపు**

పెదపులిపాకలో బుక్‌కీపర్, అంగన్వాడీ టీచరుగా పనిచేస్తున్న ఇద్దరు మహిళలు ఇంటింటికీ తిరిగి ఓటర్లను ప్రలోభపెట్టి వైసీపీకి ఓటేయాలని, లేని పక్షంలో పథకాలు రాకుండాపోతాయని భయపెట్టి ఓటర్లతో ప్రమాణాలు చేయిస్తున్నట్టు సమాచారం. సదరు ప్రలోభాలపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## కొండప్రాంత ప్రజల అవసరాలు తీర్చింది సీపీఐనే

● నగర కార్యదర్శి కోటేశ్వరరావు

**భవానీపురం, మార్చి 25 :** పశ్చిమలోని కొండ ప్రాంతాల్లో ప్రజలు అవసరాలను తీర్చిన ఏకైన పార్టీ సీపీఐనే అని ఆ పార్టీ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని సుబ్బరాజ్ భవన్‌లో 38, 42, 43, 44, 45 డివిజన్ల పార్టీ సభ్యుల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కొండలపై నివాసం ఏర్పరచుకుని జీవించిన ప్రజానీకానికి సీపీఐ అండగా నిలిచి బతుకుపై భరోసా కల్పించిందన్నారు. ఇక్కడ ఓటు అడిగే హక్కు మనకే ఉందన్నారు. నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు పంచదార్ల దుర్గాంబ, నాగేశ్వరరావు, ఉప్పలపాటి శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలకు అభివృద్ధిపై ధ్యాసేదీ?

### జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

**భారతీనగర్, మార్చి 25:** వైసీపీ నాయకులకు సమస్యలపై అవగాహన లేకపోవడమే కాకుండా నగర అభివృద్ధిపై ఏ మాత్రం ధ్యాస కూడా లేదని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ విమర్శించారు. తూర్పులోని 4వ డివిజన్ పరిధిలోని దళితవాడలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కార్పొరేటర్ జాస్తి సాంబ శివరావుతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ పథకాలను వివరించారు. జనసేన, బీజేపీలు బలపరిచిన టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిందిగా కోరారు. కార్పొరేటర్లు గొల్లపూడి నాగేశ్వరరావు, గోవిందరాజుభాస్కర్, మూర్తి, కొలసాని నాగమణి, జ్యోతి రత్నాకర్, కోట శివలక్ష్మి, తుళ్లూరు నాగ రాజు, కోడూరు ఆంజనేయ వాసు, డి.రజిని, విజయ, రత్నశ్రీ, వెంకాయమ్మ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న గద్దె అనురాధ

#### విధ్వంసం, అరాచకాలతో జగన్ పాలన

#### గద్దె రాజేష్, గద్దె క్రాంతి ఆరోపణ

**పటమట:** జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి విధ్వంసం, అరాచకతో పాలన సాగిస్తున్నాడని, ఈ పాలనకు చరమగీతం పాడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని యువ నాయకులు గద్దె రాజేష్, క్రాంతిలు పిలుపునిచ్చారు. 14వ డివిజన్‌లో సోమవారం గద్దె రామ్మోహన్ తనయులు గద్దె రాజేష్, గద్దె క్రాంతిలు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరూ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలందరూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాల్సిందిగా కోరారు. సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు నర్రా కిషోర్, గరికపాటి శ్రీనివాస్(బద్రి), చెరుకూరి సాంబయ్య, చెన్నుపాటి శ్రీనివాసరావు, యడ్లపల్లి శివనాగరాజు, ఫాతిమా, కర్లా రమేష్, వెంకన్న, నాసర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



14వ డివిజన్‌లో ప్రచారంలో గద్దె క్రాంతి, రాజేష్

#### 11వ డివిజన్‌లో ...

● 11వ డివిజన్ ఓల్డ్ పోస్టాఫీస్ రోడ్డులో సోమవారం సాయంత్రం గద్దె రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఎమ్మెల్యేగా రామ్మోహన్, ఎంపీగా కేశినేని చిన్నిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని రాజేష్ కోరారు. డివిజన్ అధ్యక్షుడు కోనేరు రాజేష్, పామర్తి కిషోర్, దేవరపల్లి ఆంజనేయులు, పాలడుగు ప్రసాద్, కె.నాగమణి, కె. మాలతి, వి. సుగుణ, ఎం.భార్గవి, వి. సోమశేఖర్, బి.రాజేష్‌లు పాల్గొన్నారు.



# టీడీపీ వైపే యువత మొగ్గు

### కేశినేని చిన్ని తనయుడు కేశినేని వెంకట్

**అజిత్‌సింగ్‌నగర్, మార్చి 25 :** సీఎం జగన్ పాలనతో విసుగుపోయిన యువత టీడీపీ వైపే మొగ్గు చూపిస్తున్నారని విజయవాడ పార్లమెంట్ తెలుగుదేశం అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ అన్నారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో కేశినేని వెంకట్ సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాగవంశ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎరుబోతు రమణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యూఆర్‌ఆర్‌పేటలోని పలు ప్రాంతాల్లో కేశినేని వెంకట్ పర్యటించి టీడీపీకి మద్దతు ఇవ్వాలని కరపత్రాలను అందజేశారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకుని టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ పేరుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని యువతను వంచించారన్నారు. ఈ సారి తెలుగుదేశంకే యువత మద్దతు ఉంటుందని, యువత భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు భరోసాగా ఉంటారని హామీ ఇచ్చారు. బొండా సిద్ధార్థ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కేశినేని వెంకట్



నాగమానసాదేవి మందిరంలో పూజలు, రంగులు చల్లుకుంటూ, సందడి చేస్తున్న చిన్నారులు

# కేరింతలతో హోలీ వేడుకలు

**గవర్నర్‌పేట/రాణిగారితోట/చిట్టినగర్/ వన్‌టౌన్, మార్చి 25:** ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజు వచ్చే హోలీ పండుగను సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. హోలీ సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓంశ్రీషిర్డి నాగసాయిబాబా-నాగమానసాదేవి మందిరంలో మహిళలు నాగమానసాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, డోలికోత్సవం నిర్వహించారు. పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించారు. మందిర వ్యవస్థాపకుడు సుధాస్వామి ఆధ్వర్యంలో మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. సాయిబాబా భక్తులు కనకమేడల భరత్ భూషణ్-శివపార్వతి దంపతులు, వెన్నా రామాంజనేయులు-రమాదేవి దంపతులు, ఇందిర, ఉమ, పద్మ, ధనలక్ష్మీ, వరలక్ష్మీ పాల్గొన్నారు.

● కృష్ణలంకలో చిన్నా పెద్ద తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సంతోషంగా గడిపారు. ముఖ్యంగా చిన్నారులు కేరింతలతో వాటర్ గన్స్‌తో రంగులు జల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● లంబాడీపేట, చిట్టినగర్, కె.ఎల్.రావునగర్, కేటీరోడ్డు తదితర ప్రాంతాలలో యువకులు, చిన్న పెద్దలు తేడా లేకుండా అందరు రంగులు చల్లుకున్నారు. యువకులు డప్పు నృత్యాలతో కేరింతలు కొట్టారు. చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. లంబాడిపేటలో పలువురు మహిళలు సంప్రదాయ నృత్యాలతో అందరిని అలరించారు.

● వన్‌టౌన్‌లో మహిళలు, పురుషులు వేర్వేరుగా, మరోవైపు కుటుంబాలతో రంగులు చల్లుకుని ఉత్సాహంతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వన్‌టౌన్‌లో మార్వాడీలు, గుజరాతీయులు ఎక్కువ మంది ఉండడంతో హోలీ వేడుకలకు ఇక్కడ ప్రత్యేకత ఏర్పడింది. మాడపాటి క్లబ్ వద్ద మార్వాడి సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈస్ట్ డీసీపీ అదిరాజ్ సింగ్ పాల్గొన్నారు. మార్వాడి సంఘం నాయకులు, యువకులు, యువతులు, వ్యాపారస్తులు సంబరాలలో పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి ఆసిఫ్ కార్యాలయంలోనూ వేడుకలు జరిగాయి.

# పోతిన మహేశ్‌కు టికెట్ ఇవ్వాలని కోరుతూ నిరసన

**వన్‌టౌన్, మార్చి 25:** పశ్చిమలో పోతిన మహేశ్‌కు టికెట్ ఇవ్వకపోతే కూటమి లక్ష్యం దెబ్బతింటుందని రాజధాని నగరంలో జనసేన ఉనికి దెబ్బతింటుందని పార్టీ నాయకులు అన్నారు. పోతిన మహేశ్‌కు సీటు కేటాయించాలని కోరుతూ జనసేన పశ్చిమ కార్యాలయంలో జనసేన మద్దతుదారులు, పార్టీ కార్యకర్తలతో సోమవారం నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీని బలోపేతం చేసి డివిజన్ కమిటీలు, బూత్ కమిటీలు, మహిళా కమిటీలను నియామకం చేసి ఎన్నికలకు పూర్తిగా సన్నద్ధమైన తరుణంలో మహేశ్‌కు టికెట్ నిరాకరించడం దారుణమని వ్యాఖ్యానించారు. అనంతరం మహేశ్ మాట్లాడుతూ తనకు సీటు ఇస్తేనే అధికార పార్టీ అభ్యర్థులు ఓడిపోతారని, లేకపోతే ఖచ్చితంగా కూటమి లక్ష్యం దెబ్బతింటుందని పేర్కొన్నారు. తప్పనిసరిగా తనకు పోటీ చేసే అవకాశం ఇస్తేనే కూటమి లక్ష్యం నెరవేరుతోందని మరోసారి స్పష్టం చేశారు.



నిరసన దీక్షలో పాల్గొన్న పోతిన మహేశ్



బీసీల బతుకు మారాలంటే

## చంద్రబాబు అధికారంలోకి రావాలి : వీరంకి

**మొగల్రాజపురం, మార్చి 25:** బీసీల బతుకు మారాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందని టీడీపీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి చెప్పారు. బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేరేపి ఈశ్వర్ ఆధ్వర్యంలో సోమవారం తూర్పు క్లస్టర్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి రాగానే బీసీల మీద దాడులు పెరిగాయని, హత్యలకు తెగబడుతున్నారని అన్నారు. బీసీల జీవితాలలో వెలుగులు నింపడానికి టీడీపీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సంగతి గుర్తు చేశారు. బీసీల జీవితాలతో ఆడుకుంటున్న జగన్ రెడ్డిని సాగనంపడానికి ప్రతి బీసీ టీడీపీకి ఓటేసి గెలిపించాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమానికి ముందు సుబ్బారావు కుటుంబానికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, 6,7 డివిజన్ల అధ్యక్షులు పడాల గంగాధర్, పటమట సతీష్ చంద్ర, జనసేన 6వ డివిజన అధ్యక్షుడు శ్రీతేజ, టీడీపీ నాయకుడు నాగుమోతు రాజా,రెండు డివిజన్‌ల నుంచి బీసీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరంకి గురుమూర్తి

## ఓటర్ల వెరిఫికేషన్

**వన్‌టౌన్, మార్చి 25:** స్థానిక 37వ డివిజన్ పరిధిలో సోమవారం టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి ఏ.లక్ష్మీ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఓటర్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50 ఇళ్ల వద్ద ఓటర్ వివరాలను తెలుసుకుని వారికి టీడీపీ కరపత్రాలను పంచి వచ్చే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని శివనాథ్(చిన్ని), టీడీపీ-బీజేపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పిళ్లా సుదర్శనరావు, నాయకులు అడ్డూరి లక్ష్మణ్, అల్లాడి మురళీబాబు, పిళ్లా మీనా కుమారి, మాచర్ల వసంతరావు, కపిలవాయి హరినాథ్, అమర గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గుంటూరు బాపనయ్యకు నివాళి



**రాణిగారితోట, మార్చి 25:** సీపీఎం నేత గుంటూరు బాపనయ్య 46వ వర్ధంతి కార్యక్రమాన్ని రాణిగారితోట 17వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు బాపనయ్య భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు బాపనయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గుంటూరు బాపనయ్య పార్టీ కోసం, ప్రజల కోసం చేసిన సేవలను నాయకులు కొనియాడారు. నాయకులు పి.కృష్ణ, తమ్మిన చంద్రశేఖర్, కందుకూరి వెంకటేశ్వర్లు, కృష్ణ, ఈశ్వర్ రెడ్డి, గురవయ్య, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి ధార్న రాజీనామా

**పటమట, మార్చి 25 :** బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు ధార్న చంద్రశేఖర్ ఆ పార్టీకి రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. తాను గత 20 సంవత్సరాలుగా బీజేపీలో ఉన్నానని, మూడుసార్లు కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేశానని, గత మూడు పర్యాయాల నుంచి పార్టీ నాయకులు డాక్టర్ ఉమ, బబ్బూరి, అడ్డూరిలు ఏ విధమైన పదవులు ఇవ్వలేదని, భవిష్యత్‌లో కూడా ఎటువంటి పదవులు ఇవ్వరని అర్థమైందని తన రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌కు పంపినట్లు తెలిపారు.

## చెరువు సెంటర్‌లో అన్న క్యాంటీన్

**భవానీపురం, మార్చి 25 :** కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొబైల్ అన్న క్యాంటీన్ ద్వారా 44వ డివిజన్ చెరువు సెంటర్‌లో పేదలు, కార్మికులకు సోమవారం అన్నదానం చేశారు. పశ్చిమ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్. మాధవ, డివిజన్ టీడీపీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాసరావులు పేదలకు అన్నం వడ్డించారు. పోలవిన్ను మురళీకృష్ణ, హెచ్. శ్రీనివాస్‌రావు, మణికంఠ సాయి,దినేష్‌లు పాల్గొన్నారు.

## భవానీపురంలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

**విద్యాధరపురం, మార్చి 25:** పశ్చిమ డివిజన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డీసీపీలు అదిరాజ్ సింగ్ రాణా, టి.హరికృష్ణ పర్యవేక్షణలో సోమవారం సాయంత్రం భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ జరిగింది. ఈ జోజినగర్, ఊర్మిళానగర్ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. భవానీపురం సీఐ కృష్ణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం

**వన్‌టౌన్, మార్చి 25:** కళాశాల పూర్వ విద్యార్థులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కాకరపర్తి భావనారాయణ (కేబీఎన్) కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.శేషయ్య, టి.శ్రీనివాస్ అన్నారు. కళాశాల పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో సోమవారం విప్రిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులకు ఉపకార వేతనాలను కమిటీ ప్రముఖులు, హిందూ హైస్కూల్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబు విజయకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శేషయ్య, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు విప్రిన్ ఫౌండేషన్ పేరుతో సంస్థను ఏర్పాటు చేసి గత ఎనిమిదేళ్లుగా సమాజానికి సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాళ్లు పీఎల్ రమేష్, ఎం.వెంకటేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు పృధ్వీ పాల్గొన్నారు.



విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న కేబీఎన్ కళాశాల కమిటీ ప్రతినిధులు

## లబ్బీపేటకు ఉపఖాజీల నియామకం

**లబ్బీపేట, మార్చి 25:** లబ్బీపేట ప్రాంతానికి ప్రభుత్వ ఉపఖాజీలుగా మహమ్మద్ అబ్దుల్ రషీద్, షేక్ ముజామ్మిల్ షరీఫ్‌లను నియమిస్తున్నట్లు విజయవాడ సిటీ ఖాజీ అబ్దుల్ ఖాదీర్ చీఫీ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్బీపేట ప్రాంతంలో వివాహం చేయదలుచుకునే వారు అబ్దుల్ రషీద్ 8886998985, ముజామ్మిల్ షరీఫ్ 8688585505 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

## పాత శివాలయంలో ప్రత్యేక హోమాలు



**వన్‌టౌన్, మార్చి 25:** అయ్యప్పస్వామి జన్మనక్షత్రం సందర్భంగా పాత శివాలయం ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి విగ్రహానికి ప్రత్యేక అర్చనలు చేశారు. తొలుత గణపతి హోమం నిర్వహించారు. అనంతరం అష్టాభిషేకం, నవరసాభిషేకం. 108 మంది దంపతులతో లక్ష్మీహోమం, గణపతి హోమం, సుదర్శన హోమం, రుద్ర హోమం, మృత్యుంజయ హోమం, నవగ్రహ హోమం తదితరాలను నిర్వహింపచేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కేరళ అర్చకుడు మురళీధరన్ నంబూద్రి ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. దుర్గ శివ సాయి సేవ సంఘం, భ్రమరాంబిక సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు. ఈవో కే.సురేష్ బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## వ్యవస్థలను భ్రష్టు పట్టించిన జగన్

### రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఎంపీ అభ్యర్థి పేరం శివనాగేశ్వరరావు

**లబ్బీపేట, మార్చి 25:** సీఎం జగన్‌మోహనరెడ్డి రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని, వైసీపీ ఓటమే లక్ష్యంగా తమ పార్టీ ఈ ఎన్నికల్లో పోటీ చేస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి పేరం శివనాగేశ్వరరావు విమర్శించారు. లబ్బీపేటలోని ఒక హోటల్ సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధినేత కేంద్ర మంత్రి రాందాస్ అదవాలే పోటీ చేసేందుకు తనకు బీఫారం ఇచ్చారని, తమ పార్టీ కేంద్రంలోని ఎన్డీఏలో భాగస్వామిగా ఉందని తెలిపారు. బడుగు బలహీన వర్గాలందరూ తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరసా రాంగనాథ్, పార్టీ రాష్ట్ర కాపు వెల్ఫేర్ అధ్యక్షుడు తోటా పని కుమార్, రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్ వలీ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 26 మార్చి 2024
cinema@andhrajyothy.com

## ఇండియన్ 3 కూడా ఉంటుంది



భారతీయ సినీ రంగంలో విశిష్ట నటుల్లో కమల్ హాసన్ ఒకరు. లోకనాయకుడిగా, వెర్సటైల్ జీనియస్‌గా అభిమానుల నుంచి కితాబులందుకునే కమల్, తన మల్టీ టాలెంట్‌తో సినీ ప్రియుల్ని ఎప్పటికప్పుడు అలరిస్తుంటారు. తాజాగా శ్రుతీహాసన్, డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ నటించిన 'ఇనిమెల్' సాంగ్‌కు లిరిక్స్ అందించారు. ఇటీవలే, ఓ మీడియా ఇంటర్వ్యూలో తను నటిస్తున్న సినిమాల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేను ఎన్ని పనులు చేసినా నా ఫస్ట్ లవ్ సినిమానే. 'విక్రమ్' రిలీజ్ అయ్యి రెండేళ్లు దాటినా, ఇంతవరకూ నా నుంచి మరో సినిమా రాలేదని అభిమానులు ఆశతో ఎదురుచూస్తున్నారు. కొంచెం ఆలస్యమైనా, నా ప్రాజెక్టులు ఒక్కొక్కటి థియేటర్లలో పలకరించడానికి సిద్ధమవుతున్నాయి. నేను టైటిల్ రోల్‌లో నటిస్తున్న ఇండియన్-2 (భారతీయుడు-2) షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఆ తర్వాత వెంటనే ఇండియన్-3 పనులు మొదలవుతాయి. ఈ చిత్రంలో నేను పోషించే సేనాపతి (సినిమాలో కమల్ పాత్ర)లుక్‌కు మేకప్ వేయడానికి నాలుగ్గంటలు, తీయడానికి మరో రెండుగంటలు పట్టేది. పార్ట్-2లో మొదటి భాగంలోలాగే రెండు పాత్రల్లో కనిపిస్తాను. మే 9న రిలీజ్ అయ్యే 'కల్కి 2898 ఏ.డీ'లో ఓ అతిథి పాత్రలో నటించాను. అత్యాధునిక సాంకేతికతతో తెరకెక్కుతున్న ఈ చిత్రం భారతీయులు గర్వించే విధంగా ఉంటుంది. ఎలక్షన్లు ముగిశాక మణిరత్నం దర్శకత్వంలో నటిస్తున్న 'థగ్ లైఫ్' షూటింగ్‌లో పాల్గొంటాను. అలాగే ధనుశ్ నటిస్తున్న ఇళయరాజా బయోపిక్‌కు స్క్రీన్‌ప్లే అందిస్తున్నాను. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించే ఈ సినిమాలో నేను నా నిజ జీవిత పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పారు.

## ముచ్చటగా మూడోసారి!



నాని హీరోగా 'జెంటిల్ మన్', సుధీర్‌బాబుతో 'సమ్మోహనం' చిత్రాలను ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో నిర్మించిన శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ ముచ్చటగా మూడోసారి నిర్మించే చిత్రానికి సోమవారం శ్రీకారం చుట్టారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ ఇందులో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. దేవుని ఫొటోలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు దర్శకుడు మోహనకృష్ణ సతీమణి ఉమా మహేశ్వరి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నిర్మాత సతీమణి అనిత తొలి క్లాప్ ఇచ్చారు. అనంతరం నిర్మాత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 'మా సంస్థకి ఆత్మీయుడు, నాకు అత్యంత సన్నిహితుడు, ప్రతిభాశాలి మోహన్‌కృష్ణతో మూడో సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బలగం'తో హీరోగా పేరు తెచ్చుకున్న ప్రియదర్శికి ఇది యాప్ట్ సబ్జెక్ట్. తెలుగమ్మాయి రూప హీరోయిన్‌గా నటిస్తోంది. ఇదో క్యూట్ ఫిల్మ్. స్వీట్ ఎంటర్‌టైన్. చక్కటి వినోదంతో పాటు మంచి భావోద్వేగాలు ఉంటాయి. ఈ రోజు నుంచి హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభించాం' అన్నారు. నరేశ్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, ఫొటోగ్రఫీ: పి.జి. విందా, సంగీతం: వివేక్ సాగర్, లైన్ ప్రొడ్యూసర్: విద్య శివలెంక, లిపిక ఆళ్ల, రచన, దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

## హోలీ అంటే భయపడేవాణ్ణి



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం నుంచి థర్డ్ సింగిల్ 'మధురం కదా' విడుదలైంది. సోమవారం హోలీ వేడుకల్లో గ్రాండ్‌గా జరిగిన కార్యక్రమంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, నిర్మాత దిల్‌రాజు పాల్గొన్నారు. మూవీ టీమ్‌తో హోలీ ఆడుతూ కలసి డాన్సులు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ 'తన కుటుంబాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే. ఈ కథ మొదట విజయ్ విన్నాడు. నాకు ఫోన్ చేసి పరశురామ్ మంచి కథ చెప్పాడు. మీరు వింటారా? అని అడిగారు. నేను ఆ కథ విని 15 నిముషాల్లో ఓకే చెప్పేశాను. ఎందుకంటే ఇది మిడిల్ క్లాస్ కథ. మిమ్మల్ని మీరు చూసుకుంటున్నట్లుగా సినిమా ఉంటుంది. ఏప్రిల్ 5న ఫ్యామిలీస్ సినిమా చూడడానికి రండి' అన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'చదువుకొనే రోజుల్లో హోలీ అంటే రంగులు పూస్తారని, అవి అలాగే ఉంటాయనీ భయపడేవాణ్ణి. అదే టైమ్‌లో ఎగ్జామ్స్ జరుగుతుంటే చాలా మంది ముఖాల నిండా రంగులతో వచ్చే వారు. కానీ ఇప్పుడు ఇక్కడ మీ అందరితో కలసి హోలి సెలబ్రేట్ చేసుకుంటుంటే పండగంటే ఇలాగే ఉండాలనిపిస్తోంది. మనలాంటి ఫ్యామిలీస్ నుంచి వచ్చిన ఒక వ్యక్తి కథ మా సినిమా. మీరు బాగా ఎంజాయ్ చేస్తారు' అన్నారు. 'ఎప్పుడూ హోలీ పండుగను ముంబైలో చేసుకుంటూ ఉంటాను. ఈసారి మీ మధ్య 'ఫ్యామిలీ స్టార్' టీమ్‌తో కలసి సెలబ్రేట్ చేసుకోవడం ఆనందంగా ఉంది' అని మృణాల్ ఠాకూర్ అన్నారు.

## అద్భుత కలయిక... ఇంకోసారి!



రామ్‌చరణ్ కెరీర్‌లో కలకాలం గుర్తుండిపోయే చిత్రం 'రంగస్థలం'. అంతవరకూ కమర్షియల్ క్యారెక్టర్స్ చేస్తూ అల్ట్రామోడరన్ హీరోగా గుర్తింపు పొందిన రామ్‌చరణ్‌తో పక్కా పల్లెటూరి యువకుడు చిట్టిబాబు పాత్ర చేయించి, సాహసం చేశారు దర్శకుడు సుకుమార్. అభిమానులు ఉప్పొంగే విదంగా, ప్రేక్షకులు మెచ్చుకొనే రీతిలో ఆ చిత్రంలో నటించి 'రంగస్థలం' అద్భుత విజయానికి కారణమయ్యారు రామ్‌చరణ్. ఇక అప్పటినుంచి వీరిద్దరి కాంబినేషన్‌లో మరో చిత్రం ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురు చూస్తున్న ప్రేక్షక అభిమానులకు సోమవారం ఓ గుడ్ న్యూస్ చెప్పారు మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్. సుకుమార్ రైటింగ్స్ సంస్థతో కలసి రామ్‌చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం తీయనున్నట్లు ప్రకటించారు. ఈ ఏడాదిలోనే షూటింగ్ ప్రారంభించి, 2025 చివరిలో విడుదల చేస్తామని వెల్లడించారు. ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తారని తెలిపారు. ఈసారి కూడా రామ్‌చరణ్ కోసం అత్యద్భుతమైన స్క్రిప్ట్‌ను సుకుమార్ తయారు చేశారని నిర్మాతలు చెప్పారు.

## సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్న తాప్సీ





సొట్టబుగ్గల సుందరి తాప్సీ పెళ్లి పీటలెక్కుతోందంటూ కొంత కాలంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వాటిని నిజం చేస్తూ తాప్సీ తన ప్రియుడు మథియాస్ బో ను రెండు రోజుల క్రితం పెళ్లాడారు. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో పదేళ్లుగా డేటింగ్‌లో ఉన్నారు తాప్సీ. పెద్దలను ఒప్పించి సిక్కు, క్రిష్టియన్ సంప్రదాయాల ప్రకారం వీరిద్దరూ ఉదయ్‌పూర్‌లో పెళ్లి చేసుకున్నారు. గుట్టు చప్పుడు కాకుండా జరిగిన ఈ వివాహానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులే హాజరయ్యారు. అయితే తన పెళ్లి విషయాన్ని తాప్సీ ఇంతవరకు వెల్లడి చేయలేదు, ఫొటోలు కూడా రిలీజ్ చేయలేదు. కాగా, 2013లో జరిగిన ఇండియన్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభ కార్యక్రమంలో మొదటిసారి వీళ్లిద్దరూ కలుసుకున్నారు. అక్కడి నుంచే వారిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. నటి తాప్సీ ఎప్పటికప్పుడు వారి ప్రేమాయణంపై మీడియా అడిగిన ప్రశ్నలను దాటేసేవారు. తమ ప్రేమ బంధాన్ని ఎంతో గోప్యంగా ఉంచిన తాప్సీ ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో మథియాస్‌తో తన పరిచయం గురించి తొలిసారిగా వెల్లడించారు.

## మోత... మోత



విభిన్న పాత్రలతో ప్రేక్షకుల్ని ఆకట్టుకొంటున్న విశ్వక్ సేన్ నటిస్తున్న తాజా చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఇందులో విశ్వక్ సేన్ మాస్‌ని మెప్పించే గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. హోలీ సందర్భంగా 'మోత' పాటను విడుదల చేసి, పండగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది చిత్ర బృందం. అందాల తార ఆయేషా ఖాన్ ఈ ప్రత్యేక పాట కోసం విశ్వక్ సేన్‌తో కలసి చిందులు వేయడం అదనపు ఆకర్షణ. చంద్రబోస్ రాసిన ఈ మాస్ సాంగ్‌ను ఎం.ఎం. మానసి అభిమానుల్లో ఉత్సాహం నింపేలా పాడారు. థియేటర్లలో ఈ పాట మోత మోగించడం ఖాయం అంటున్నారు. నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి కీలక పాత్ర పోషిస్తున్నారు. మే 17న విడుదలయ్యే ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి , నిర్మాతలు: సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య, రచన, దర్శకత్వం: కృష్ణ చైతన్య

## ఆనందంగా ఉంది

**తెలుగువారి ఆత్మీయ నటుడు, దివంగత గుమ్మడి వెంకటేశ్వర రావుకు బంధువుగా ఎన్నో అంచనాలతో సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టారు నటుడు నరేన్ రామ. తెలుగువారైనా, తమిళంలో సినీ కెరీర్‌ను ఆరంభించి పలు యాడ్స్‌లో, నాలుగు సినిమాల్లో నటించారు. ఈ నెల 29న విడుదలవుతున్న 'కలియుగం పట్టణంలో' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా నరేన్ రామ మీడియాతో ముచ్చటించారు.**



"తెలుగులో నా సినీ ప్రయాణాన్ని 'కలియుగం పట్టణంలో' సినిమాతో ప్రారంభించడం ఆనందంగా ఉంది. ఇందులో నేను ఓ కీలక పాత్రలో నటించాను. ఇది మంచి సస్పెన్స్ థ్రిల్లర్. దర్శకుడు రమాకాంత్ రెడ్డి ఈ సినిమాను ఎంతో చక్కగా తీర్చిదిద్దారు. హీరోహీరోయిన్లు విశ్వ కార్తికేయ, ఆయూషీ పటేల్ వారి నటనతో ఈ చిత్రానికి ప్రాణం పోశారు. ఈ సినిమాలోని టైటిల్ సాంగ్, అమ్మ సాంగ్ చాలా బాగా నచ్చాయి. అజయ్ అరసాద మంచి మ్యూజిక్ అందించారు. ఈ చిత్రాన్ని థియేటర్స్‌లో చూసిన వారందరూ తప్పక ఎంజాయ్ చేస్తారు. టీజర్, ట్రైలర్స్‌తో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం నేను తెలుగులో డబ్లుహెచ్‌ఓ(హూ) అనే చిత్రంలో, తమిళంలో మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నాను" అని చెప్పారు.

## సంబరాల హోలీ









వయసుని మరిచిపోయి చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆనందంగా చేసుకునే వేడుక హోలీ. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా టాలీవుడ్ తారలు రంగులు జల్లుకుంటూ ఈ పండుగను గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా దిగిన ఫొటోలను రష్మిక, పాయల్ రాజ్‌పుత్, కాజల్ అగర్వాల్, రుక్సార్ ధిల్లాన్ సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకున్నారు.

# నవ్య డాక్టర్

## మీకు తెలుసా?

### చద్ది రొట్టె తింటే...

పొద్దున్నే చద్దన్నం తినడం మన పూర్వీకుల అలవాటు. వాళ్ల ఆరోగ్య రహస్యాల్లో అదొకటి. కానీ ఇప్పుడు చద్దన్నం తినే వాళ్లను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. పేగుల్లో ఉండే గుడ్ బ్యాక్టీరియాను పెంచే మహత్తర శక్తి చద్ది పదార్థాల్లో ఉంటుంది. కాబట్టి చద్దన్నం ఇష్టపడని వాళ్లు చద్ది రొట్టెలు తినొచ్చు.

- తాజా రోటీలు, చపాతీల కంటే చద్ది రోటీలు, చపాతీలు రెట్టింపు తేలికగా జీర్ణమవుతాయి. ఏజింగ్ ప్రాసెస్ వల్ల వాటిలోని తేమ తగ్గి, తేలికగా జీర్ణమవుతాయి. అజీర్తితో బాధపడేవారికి చద్ది రొట్టె అద్భుతమైన అల్పాహారం.
- పొడిగా, తేలికగా ఉండే చద్ది చపాతీ, రోటీతో శరీరంలోని దోషాలు కూడా సమం అవుతాయని ఆయుర్వేదం చెప్తోంది. కఫ దోషాన్ని తగ్గించి, వాత దోషాన్ని సంతులనం చేసే చద్ది రొట్టె అన్ని రకాల శరీర తత్వాలకూ సరిపోతుంది.



- చద్ది రోటీల్లో ఉండే పీచు ఆకలిని అద్భుతంగా తీరుస్తుంది. ఎక్కువ సమయం పాటు పొట్టను నిండుగా ఉంచి ఆకలిని నియంత్రిస్తుంది. కాబట్టి ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో చద్ది రొట్టెను తినడం అలవాటు చేసుకోవాలి.
- చద్ది రోటీని పాలతో కలిపి తినడం ఆరోగ్యకరం. రాత్రి పూట తయారుచేసిన రోటీ చద్దిగా మారడానికి 12 నుంచి 15 గంటల సమయం పడుతుంది. ఆ లోపు తినడం ఆరోగ్యకరం. మధుమేహులకు కూడా చద్ది రోటీ ప్రయోజనకరంగా ఉంటుంది.

## గుడ్ డైట్

### ఆహారంలో ఆరోగ్యం!

భారతీయ ఆహారం భిన్నమైనది, విలక్షణమైనది. భౌగోళిక పరిస్థితులు, జీవనశైలులకు తగిన పోషక అవసరాలు తీర్చగల ఆహారంగా పేరు పొందింది. అయితే ఆ ఆహారాన్ని వండే పద్ధతి, తినే శైలలు మీదే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది.

- **విభిన్న ఆహారం:** శరీరంలోని కోట్లకొద్దీ కణాలకు పోషకాలు అవసరం. భారతీయ భోజనంలోని రుచులు ఈ పోషకాలన్నిటినీ కలిగి ఉంటాయి. ఆయా రుతువుల్లో కాచే కాయలు, పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పోషకాలన్నీ సమంగా అందేలా చూసుకోవచ్చు. రాగులు, సజ్జలు, జొన్నలు, అరికలు... మొదలైన ధాన్యాలు ఆరోగ్యకరం. బియ్యం శరీర బరువు పెంచుతుందని భయపడేవాళ్లు దంపుడు బియ్యం తినవచ్చు. మినుములు, పెసలు, కందులు మొదలైన పప్పుదినుసులు అవసరమైన మాంసకృత్తులను అందిస్తాయి. కాబట్టి కూరగాయలతో కలిపి తింటే శక్తి సమకూరుతుంది.
- **భారతీయ థాలీ:** దీన్లో రెండు మూడు రకాల పప్పులు, అన్నం, రెండు లేదా మూడు కూరలు, ఒక రోటీ పచ్చడి, ఊరగాయ, పెరుగు, కొద్దిగా తీపి కూడా ఉంటుంది. వీటన్నిటి మేళవింపుతో రోజుకు సరిపడా పోషకాలు శరీరానికి అందుతాయి.



- **వంటనూనెలు:** ఆవనూనె, వేరుసెనగ నూనె, నువ్వుల నూనె, పొద్దుతిరుగుడు నూనె... ఇలా ఎన్నో రకాల వంటనూనెలు మార్కెట్లో ఉన్నాయి. అయితే వాటి తయారీలో తేడాల వల్ల పోషకాల నష్టం జరుగుతోంది. పూర్వం గానుగ పట్టించి స్వచ్ఛమైన నూనెను తీసేవారు. ఇలాంటి పద్ధతి వల్ల తాజా నూనె పొందేవాళ్లు. మిషన్ల ద్వారా నూనెను తీసి, వాటికి నిల్వ పదార్థాలు కలిపి, ప్లాస్టిక్ డబ్బాలు, కవర్లలో ప్యాక్ చేసే పద్ధతుల వల్ల ఆ నూనెల్లోని పోషకాలు నష్టపోతున్నాం. కాబట్టి గానుగ పట్టించి తీసిన నూనెను వంటలో వాడే ప్రయత్నం చేయాలి.
- **కూరలు:** సమమైన రుచులు, దినుసులు, నూనెలు వాడి తయారుచేసిన భారతీయ వంటకాలు, కూరలు ఆరోగ్యకరమైనవి. మధుమేహం, అధిక రక్తపోటు లాంటి ఇన్‌ఫ్లమేషన్ సంబంధిత రుగ్మతలకు అడ్డుకట్ట వేయాలంటే ఇలాంటి కూరలే తినాలి. కరివేపాకు, టమాటాలు, నల్లమిరియాలు, పసుపు, ఇతర సుగంధ ద్రవ్యాలతో వండిన కూరల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి.
- **గోధుమలు:** గోధుమల్లో అలర్జీ కారకాలు ఉంటాయని నమ్ముతున్న కాలంలో ఉన్నాం. అయితే అలర్జీ కారకాలు గోధుమల్లో కాదు, ఆ గోధుమలను పాలిష్ చేయడానికి అనుసరించే పద్ధతుల్లో ఉంటాయి. పాలిష్ పట్టని, దంపుడు గోధుమలు కడుపుబ్బరం, అజీర్తి లాంటి ఇబ్బందులను కలిగించవు. హానికారక రసాయనాలు ఉపయోగించి తయారుచేసే బ్రెడ్‌కు దూరంగా ఉంటూ, దంపుడు గోధుమలను ఆహారంలో చేర్చుకోవచ్చు.
- **నిల్వ పచ్చళ్లు:** సరిపడా రాతి ఉప్పు, నూనె వేసి తయారుచేసిన నిల్వ పచ్చళ్లు చక్కని ప్రొబయాటిక్స్

తలలో రక్తం గడ్డకట్టడంతో సద్గురు జగ్గీ వాసుదేవ్, ఆస్పత్రి పాలైన సంగతి అందరికీ తెలిసిందే! ఈ సమస్య ఎవరికి, ఎందుకొస్తుందో, ఆలస్యం చేయడం ఎంత ప్రమాదకరమో వైద్యులు వివరిస్తున్నారు.

# మెదడులో రక్తస్రావం... ప్రమాదం



మధుమేహం, రక్తపోటు అదుపు తప్పితే బ్రెయిన్ స్ట్రోక్ రావచ్చు. ఈ సమస్యకు కూడా రక్తస్రావమే కారణమైనా, ఈ రక్తస్రావం మెదడు లోపల జరుగుతుంది.

**బ్రెయిన్ హెమరేజ్**

బ్రెయిన్ స్ట్రోక్ వేరు, బ్రెయిన్ హెమరేజ్ వేరు. రక్తనాళాలు చిట్లి మెదడు లోపల రక్తస్రావం జరగడం బ్రెయిన్ స్ట్రోక్. మెదడులోని రక్తనాళాలు చిట్లి క్రమక్రమంగా రక్తాన్ని స్రవిస్తూ ఉండడం మూలంగా రక్తం గడ్డలు ఏర్పడే సమస్య బ్రెయిన్ హెమరేజ్. కొందర్లో అకస్మాత్తుగా రక్తస్రావం జరిగి అక్యూట్ బ్రెయిన్ హెమరేజ్ జరగవచ్చు. ఇంకొందర్లో క్రమేపీ రక్తస్రావం పెరిగి, క్రానిక్ బ్రెయిన్ హెమటోమా పరిస్థితి ఉండవచ్చు. సద్గురుకు జరిగింది ఇదే! అయితే రెండు రకాల హెమరేజ్‌ల్లో మెదడుకూ, పుర్రెకూ మధ్య ఉండే ఖాళీ జాగాలో రక్తం పేరుకుంటూ ఉంటుంది. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు పైబడిన పెద్దల్లో మెదడు పరిమాణం తగ్గడం వల్ల ఈ జాగాలో రక్తం గడ్డకట్టే అవకాశాలు పెరుగుతాయి. చర్మానికి చిన్న చిన్న దెబ్బలు తగిలినప్పుడు, ఆ ప్రదేశాన్ని వేళ్లతో కొద్దిసేపు నొక్కి ఉంచితే రక్తస్రావం ఆగిపోతుంది. మెదడులో కూడా ఇదే పరిస్థితి ఉంటుంది. ఏదైనా దెబ్బ తగిలి రక్తస్రావం మొదలైతే, మెదడు వ్యాకోచించి, ఆ ప్రదేశంలో ఒత్తిడిని పెంచడం ద్వారా రక్తస్రావాన్ని ఆపే ప్రయత్నం చేస్తుంది. దాంతో బ్లీడింగ్ ఆగిపోయి, సమస్య సర్దుకుంటుంది. కానీ కొందర్లో ఇలా జరగదు.

### తలకు దెబ్బలు తగలకుండా...

విపరీతంగా మద్యపానం చేసేవారిలో, పెద్దల్లో మెదడు పరిమాణం తగ్గుతుంది. కాబట్టి మెదడు వ్యాకోచించి, రక్తస్రావాన్ని ఆపే పరిస్థితి ఉండదు. కాబట్టి వీళ్లలో బ్రెయిన్ హెమరేజ్ తలెత్తే ముప్పు ఎక్కువ. మూత్రపిండాల వ్యాధులు, లివర్ ఫెయిల్యూర్, ఎముక మజ్జ సమస్య, రక్త కేన్సర్ ఉన్నవాళ్లలో కూడా రక్తస్రావ సమస్యలు ఎక్కువ. గుండె జబ్బులు, గుండె కవాట మార్పిడి చేయించుకున్న వాళ్లు రక్తం పలుచనయ్యే మందులతో పాటు రక్తం గడ్డకట్టకుండా నియంత్రించే యాంటీ కాగ్యులెంట్స్ కూడా వాడుతూ ఉంటారు. ఈ కోవలకు చెందిన వాళ్లకు కూడా ముప్పు ఎక్కువే! తల గోడకు కొట్టుకోవడం లేదా కింద పడిపోయి తలకు చిన్నపాటి దెబ్బలు తగలడం జరిగినప్పుడు సాధారణంగా వాటిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. కానీ ఆ దెబ్బ తగిలిన సమయంలో మెదడులోని రక్తనాళం చిట్లి కొద్దికొద్దిగా రక్తం స్రవిస్తూ, గడ్డకట్టడం మొదలుపెడుతుంది. అలా కొంత కాలానికి మెదడుకూ, పుర్రెకూ మధ్య ఉండే జాగాలో రక్తం గడ్డ నిర్దిష్ట పరిమాణానికి పెరిగిపోయినప్పుడు లక్షణాలు మొదలవుతాయి. కాబట్టి ఈ కోవలకు చెందిన వాళ్లు తలకు దెబ్బలు తగలకుండా చూసుకోవాలి.

### హెచ్చరించే లక్షణాలు ఇవే!

- **తల నొప్పి:** తలనొప్పికి ఎన్నో కారణాలుంటాయి. కాబట్టి సాధారణ తలనొప్పికీ, బ్రెయిన్ హెమరేజ్ తలనొప్పికీ వ్యత్యాసాన్ని తెలుసుకోవాలి. హెమరేజ్ వల్ల తెల్లవారుఝామున విపరీతమైన తలనొప్పి మొదలవుతుంది. తలనొప్పితో నిద్ర మెలకువ అయిపోతూ ఉంటుంది.
- **వాంతులు:** వాంతి అయిపోవడం లేదా అలా అనిపించడం
- **కళ్లు:** కళ్ల ముందు చీకటి ఆవరించడం
- **కాళ్లు:** నడుస్తున్నప్పుడు కాళ్లు ఈడ్చవలసి రావడం అనిపించడం, నడవడంలో ఇబ్బంది
- **ఫిట్స్:** మూర్ఛలు మొదలు కావచ్చు
- **అయోమయం:** అయోమయానికి గురవుతూ, పరాకుగా మాట్లాడడం. పెద్దల్లో ఈ లక్షణాన్ని గమనించాలి.
- **మాటలు:** ముద్దగా మాట్లాడడం, మాటలు తడబడడం



### ప్రమాదకరమే!

మెదడులో ఏ సమస్య తలెత్తినా ప్రమాదకరంగానే భావించాలి. తల నిర్దిష్ట పరిమాణానికి పరిమితమై ఉంటుంది కాబట్టి గడ్డ, రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్... ఇలా పుర్రె లోపల అదనంగా ఏ చిన్న సమస్య తలెత్తినా మెదడు మీద ఒత్తిడి పెరిగి, పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంది. ఆలస్యం చేస్తే, రోగి మత్తులోకి జారుకుని, కోమాలోకి వెళ్లిపోవచ్చు. ఒక వైపు శరీరం పక్షవాతానికి గురి కావచ్చు. కాబట్టి లక్షణాలను గుర్తించిన వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

### సత్వర చికిత్స కీలకం

మెదడులో ఎటు వైపు రక్తస్రావం జరిగినా, కుడి, లేదా ఎడమ సగభాగం మెదడు పైన రక్తం గడ్డ కట్టుకుంటుంది. దీన్ని వీలైంత త్వరగా సర్జరీతో తొలగించి, మెదడు మీద ఒత్తిడిని తగ్గించాలి. ఆలస్యం జరిగేకొద్దీ మెదడుకు శాశ్వత నష్టం జరిగిపోతూ ఉంటుంది. రక్తపు గడ్డల వల్ల మెదడుకు రక్తస్రావం లోపించి, మెదడు కణాలకు ఆక్సిజన్ అందక కణ నష్టం జరుగుతుంది. అలాంటప్పుడు పక్షవాతం శాశ్వతంగా ఉండిపోవచ్చు. శాశ్వతంగా మాటలు పడిపోవచ్చు. శరీరంలో బలహీనత శాశ్వతంగా మిగిలిపోవచ్చు. కొన్ని సందర్భాల్లో పరిస్థితి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. కాబట్టి మెదడు కణాలు చనిపోయేలోగా వీలైనంత త్వరగా సర్జరీ చేసి రక్తపు గడ్డలను తొలగించాలి. ఇలా సత్వరంగా స్పందించగలిగితే ఫలితాలు కూడా మెరుగ్గా ఉంటాయి.

**నియంత్రణ మార్గాలు**

- దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు క్రమం తప్పకుండా మందులు వాడుకుంటూ ఉండాలి.
- తీవ్ర మద్యపానం మానేయాలి.
- తలకు దెబ్బలు తగలకుండా చూసుకోవాలి
- పార్కిన్‌సన్ ఉన్న పెద్దలు కింద పడిపోయే అవకాశాలు ఎక్కువ. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

### సర్జరీ ఇలా...

సిటి స్కాన్‌తో మెదడులోని రక్తపు గడ్డను, దాని వయసును తేలికగా, త్వరగా కనిపెట్టవచ్చు. రక్తపు గడ్డ వయసు మూడు వారాలుంటే, ఆ రక్తం ద్రవరూపంలో ఉంటుంది. ఇలాంటప్పుడు పుర్రెకు రంధ్రం చేసి, రక్తాన్ని తలగించవచ్చు. కొందర్లో రక్తం ద్రవ, ఘన రూపాల్లో ఉంటుంది. ఇలాంటప్పుడు తలను తెరిచి రక్తాన్ని డ్రెయిన్ చేయవలసి ఉంటుంది. కొందరో ఘనరూప రక్తం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటప్పుడు కూడా పుర్రెను తెరిచి, రక్తపు గడ్డను తొలగించవలసి ఉంటుంది.

అయితే అన్నిటికంటే ముందు, రక్తపు గడ్డ ఏర్పడడానికి కారణాలను కూడా తెలుసుకోవాలి. బ్లడ్ థిన్నర్లు, యాంటీ కాగ్యులెంట్లు వాడుకుంటున్న వాళ్లు, కిడ్నీ, లివర్ పనితీరు క్రమం తప్పిన వాళ్లు, మద్యపానం చేసేవాళ్లు, రక్తస్రావ సమస్యలున్నవాళ్లలో సమస్య తిరగబెట్టే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తూ వారి పర్యవేక్షణలో ఉండాలి. సర్జరీ తర్వాత మూర్ఛలు వచ్చే అవకాశాలు ఎక్కువ. వాటికి అవసరమైన మందులు కూడా వాడుకోవాలి. కొందరికి రెండు నుంచి మూడు వారాల పాటు రీహ్యాబిలిటేషన్ అవసరం అవుతుంది.

డాక్టర్ కౌశల్ ఇప్పిలి
న్యూరో సర్జన్,
అపోలో హాస్పిటల్స్,
హైదరాబాద్.



# మలి వయసులో గర్భం

దివంగత పంజాబీ గాయకుడు సిద్ధు మూసేవాలా తల్లితండ్రులు, లేటు వయసులో బిడ్డను కనడంతో అందరి దృష్టి ఐవిఎఫ్ వైపు మళ్లింది. అయితే ఈ దంపతుల్లాగే పెద్ద వయసులో తల్లితండ్రులయ్యే ప్రయత్నం చేసే పెద్దలు కొన్ని అంశాలను దృష్టిలో పెట్టుకోవాలి.

2021 కృత్రిమ పునరుత్పత్తి ప్రక్రియ నియంత్రణ చట్టం (ఆర్టిఫిషియల్ రిప్రొడక్టివ్ టెక్నిక్ రెగ్యులేషన్ యాక్ట్) ఈ చికిత్సను ఆశ్రయించే దంపతుల్లో మహిళల వయో పరిమితిని 50 ఏళ్లకూ, పురుషుల వయో పరిమితిని 55 ఏళ్లకూ పరిమితం చేసింది. తల్లీబిడ్డల ఆరోగ్యభద్రత కోసం, బిడ్డ భవిష్యత్తు కోసం ప్రభుత్వం సూచించిన నియమాలను లెక్క చేయకుండా, మలి వయసులో ఐవిఎఫ్ ద్వారా బిడ్డలను కనే వాళ్లున్నారు. కెరీర్ పరంగా ఒంటరిగా మిగిలిపోయిన మహిళలు, అదే పనిగా పెళ్లి వాయిదా వేస్తూ వయసు మీరిపోయిన మహిళలు, సంతాన నిర్ణయాన్ని వాయిదా వేస్తూ, సహజసిద్ధంగా గర్భం దాల్చలేని లేటు వయసు మహిళలు పెద్ద వయసులో గర్భం దాల్చడంలో ఉండే ఆరోగ్యపరమైన ఇబ్బందులు, తల్లీబిడ్డలకు పొంచి ఉండే సవాళ్ల గురించి తెలుసుకోవడం అవసరం.

### దుష్ప్రభావాలు లేకపోలేదు

ఐవిఎఫ్‌కు నిర్దిష్ట వయో పరిమితి లేకపోయినప్పటికీ, 40 ఏళ్లు దాటిని మహిళల్లో అండాల నాణ్యత, మోతాదులు తగ్గిపోతాయి. అలాగే ఐవిఎఫ్ విజయమయ్యే అవకాశాలు కూడా పెరిగే వయసుతో పాటు తగ్గిపోతూ ఉంటాయి. మన దేశంలో మహిళలు మెనోపాజ్‌కు చేరుకునే సగటు వయసు 46 ఏళ్లు. ఈ దశకు 13 ఏళ్ల ముందు నుంచే అండాల నాణ్యత దిగజారడం మొదలవుతుంది. అలాగే పెద్ద వయసు మహిళల్లోని అండాల్లో క్రోమోజోమ్‌ల లోపాలు, జన్యుపరమైన లోపాలు తలెత్తుతాయి. గర్భస్రావాలు కూడా ఎక్కువే! కాబట్టి పిల్లలు డౌన్స్ సిండ్రోమ్‌తో పుట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి లేటు వయసులో ఐవిఎఫ్‌ను ఆశ్రయించేవాళ్లు దానంగా పొందిన అండాలతో గర్భం దాల్చడం ఉత్తమం.

### బిడ్డను పెంచే శక్తి ఉంటుందా?

దానంగా పొందిన అండాలతో గర్భం దాల్చినప్పటికీ, పెద్ద వయసు మహిళల్లో అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలుంటాయి. వీటి మూలంగా గర్భం దాల్చిన తర్వాత, జెస్టేషనల్ డయాబెటిస్, హైపర్‌టెన్షన్, నెలలు నిండకుండా పిల్లలు పుట్టడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువ. ఐవిఎఫ్ ద్వారా బిడ్డ పుట్టడంతోనే దంపతుల కథ ముగిసిపోదు. నిజానికి బిడ్డ శ్రేయస్సు కోసం దంపతుల జీవితకాలపు నిబద్ధత బిడ్డ పుట్టుకతోనే మొదలవుతుంది. పిల్లల శ్రేయస్సుకు ఆరోగ్యకరమైన, దీర్ఘాయుష్షు కలిగి ఉన్న తల్లితండ్రులు అవసరం. కాబట్టి పెద్ద వయసులో పిల్లలను కనాలనుకునే దంపతులు బిడ్డను పెంచే ఓపిక, వయసుతో పాటు క్షీణిస్తుందనే విషయాన్ని కూడా గుర్తు పెట్టుకోవాలి.

**ఐవిఎఫ్**



# పోషకాలతో ప్రమాదాలు

**అవగాహన**

కొన్ని రకాల ప్యాకేజ్డ్ ఫుడ్స్, మందుల తయారీల్లో ఉపయోగించే పోషకాలు ఆరోగ్యానికి మేలుకు బదులుగా హానినే ఎక్కువగా తలపెడుతూ ఉంటాయి. ఆశ్చర్యకరమైన ఈ విషయాన్ని లోతుగా పరిశీలిస్తే....

యాంటీ ఏజింగ్ సప్లిమెంట్‌గా, చర్మం, మెదడు ఆరోగ్యాన్ని పెంచే పోషకంగా విటమిన్ బి, నయాసిన్ పేరు పొందింది. బ్రేక్‌ఫాస్ట్ సిరీల్స్, బ్రెడ్, కార్న్‌ఫ్లేక్స్, బేబీ ఫార్ములాల తయారీలో దీన్ని కలుపుతూ ఉంటారు. అయితే నయాసిన్ గుండె జబ్బుల ముప్పును పెంచుతుందని తాజా అధ్యయనాల్లో తేలింది. సప్లిమెంట్లు, కొన్ని మందులు, పదార్థాల తయారీల్లో అదనంగా జోడించే అడిటివ్స్‌లో ఎలాంటి దుష్ప్రభావాలు దాగి ఉంటాయో ఎవరికీ తెలియదు. ఉదాహరణకు చాక్లెట్, ఐస్‌క్రీమ్‌లు ఎక్కువ సమయం పాటు కరిగిపోకుండా ఉండడం కోసం వాటిలో కలిపే, క్యారాజీనన్ అనే అడిటివ్, రక్తంలో చక్కెర మోతాదులను విపరీతంగా పెంచేస్తుంది. సాధారణంగా మనం అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్‌ను జంక్ ఫుడ్‌గా పరిగణిస్తూ ఉంటాం. అయితే ఆరోగ్యానికి తోడ్పడే కొన్ని సప్లిమెంట్లలో కూడా అంతే మోతాదుల్లో అడిటివ్స్, స్టెబిలైజర్లు ఉంటాయి.



పెద్ద మొత్తాల్లో మాత్రలను తయారు చేసే సమయంలో, అవన్నీ ఒకదానికొకటి అంటుకుపోకుండా ఉండడం కోసం, మాత్రాలకు రంగును అద్దడం కోసం పౌడర్లను కలుపుతూ ఉంటారు. అలాగే టెక్చర్ కోసం జెలటిన్లను కూడా జోడిస్తూ ఉంటారు. వీటి వల్ల దీర్ఘ కాలంలో ఛాతీ మంట, తలతిరుగుడు, అలర్జీ రియాక్షన్లు తలెత్తుతాయి.

కొన్ని రకాల సప్లిమెంట్లు, యాంటీబయాటిక్స్ పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను చంపేస్తాయి. దాంతో కడుపు ఉబ్బరం, డయేరియాలు మొదలవుతాయి. క్రాస్కార్‌మెలోజ్ అనే పౌడరు పొట్టలోకి చేరుకున్న తర్వాత స్పాంజిలా ఉబ్బిపోయి, పేగుల్లో అడ్డు పడుతుంది. డైసోడియం ఫాస్ఫేట్, పొట్టలో నొప్పి, కడుపు ఉబ్బరం లాంటి సమస్యలను తెచ్చి పెడుతుంది. గ్లూటెన్ ఫ్రీ బేకింగ్ ఉత్పత్తుల్లో ఉపయోగించే గ్జాంథాన్ గమ్‌తో, నీళ్ల విరోచనాలు అవుతాయి. వంటకాల్లో ఉపయోగించే జెలటిన్‌తో ఛాతీలో మంట, అలర్జిక్ రియాక్షన్లు వేధిస్తాయి. వాడుతున్న మందులతో చర్మ సమస్యలు మొదలైతే, వాటిలో గ్లిసరిల్ డైబిహినేట్, పాలీవినైల్ పైరోలైడోన్, లనోలిన్‌లు ఉన్నాయేమో గమనించుకోవాలి. పొటాషియం సార్బేట్, సోడియం, స్టెరీల్ ఫ్యూమరేట్‌లతో కళ్లు, చర్మం మండుతాయి. మూత్రపిండాలు దెబ్బ తింటాయి. కాబట్టి యాంటీబయాటిక్స్, రక్తాన్ని పలుచన చేసే మందులు వాడుతున్న వాళ్లు, వాటి మీద, సోడియం ప్రభావం ఉంటుందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి.

## ఫుడ్ ఫ్యాక్ట్

### ఎర్ర అరటిలో...

ఎరుపు రంగు అరటిపండులో పోషకాలు ఎక్కువ. శరీర జీవక్రియలకు తోడ్పడే కీలకమైన సూక్ష్మ పోషకాలు, విటమిన్ల కోసం పసుపు అరటి బదులుగా ఎరుపు అరటి ఎంచుకోవాలి.

- **ఇమ్యూనిటీ బూస్టర్:** దీన్లోని మెగ్నీషియం, పొటాషియం అధిక రక్తపోటును నియంత్రించి, రక్తనాళాలకు స్వాంతననిస్తాయి. వీటిలోని విటమిన్ సి ఇమ్యూనిటీని పెంచుతుంది. ఈ విటమిన్‌తో చర్మపు ఆరోగ్యానికి అవసరమైన కొల్లాజన్ కూడా పెరుగుతుంది.
- **కళ్లకు మేలు:** వీటిలోని కెరోటినాయిడ్లు కంటి ఆరోగ్యానికి తోడ్పడతాయి. ల్యూటీన్, బీటా కెరోటీన్ అనే ఈ కెరోటినాయిడ్లు మాక్యులర్ డీజనరేషన్ అనే ఛత్వారాన్ని వాయిదా వేస్తాయి.
- **అధిక బరువు:** ఈ పండ్లలోని అత్యధిక పీచు, కీలకమైన పోషకాలు ఆకలిని నియంత్రించి, అదనపు చిరుతిళ్ల వైపు మనసు మళ్లకుండా చేస్తాయి. ఫలితంగా అధిక బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి.
- **మానసికోల్లాసం:** ఎర్ర అరటిపండ్లలోని విటమిన్ బి6 ట్రిప్టోఫాన్‌ను సెరటోనిన్‌గా మారుస్తుంది. ఈ ఫీల్ గుడ్ హార్మోన్ పెరగడం వల్ల డిప్రెషన్ దూరమై మనసు హుషారుగా మారుతుంది.
- **యాంటీఆక్సిడెంట్లు:** అన్ని పండ్లలాగే ఎరుపు అరటిలో కూడా యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. 11 రకాల ఖనిజ లవణాలు, 6 రకాల విటమిన్లతో పాటు, లెక్కలేనన్ని ప్రయోజనకరమైన పిండిపదార్థాలను కలిగి ఉండే ఎరుపు అరటి పండును తరచూ తింటూ ఉండడం ఆరోగ్యకరం.



# చెన్నైలో ఫైనల్

- అహ్మదాబాద్‌లో రెండు ప్లేఆఫ్‌లు
- ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్ విడుదల
- మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే..



న్యూఢిల్లీ: మెగా లీగ్ ఐపీఎల్ ఫైనల్ మే 26న చెన్నై వేదికగా జరుగనుంది. ఈ మేరకు అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ సోమవారం విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల కారణంగా ఐపీఎల్ రెండోదశను యూఏఈకి తరలిస్తారన్న ఊహాగానాలకు చెక్ పెడుతూ.. భారత్‌లోనే మిగిలిన మ్యాచ్‌ల వేదికలను ఖరారు చేసింది. 2011, 2012 తర్వాత చెన్నైలో ఫైనల్‌ను షెడ్యూల్ చేయడం ఇదే తొలిసారి. డిఫెండింగ్ చాంప్ హోదాలో టైటిల్ ఫైట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం చెన్నైకు దక్కింది. ఒకవేళ సీఎస్‌కే ఫైనల్‌కు చేరితే సొంత ప్రేక్షకుల ముందు ధోనీ ఘనంగా వీడ్కోలు పలికే అవకాశం ఉంది. అంతేకాకుండా మే 24న రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌కు కూడా చెపాక్ వేదిక కానుంది. అహ్మదాబాద్‌లోని మొతేరా స్టేడియంలో మే 21న క్వాలిఫయర్-1, 22న ఎలిమినేటర్ మ్యాచ్‌లను నిర్వహించనున్నారు. తొలి దశలో 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేయగా.. వచ్చే నెల 8 నుంచి జరిగే రెండో దశలో మొత్తంగా 52 మ్యాచ్‌లు జరగనున్నాయి. పోలింగ్‌ను దృష్టిలో ఉంచుకొని భద్రతా సమస్యలు తలెత్తకుండా ఉండే విధంగా మ్యాచ్‌ల తేదీలను ఖరారు చేశారు. పంజాబ్ కింగ్స్ రెండో హోంగ్రౌండ్ ధర్మశాలలో, రాజస్థాన్ రాయల్స్ రెండో సొంత మైదానంగా భావిస్తున్న గువాహటిలో రెండేసి మ్యాచ్‌లను షెడ్యూల్ చేశారు. ఢిల్లీ క్యాపిటల్స్ తమ సొంతమైదానం అరుణ్ జైట్లీ స్టేడియంలో తొలి మ్యాచ్‌ను ఏప్రిల్ 20న సన్‌రైజర్స్‌తో ఆడనుంది. మే 19న రాజస్థాన్- కోల్‌కతా మ్యాచ్‌తో లీగ్ దశ ముగియనుంది. ఒక రోజు విరామం తర్వాత మే 21 నుంచి ప్లేఆఫ్స్ జరగనున్నాయి.

## ఐపీఎల్ రెండో దశ షెడ్యూల్

| తేదీ | మ్యాచ్ | వేదిక | సమయం |
|---|---|---|---|
| ఏప్రిల్ 8 | చెన్నై x కోల్‌కతా | చెన్నై | రా.7.30 |
| ఏప్రిల్ 9 | పంజాబ్ x హైదరాబాద్ | ముల్లాపూర్ | రా.7.30 |
| ఏప్రిల్ 10 | రాజస్థాన్ x గుజరాత్ | జైపూర్ | రా.7.30 |
| ఏప్రిల్ 11 | ముంబై x బెంగళూరు | ముంబై | రా.7.30 |
| ఏప్రిల్ 12 | లఖ్‌నవూ x ఢిల్లీ | లఖ్‌నవూ | రా.7.30 |
| ఏప్రిల్ 13 | పంజాబ్ x రాజస్థాన్ | ముల్లాపూర్ | రా.7.30 |
| ఏప్రిల్ 14 | కోల్‌కతా x లఖ్‌నవూ | కోల్‌కతా | మ.3.30 |
| ఏప్రిల్ 14 | ముంబై x చెన్నై | ముంబై | రా.7.30 |
| ఏప్రిల్ 15 | బెంగళూరు x హైదరాబాద్ | బెంగళూరు | రా.7.30 |
| ఏప్రిల్ 16 | గుజరాత్ x ఢిల్లీ | అహ్మదాబాద్ | రా.7.30 |
| ఏప్రిల్ 17 | కోల్‌కతా x రాజస్థాన్ | కోల్‌కతా | రా.7.30 |
| ఏప్రిల్ 18 | పంజాబ్ x ముంబై | ముల్లాపూర్ | రా.7.30 |
| ఏప్రిల్ 19 | లఖ్‌నవూ x చెన్నై | లఖ్‌నవూ | రా.7.30 |
| ఏప్రిల్ 20 | ఢిల్లీ x హైదరాబాద్ | ఢిల్లీ | రా.7.30 |
| ఏప్రిల్ 21 | కోల్‌కతా x బెంగళూరు | కోల్‌కతా | మ.3.30 |
| ఏప్రిల్ 21 | పంజాబ్ x గుజరాత్ | ముల్లాపూర్ | రా.7.30 |
| ఏప్రిల్ 22 | రాజస్థాన్ x ముంబై | జైపూర్ | రా.7.30 |
| ఏప్రిల్ 23 | చెన్నై x లఖ్‌నవూ | చెన్నై | రా.7.30 |
| ఏప్రిల్ 24 | ఢిల్లీ x గుజరాత్ | ఢిల్లీ | రా.7.30 |
| ఏప్రిల్ 25 | హైదరాబాద్ X బెంగళూరు | హైదరాబాద్ | రా.7.30 |
| ఏప్రిల్ 26 | కోల్‌కతా x పంజాబ్ | కోల్‌కతా | రా.7.30 |
| ఏప్రిల్ 27 | ఢిల్లీ x ముంబై | ఢిల్లీ | మ.3.30 |
| ఏప్రిల్ 27 | లఖ్‌నవూ x రాజస్థాన్ | లఖ్‌నవూ | రా.7.30 |
| ఏప్రిల్ 28 | గుజరాత్ x బెంగళూరు | అహ్మదాబాద్ | మ.3.30 |
| ఏప్రిల్ 28 | చెన్నై x హైదరాబాద్ | చెన్నై | రా.7.30 |
| ఏప్రిల్ 29 | కోల్‌కతా x ఢిల్లీ | కోల్‌కతా | రా.7.30 |
| ఏప్రిల్ 30 | లఖ్‌నవూ x ముంబై | లఖ్‌నవూ | రా.7.30 |
| మే 1 | చెన్నై x పంజాబ్ | చెన్నై | రా.7.30 |
| మే 2 | హైదరాబాద్ x రాజస్థాన్ | హైదరాబాద్ | రా.7.30 |
| మే 3 | ముంబై x కోల్‌కతా | ముంబై | రా.7.30 |
| మే 4 | బెంగళూరు x గుజరాత్ | బెంగళూరు | రా.7.30 |
| మే 5 | పంజాబ్ x చెన్నై | ధర్మశాల | మ.3.30 |
| మే 5 | లఖ్‌నవూ x కోల్‌కతా | లఖ్‌నవూ | రా.7.30 |
| మే 6 | ముంబై x హైదరాబాద్ | ముంబై | రా.7.30 |
| మే 7 | ఢిల్లీ x రాజస్థాన్ | ఢిల్లీ | రా.7.30 |
| మే 8 | హైదరాబాద్ x లఖ్‌నవూ | హైదరాబాద్ | రా.7.30 |
| మే 9 | పంజాబ్ x బెంగళూరు | ధర్మశాల | రా.7.30 |
| మే 10 | గుజరాత్ x చెన్నై | అహ్మదాబాద్ | రా.7.30 |
| మే 11 | కోల్‌కతా x ముంబై | కోల్‌కతా | రా.7.30 |
| మే 12 | చెన్నై x రాజస్థాన్ | చెన్నై | మ.3.30 |
| మే 12 | బెంగళూరు x ఢిల్లీ | బెంగళూరు | రా.7.30 |
| మే 13 | గుజరాత్ x కోల్‌కతా | అహ్మదాబాద్ | రా.7.30 |
| మే 14 | ఢిల్లీ x లఖ్‌నవూ | ఢిల్లీ | రా.7.30 |
| మే 15 | రాజస్థాన్ x పంజాబ్ | గువాహటి | రా.7.30 |
| మే 16 | హైదరాబాద్ x గుజరాత్ | హైదరాబాద్ | రా.7.30 |
| మే 17 | ముంబై x లఖ్‌నవూ | ముంబై | రా.7.30 |
| మే 18 | బెంగళూరు x చెన్నై | బెంగళూరు | రా.7.30 |
| మే 19 | హైదరాబాద్ x పంజాబ్ | హైదరాబాద్ | మ.3.30 |
| మే 19 | రాజస్థాన్ x కోల్‌కతా | గువాహటి | రా.7.30 |
| మే 21 | క్వాలిఫయర్-1 | అహ్మదాబాద్ | రా.7.30 |
| మే 22 | ఎలిమినేటర్ | అహ్మదాబాద్ | రా.7.30 |
| మే 24 | క్వాలిఫయర్-2 | చెన్నై | రా.7.30 |
| మే 26 | ఫైనల్ | చెన్నై | రా.7.30 |

# విరాట్ మెరిసె..

బెంగళూరుకు తొలి గెలుపు ● ఆఖర్లో అదరగొట్టిన దినేశ్ ● 4 వికెట్లతో ఓడిన పంజాబ్



దినేశ్ కార్తీక్ (10 బంతుల్లో 28 నాటౌట్)

**స్కోరుబోర్డు**

పంజాబ్: ధవన్ (సి) కోహ్లీ (బి) మ్యాక్స్‌వెల్ 45, బెయిర్‌స్టో (సి) కోహ్లీ (బి) సిరాజ్ 8, ప్రభ్‌సిమ్రన్ (సి) రావత్ (బి) మ్యాక్స్‌వెల్ 25, లివింగ్‌స్టోన్ (సి) రావత్ (బి) జోసెఫ్ 17, కర్రాన్ (సి) రావత్ (బి) యశ్ దయాల్ 23, జితేశ్ (సి) రావత్ (బి) సిరాజ్ 27, శశాంక్ (నాటౌట్) 21, హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 20 ఓవర్లలో 176/6; వికెట్ల పతనం:** 1-17, 2-72, 3-98, 4-98, 5-150, 6-154; **బౌలింగ్:** సిరాజ్ 4-0-26-2, యశ్ దయాల్ 4-0-23-1, అల్జారీ జోసెఫ్ 4-0-43-1, గ్రీన్ 2-0-19-0, దాగర్ 3-0-34-0, మ్యాక్స్‌వెల్ 3-0-29-2.

బెంగళూరు: కోహ్లీ (సి) హర్‌ప్రీత్ బ్రార్ (బి) హర్షల్ 77, డుప్లెసి (సి) కర్రాన్ (బి) రబాడ 3, గ్రీన్ (సి) జితేశ్ (బి) రబాడ 3, పటీదార్ (బి) హర్‌ప్రీత్ బ్రార్ 18, మ్యాక్స్‌వెల్ (బి) హర్‌ప్రీత్ బ్రార్ 3, అనూజ్ రావత్ (ఎల్బీ) కర్రాన్ 11, దినేశ్ కార్తీక్ (నాటౌట్) 28, మహిపాల్ (నాటౌట్) 17, **ఎక్స్‌ట్రాలు: 18; మొత్తం: 19.2 ఓవర్లలో 178/6; వికెట్ల పతనం:** 1-26, 2-43, 3-86, 4-103, 5-130, 6-130; **బౌలింగ్:** సామ్ కర్రాన్ 3-0-30-1, అర్ష్‌దీప్ 3.2-0-40-0, రబాడ 4-0-23-2, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-13-2, హర్షల్ పటేల్ 4-0-45-1, రాహుల్ చాహర్ 1-0-16-0.



విరాట్ కోహ్లీ (49 బంతుల్లో 77)

బెంగళూరు: విరాట్ కోహ్లీ (49 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 77) అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) గెలుపు ఖాతా తెరిచింది. సోమవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో బెంగళూరు 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై నెగ్గింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 176/6 స్కోరు చేసింది. ధవన్ (45), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (25), జితేష్ (27) రాణించారు. సిరాజ్, మ్యాక్స్‌వెల్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 19.2 ఓవర్లలో 6 వికెట్లకు 178 పరుగులు చేసి గెలిచింది. దినేశ్ కార్తీక్ (10 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28 నాటౌట్) మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాడు. రబాడ, హర్‌ప్రీత్ బ్రార్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు. విరాట్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**ఆఖర్లో అదరగొట్టారు..:** కోహ్లీ ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో.. ఛేదనను బెంగళూరు ధాటిగా ఆరంభించింది. కర్రాన్ బౌలింగ్‌లో ఇన్నింగ్స్ రెండో బంతికి బతికి పోయిన విరాట్ నాలుగు బౌండ్రీలతో మోతెక్కించాడు. డుప్లెసి (3), గ్రీన్ (3)ను కూడా రబాడ పెవిలియన్ చేర్చినా.. కోహ్లీ కుదురుకోవడంతో పవర్‌ప్లే ముగిసేసరికి బెంగళూరు 50/2తో నిలిచింది. మధ్య ఓవర్లలో విరాట్, రజత్ పటీదార్ (18) వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడుతూ స్కోరు బోర్డును నడిపించారు. అయితే, పటీదార్‌ను హర్‌ప్రీత్ బౌల్డ్ చేయడంతో.. మూడో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మ్యాక్స్‌వెల్ (3)ను కూడా హర్‌ప్రీత్ బౌల్డ్ చేసి షాకిచ్చాడు. చివరి 5 ఓవర్లలో ఆర్సీబీ విజయానికి 59 పరుగులు కావాల్సి ఉండగా.. విరాట్‌ను అవుట్ చేసిన హర్షల్ జట్టుకు కావాల్సిన బ్రేక్‌ను అందించాడు. ఆ వెంటనే అనూజ్ రావత్ (11)ను కర్రాన్ ఎల్బీ చేయడంతో ఉత్కంఠ రేగింది. కానీ, కార్తీక్, ఇంపాక్ట్ ప్లేయర్ మహిపాల్ లోమ్రోర్ (17 నాటౌట్) 18 బంతుల్లో 48 రన్స్ జోడించడంతో.. ఆర్సీబీ మరో 4 బంతులు మిగిలుండగానే నెగ్గింది. ఆఖరి ఓవర్‌లో 10 పరుగులు అవసరమవగా.. కార్తీక్ 6, 4తో ఫినిష్ చేశాడు.

**తడబడినా.. పుంజుకొని:** బెంగళూరు బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా.. ఓపెనర్ ధవన్‌తోపాటు మిడిలార్డర్‌లో కర్రాన్ (23), జితేష్ పోరాడడంతో పంజాబ్ మెరుగైన స్కోరు నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కింగ్స్.. స్వల్ప స్కోరుకే ఓపెనర్ బెయిర్‌స్టో (8) వికెట్‌ను కోల్పోయింది. అయితే, ప్రభ్‌సిమ్రన్, ధవన్ ఆచితూచి ఆడడంతో.. పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ 40/1 స్కోరు చేసింది. అయితే, ఏడో ఓవర్‌లో ప్రభ్‌సిమ్రన్ సిక్స్ బాదగా.. ఆ తర్వాతి ఓవర్‌లో ధవన్ కూడా భారీ షాట్‌తో బ్యాట్‌కు పని చెప్పాడు. స్కోరు వేగం పుంజుకొంటున్న సమయంలో సింగ్‌ను మ్యాక్స్‌వెల్ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. నిలకడగా సాగుతున్న పంజాబ్ బ్యాటింగ్ 98 పరుగుల స్కోరు వద్ద ఒక్కసారిగా కుదుపులకు గురైంది. జోసెఫ్ బౌలింగ్‌లో లివింగ్‌స్టోన్ (17) వెనుదిరగ్గా.. క్రీజులో కుదురుకున్న ధవన్‌ను మ్యాక్స్‌వెల్ అవుట్ చేశాడు. ఈ దశలో కర్రాన్-జితేష్ ఐదో వికెట్‌కు 52 పరుగులతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. దాగర్ వేసిన 15వ ఓవర్‌లో జితేష్ రెండు వరుస సిక్స్‌లతో 17 పరుగులు రాబట్టాడు. కానీ, డెత్ ఓవర్లలో బెంగళూరు బౌలర్లు పట్టు బిగించడంతో.. పంజాబ్ బ్యాటర్లు ఆశించిన రీతిలో షాట్లు ఆడలేక పోయారు. కర్రాన్‌ను యష్.. జితేష్‌ను సిరాజ్ అవుట్ చేశారు. అయితే, ఆఖరి ఓవర్‌లో శశాంక్ (8 బంతుల్లో 21 నాటౌట్) 6,6,4తో 20 పరుగులు రాబట్టడంతో.. టీమ్ స్కోరు 170 మార్క్ దాటింది.

## నేటి మ్యాచ్

చెన్నై x గుజరాత్

రాత్రి 7.30 గం. నుంచి

## దీప్తికి స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్‌లో తెలుగు అథ్లెట్ జి.దీప్తి పసిడి పతకంతో మెరిసింది. సోమవారం బెంగుళూరులో జరిగిన ఈ పోటీల్లో దీప్తి 400 మీటర్ల పరుగును 1 నిమిషం 2 సెకన్లలో పూర్తిచేసి ప్రథమ స్థానంలో నిలిచింది. జయంతి (ఒడిశా) రజతం, భువీ అగర్వాల్ (హరియాణా) కాంస్యం సాధించారు.

## లంకదే తొలి టెస్టు

328 రన్స్‌తో బంగ్లా చిత్తు

సిల్హెట్ (బంగ్లాదేశ్): బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో శ్రీలంక ఏకంగా 328 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 511 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 47/5తో నాలుగోరోజైన సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా.. లంక బౌలర్ కసున్ రజిత (5/56) ధాటికి 182 పరుగులకే కుప్పకూలింది. బంగ్లా బ్యాటర్లలో మోమినుల్ హక్ (87 నాటౌట్) చివరిదాకా పోరాడినా ఫలితం లేకపోయింది. తొలి ఇన్నింగ్స్‌లోనూ మూడు వికెట్లు తీసిన రజిత.. ఓవరాల్‌గా 8 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించాడు. శ్రీలంక మొదటి ఇన్నింగ్స్‌లో 280, రెండో ఇన్నింగ్స్‌లో 418 పరుగులు చేసింది. బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 188 రన్స్‌కు ఆలౌటైంది.

## ఇక.. ఐదు టెస్టుల సిరీస్

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

న్యూఢిల్లీ: ప్రతిఏటా భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో అనూహ్య మార్పు. గత 32 ఏళ్లుగా నాలుగు టెస్టుల సిరీస్‌గా నిర్వహిస్తూ వస్తున్న ఈ సిరీస్‌ను ఇకనుంచి ఐదు టెస్టులకు మార్చారు. ఈ ఏడాది ఆఖర్లో ఆస్ట్రేలియా వేదికగా జరిగే ఈ సిరీస్‌లో ఐదు టెస్టులను ఆడించనున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా తెలిపింది. కాగా, చివరిసారిగా 1991-92 సీజన్‌లో ఈ సిరీస్‌లో ఐదు టెస్టులను ఆడించారు.

## ఇక్కడైనా.. దక్కేనా?

ట్రోఫీ వేటలో సింధు, శ్రీకాంత్

నేటినుంచి స్పెయిన్ మాస్టర్స్

మాడ్రిడ్: పారిస్ ఒలింపిక్స్ దగ్గరపడుతున్నా.. ఇప్పటికీ ఫామ్ అందుకునేందుకు తంటాలు పడుతున్న తెలుగు స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్ మరో కీలక టోర్నీకి సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి జరిగే స్పెయిన్ మాస్టర్స్ చాలెంజ్ బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో టైటిలే లక్ష్యంగా ఈ ఇద్దరూ బరిలోకి దిగుతున్నారు. గతేడాది ఫైనలిస్టు అయిన రెండోసీడ్ సింధు ఆరంభరౌండ్లో వెన్ యూ జాంగ్ (కెనడా)తో తలపడనుండగా.. ఏడోసీడ్ శ్రీకాంత్ క్వాలిఫయర్‌తో తన పోరు ఆరంభించనున్నాడు. సింధు, శ్రీకాంత్‌తో పాటు అస్మిత, మాళవిక, కిరణ్, సతీశ్ సింగిల్స్‌లో పోటీపడుతున్నారు. డబుల్స్‌లో అశ్విని/తనీషా, గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ ఆడనున్నారు.

# బిజినెస్

## లోక్‌సభ ఎన్నికల తర్వాత టెలికాం చార్జీల బాదుడు!?

15-20 శాతం పెంపు తప్పదు



న్యూఢిల్లీ: దేశంలో టెలికాం సేవలు మరింత ప్రియం కానున్నాయి. ఒక్కో వినియోగదారు నుంచి సగటు ఆదాయాన్ని (ఏఆర్‌పీయూ) మెరుగుపరుచుకునే ప్రయత్నాల్లో భాగంగా టెలికాం కంపెనీలు ఈ లోక్‌సభ ఎన్నికల తర్వాత చార్జీలు పెంచే అవకాశాలున్నాయి. దాదాపు రెండున్నరేళ్లపాటు చార్జీలను స్థిరంగా కొనసాగించిన టెల్కోలు.. ఈసారి 15- 20 శాతం వరకు పెంచవచ్చని బ్రోకరేజీ కంపెనీలు అంచనా వేస్తున్నాయి. జూలై-అక్టోబరు మధ్యకాలంలో ఈ పెంపును ప్రకటించవచ్చని భావిస్తున్నాయి. అయితే, అల్పాదాయ వర్గ వినియోగదారులు సైతం భరించగలిగేలా కంపెనీలు చార్జీల పెంపు ప్రణాళికను రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని విశ్లేషకులంటున్నారు. 2021 నవంబరులో టెల్కోలు టారి‌ఫ్‌ను 20-25 శాతం వరకు పెంచాయి. భారతీ ఎయిర్‌టెల్ తొలుత చార్జీల పెంపును ప్రకటించవచ్చని బ్రోకరేజీ సంస్థలంటున్నాయి. మిగతా ప్రైవేట్ ఆపరేటర్లు జియో, వొడాఫోన్ ఐడియా పెంపుపై భిన్నాభిప్రాయాలున్నాయి. మిగతా కంపెనీలూ ఎయిర్‌టెల్ బాటను అనుసరించనున్నాయని కొందరంటుండగా.. జియో మాత్రం తన వినియోగదారుల డేటా వినియోగం పెంపు ద్వారా ఆదాయాన్ని పెంచుకునే వ్యూహాన్ని అనుసరించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా కస్టమర్లను కోల్పోతున్న వొడాఫోన్ ఐడియా.. చార్జీలను పెంచే సాహసం చేయకపోవచ్చన్న వాదనలూ విన్పిస్తున్నాయి. అయితే, 5జీ స్పెక్ట్రమ్, నెట్‌వర్క్ విస్తరణ కోసం భారీగా పెట్టుబడులు పెట్టిన టెల్కోలకు ఆదాయాన్ని పెంచుకోవడం అత్యవసరంగా మారింది. గత డిసెంబరుతో ముగిసిన త్రైమాసికం నాటికి ఎయిర్‌టెల్ ఆర్పూ రూ.208కి చేరింది. జియో ఆర్పూ రూ.182, వొడా ఐడియా సగటు రెవెన్యూ మాత్రం కనిష్ఠంగా రూ.145గా నమోదైంది. ఈసారి చార్జీల పెంపుతో ఎయిర్‌టెల్ ఆర్పూ రూ.260 స్థాయికి చేరుకోవచ్చని బెర్న్‌స్టీన్ అంచనా వేసింది.

## పదేళ్లలో నిఫ్టీ వృద్ధి 240%

సూచీలోని 50 కంపెనీల్లో 47 మల్టీబ్యాగర్లు




ముంబై: గడిచిన పదేళ్లలో స్టాక్ మార్కెట్ సూచీలు భారీ వృద్ధిని కనబరిచాయి. 2014 హోలీ నాటికి 6,494 పాయింట్ల వద్దనున్న నిఫ్టీ-50 సూచీ.. 2024 హోలీ నాటికి 240 శాతం వృద్ధితో 22,096 పాయింట్ల స్థాయికి చేరుకుంది. అలాగే, సెన్సెక్స్ కూడా 22,096 పాయింట్ల స్థాయి నుంచి 230 శాతం పెరుగుదలతో 72,831 వద్దకు చేరుకుంది. 2015 మినహా మిగతా అన్ని సంవత్సరాల్లో నిఫ్టీ పాజిటివ్ వృద్ధిని నమోదు చేసింది. 2021లో అత్యధికంగా 24 శాతం రిటర్న్‌లు పంచింది. 2023లో సూచీ 20 శాతం పుంజుకుంది. గత ఏడాదిలో నిఫ్టీ తొలిసారిగా 19, 20, 21 వేల కీలక మైలురాళ్లను అధిగమించింది. కాగా, ఈ పదేళ్లలో నిఫ్టీ-50లోని 47 కంపెనీలు మల్టీబ్యాగర్ రిటర్నులు పంచాయి. అందులో 14 కంపెనీల షేర్ల ధరలు 500 నుంచి 3,900 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

**అత్యధికంగా వృద్ధి చెందిన నిఫ్టీ-50 షేర్లు**

| కంపెనీ | వృద్ధి (%) |
|---|---|
| బజాజ్ ఫైనాన్స్ | 3,913 |
| బజాజ్ ఫిన్‌సర్వ్ | 2,103 |
| టైటన్ | 1,353 |
| బ్రిటానియా ఇండస్ట్రీస్ | 1,029 |
| అదానీ ఎంటర్‌ప్రైజెస్ | 856 |

**ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా భారత్**

2014 డిసెంబరులో తొలిసారిగా రూ.100 లక్షల కోట్ల మైలురాయిని దాటిన మార్కెట్ సంపద (బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్).. గత ఏడాది నవంబరు 29న రూ.333 లక్షల కోట్లకు (4 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. ప్రస్తుతం రూ.382 లక్షల కోట్ల స్థాయికి పెరిగింది. అంతేకాదు, మార్కెట్ క్యాప్ పరంగా గత ఏడాది హాంకాంగ్‌ను వెనక్కి నెట్టి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఈక్విటీ మార్కెట్‌గా అవతరించింది. 2030 నాటికి భారత ఈక్విటీ మార్కెట్ సంపద 10 లక్షల కోట్ల డాలర్లకు చేరుకోవచ్చని అంతర్జాతీయ బ్రోకరేజీ సంస్థ జెఫ్రీస్ అంచనా వేసింది.

## అమెరికా మార్కెట్‌కు అమూల్ పాలు




న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద పాల ఉత్పత్తుల బ్రాండ్ అమూల్.. అతి త్వరలో అమెరికా మార్కెట్లోకి అడుగు పెట్టబోతోంది. వారం రోజుల్లో కంపెనీకి చెందిన తాజా పాల ఉత్పత్తులను అమెరికాలో విడుదల చేయనున్నట్లు అమూల్ బ్రాండ్ నిర్వహణదారైన గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) తెలిపింది. దశాబ్దాలుగా డైరీ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నప్పటికీ తాజా పాలను విదేశాల్లో లాంచ్ చేయడం మాత్రం ఇదే తొలిసారని జీసీఎంఎంఎఫ్ ఎండీ జయేన్ మెహతా అన్నారు. యూఎస్‌లోని భారతీయులు, మిగతా ఆసియా దేశాల వారి కోసం వీటిని అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన చెప్పారు. అమూల్ తాజా, గోల్డ్, శక్తి, స్లిమ్ అండ్ ట్రిమ్ పాలప్యాకెట్లను న్యూయార్క్, న్యూజెర్సీ షికాగో, వాషింగ్టన్, డల్లాస్, టెక్సాస్ తదితర నగరాల్లో విక్రయించనున్నట్లు కంపెనీ పేర్కొంది. భవిష్యత్‌లో అమూల్ పనీర్, పెరుగు, బటర్‌మిల్క్‌ను సైతం లాంచ్ చేయాలనుకుంటున్నట్లు మెహతా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో జీసీఎంఎంఎఫ్ టర్నోవర్ వార్షిక ప్రాతిపదికన 18.5 శాతం వృద్ధితో రూ.55,000 కోట్లకు చేరుకుంది. ఈ సంస్థ ఇప్పటికే 50 దేశాలకు డైరీ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది.

## పేటీఎం ఆదాయం 24 శాతం క్షీణిత

మోతీలాల్ ఓస్వాల్

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై (పీపీబీఎల్) ఆర్‌బీఐ విధించిన ఆంక్షల కారణంగా 2025 ఆర్థిక సంవత్సరంలో పేటీఎం ఆదాయం 24 శాతం, లాభం 30 శాతం మేరకు తగ్గవచ్చునని మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేసింది. అయితే ప్రస్తుతం పేటీఎం వ్యాపార పరివర్తన తీరుతెన్నులను తాము నిశితంగా గమనిస్తున్నామని తాజా విశ్లేషణలో తెలియచేసింది. అయితే నాలుగో త్రైమాసికం ఆర్థిక ఫలితాల అనంతరం తమ రేటింగ్‌ను సమీక్షిస్తామని, ఈ లోగా న్యూట్రల్ రేటింగ్‌లో పెడుతున్నట్టు వెల్లడించింది.

## అంతర్జాతీయ సంకేతాలే కీలకం..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు వస్తే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది. ఈ ఏడాది మూడుసార్లు వడ్డీరేట్లు తగ్గించనున్నట్లు అమెరిక్ ఫెడ్ రిజర్వ్ చేసిన ప్రకటన సూచీలకు దన్నుగా మారింది. అంతకుముందుతో పోల్చితే మార్కెట్ బ్రెడ్త్ క్రమంగా మెరుగుపడుతోంది. ఫియర్ ఇండెక్స్ సైతం తగ్గుతోంది. నిఫ్టీ మార్చి ఫ్యూచర్స్ మద్దతు 22,050 వద్ద, నిరోధం 22,300 వద్ద ఉన్నాయి. సోమవారం హోలీ సందర్భంగా స్టాక్ మార్కెట్లు పనిచేయలేదు. కాగా శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా మార్కెట్లకు సెలవు. మొత్తంగా ఈ వారం మార్కెట్ మూడు రోజులు మాత్రమే పనిచేయనుంది.

### స్టాక్ రికమండేషన్స్

**హిండాల్కో:** కొన్నాళ్ల క్రితం గ్యాప్‌డౌన్ అయిన ఈ కౌంటర్ ప్రస్తుతం నిలదొక్కుకుంటోంది. రూ.520 స్థాయిలో మంచి బేస్ ఏర్పడింది. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన పనితీరును కనబరుస్తోంది. గత శుక్రవారంతఈ షేరు రూ.547 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.540 పై స్థాయిలో ప్రవేశించి రూ.600/625 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.520 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**సన్ ఫార్మా:** ఈ కంపెనీ సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. ఫిబ్రవరి నుంచి రూ.1,530 స్థాయిలో అక్యుములేషన్ జరుగుతోంది. ఈ కౌంటర్‌లో ఆటుపోట్లు సైతం తక్కువగా ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,608 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,750/1,810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,545 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఇండస్ టవర్:** టెక్నికల్‌గా చూస్తే ఈ కౌంటర్‌లో చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. గత వారం ఈ షేరు నెల గరిష్ఠ స్థాయిని అధిగమించింది. చివరి ఐదు రోజుల్లో డెలివరీ వాల్యూమ్ 2.2 రెట్లు పెరిగింది. పైగా అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 8.43 శాతం లాభంతో రూ.271 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.260 స్థాయిలో ప్రవేశించి రూ.340 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.235 స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**హీరో మోటోకార్ప్:** ప్రస్తుతం ఆటో రంగ షేర్లు దూకుడును ప్రదర్శిస్తున్నాయి. నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. మోతీలాల్ ఓస్వాల్ 'బై' రేటింగ్ ఇవ్వటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు రూ.4,684 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.4,650 స్థాయిలో ఎంటరై రూ.4,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.4,620 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఫినోలెక్స్ ఇండస్ట్రీస్:** గత కొన్ని నెలలుగా ఈ కౌంటర్ సైడ్‌వేస్‌లో సాగుతోంది. రూ.220 స్థాయిల్లో చక్కని రౌండ్ బాటమ్ ఏర్పడింది. ఇదే కీలక మద్దతుగా ఉంటోంది. గత వారం ఈ షేరు నెల గరిష్ఠాన్ని అధిగమించింది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.220 పై స్థాయిల్లో ప్రవేశించి రూ.285/310 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.205 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.




- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

## గుండె జబ్బుకు లీహెల్త్ ఔషధం లిఫోస్టెరాల్

హైదరాబాద్: న్యూట్రాస్యూటికల్స్ తయారీలోని హైదరాబాద్‌కు చెందిన లీ హెల్త్ డొమైన్ గుండెకు సమర్థవంతమైన రక్షణ కల్పించే పోలీపిల్ లిఫోస్టెరాల్ తయారుచేసింది. హృద్రోగంపై విస్తృత పరిశోధన అనంతరం ఈ సాఫ్ట్‌జెల్ కాప్సూల్ తయారుచేసినట్టు కంపెనీ ప్రకటించింది. పాత వెల్లుల్లి రసం, గామా ఒరైజెనాల్, ఫైటోస్టెరాల్, లికోపిన్, నానో కర్క్యుమిన్, ఫెనూగ్రీక్, పైపరిన్ వంటి ప్రకృతిసిద్ధమైన పదార్థాలతో ఇవి తయారుచేసినట్టు కంపెనీ డైరెక్టర్ ఆళ్ల లీలారాణి తెలిపారు. ఇది కొలెస్టరాల్, ట్రైగ్లిసరైడ్స్‌ను సమతూకం చేస్తూ గుండెకొట్టుకోవడాన్ని క్రమబద్ధం చేయడానికి ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. ఇది అమెజాన్, లీ హెల్త్ డొమైన్ పోర్టళ్లలోను, అన్ని ప్రధాన ఫార్మసీల్లోను అందుబాటులో ఉంటుందని ఆమె వెల్లడించారు.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| ప్రాంతం | ధర |
|---|---|
| **25వ తేదీ** | |
| హైదరాబాద్ | 395 |
| **26వ తేదీ** | |
| చిత్తూరు | 458 |
| గోదావరి | 400 |
| విజయవాడ | 400 |
| విశాఖపట్నం | 415 |
| వరంగల్ | 397 |

డజను గుడ్లు రూ.72

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| ప్రాంతం | ధర |
|---|---|
| హైదరాబాద్ | 118 |
| వరంగల్ | 118 |
| కరీంనగర్ | 118 |
| మహబూబ్‌నగర్ | 118 |
| కర్నూలు | 118 |
| విశాఖపట్నం | 115 |
| గోదావరి | 116 |
| విజయవాడ | 116 |
| గుంటూరు | 117 |
| ఒంగోలు | 117 |
| చిత్తూరు | 125 |

## గ్రీన్‌కో డైరెక్టర్ మచిలీపట్నం రేసులో..

- జనసేన పరిశీలనలో బండారు నరసింహారావు!
- ప్రస్తుత ఎంపీ బాలశౌరి కూడా..
- అవనిగడ్డ, పాలకొండ టికెట్ల కోసం ముగ్గురేసి నేతల పోటీ
- ఐవీఆర్ఎస్ సర్వే చేపట్టిన నాయకత్వం
- రెండ్రోజుల్లో పవన్ తుది నిర్ణయం
- 30 నుంచి జనసేనాని ఎన్నికల శంఖారావం
- 3 విడతల్లో ప్రచారం.. పిఠాపురం నుంచే ఆరంభం

అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం లోక్‌సభ స్థానంలో జనసేన అభ్యర్థిత్వం ఆసక్తికరంగా మారింది. వైసీపీకి రాజీనామా చేసి వచ్చిన ఎంపీ వల్లభనేని బాలశౌరికే ఈ టికెట్ ఇస్తారని ఇప్పటిదాకా ప్రచారం జరిగింది. ఇప్పుడు కొత్తగా వేరే పేరు తెరపైకి వచ్చింది. గ్రీన్‌కో కంపెనీ డైరెక్టర్ బండారు నరసింహారావు పేరు కూడా వినిపిస్తోంది. వీరిద్దరిలో ఎవరు పోటీ చేస్తారో జనసేనాని పవన్ కల్యాణ్ రెండ్రోజుల్లో ఖరారు చేస్తారని అంటున్నారు. ఇక కృష్ణా జిల్లా అవనిగడ్డ, శ్రీకాకుళం జిల్లా పాలకొండ అసెంబ్లీ స్థానాల అభ్యర్థులపై తీవ్ర కసరత్తు జరుగుతోంది. ఈ రెండు స్థానాల్లో పార్టీ తరఫున ముగ్గురేసి నేతలు పోటీపడుతున్నారు. అవనిగడ్డలో విక్కుర్తి శ్రీనివాస్, బండి రామకృష్ణ, బండ్రెడ్డి రామకృష్ణ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. వీరిలో విక్కుర్తి వైపు నాయకత్వం దాదాపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. సోమవారం ఉదయం ఈ ముగ్గురి పేర్లపై సర్వే చేపట్టింది. పాలకొండలో కూడా సర్వే చేపట్టింది. ఆయా అభ్యర్థులను మంగళగిరికి పిలిచి మాట్లాడుతున్నారు.

### 30 నుంచి 3 రోజులు పిఠాపురంలోనే..

జనసేనాని 30వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారు. పిఠాపురంలోనే ఎన్నికల శంఖం పూరిస్తారు. తొలిరోజు శక్తిపీఠమైన పురుహూతిక అమ్మవారి దర్శనం చేసుకుని వారాహి వాహనానికి పూజలు చేయిస్తారు. అనంతరం దత్తపీఠాన్ని సందర్శిస్తారు. నియోజకవర్గంలో మూడ్రోజులు పర్యటిస్తారు. బంగారుపాప దర్గాకు వెళ్తారు. క్రైస్తవ పెద్దలతో భేటీ అవుతారు. సర్వమత ప్రార్థనల్లో పాల్గొంటారు. పవన్ సోమవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. పిఠాపురం నుంచే నియోజకవర్గాలకు తరలివెళ్లాలని.. మూడు విడతలుగా ప్రచారం సాగించాలని నిర్ణయించారు. ప్రతి విడతలో జనసేన పోటీచేసే నియోజకవర్గాల గుండా యాత్ర సాగేలా షెడ్యూల్ ఖరారు చేయాలని నేతలను పవన్ ఆదేశించారు. ఉగాది వేడుకలను పిఠాపురంలోనే జరుపుకోవాలని కూడా నిశ్చయించారు.

### పవన్ హోలీ శుభాకాంక్షలు..

వసంత రుతువు అడుగిడే తరుణంలో భారతీయులందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా చేసుకొనే వేడుక హోలీ అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. దేశ ప్రజలందరికి హోలీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. జీవితం వర్ణమయం కావాలని, సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలో సహజసిద్ధమైన రంగులనే వినియోగించడం శ్రేయస్కరమని.. ఆరోగ్యపరంగా కూడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని పేర్కొన్నారు.

## ఎన్డీయేలో బీజేపీ తర్వాత టీడీపీయే!

- అత్యధికంగా 17 ఎంపీ స్థానాలకు పోటీ
- 16 చోట్ల జేడీయూ అభ్యర్థులు
- తర్వాతి స్థానాల్లో షిండే సేన, పీఎంకే

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయేలో బీజేపీ తర్వాత అధిక లోక్‌సభ స్థానాలకు పోటీచేస్తున్నది టీడీపీయే కావడం విశేషం. బీజేపీ దేశవ్యాప్తంగా 450 స్థానాల్లో బరిలో దిగుతుండగా.. టీడీపీ 17 ఎంపీ స్థానాల్లో పోటీచేయనుంది. ఆ తర్వాత బిహార్‌లో జేడీయూ 16 సీట్లు, మహారాష్ట్రలో ఏక్ నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన-13, తమిళనాడులో పీఎంకే-10, పంజాబ్‌లో శిరోమణి అకాలీదళ్ 9 సీట్లలో పోటీ చేయనున్నాయి. మిగతా భాగస్వామ్యపార్టీలేవీ 5 స్థానాలకు మించి పోటీచేయడంలేదు. చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్‌జనశక్తి, అజిత్‌పవార్ సారథ్యంలోని ఎన్సీపీ ఐదేసి సీట్లలో, తమిళ మానిల కాంగ్రెస్, ఏఎంఎంకే, ఆర్ఎల్‌డీ, అప్నా దళ్ తలో రెండో సీట్లలో బరిలోకి దిగనున్నాయి. ఒక్కో స్థానానికి పోటీచేసే ఎన్డీయే భాగస్వామ్య పార్టీలు చాలానే ఉన్నాయి. దేశమంతటా భాగస్వామ్య పార్టీలతో సీట్ల సర్దుబాటును బీజేపీ దాదాపు పూర్తి చేసుకుంది. దానిని పరిశీలిస్తే టీడీపీ ఒక్కటే ఎన్డీయేలో బీజేపీ తర్వాత అత్యధిక స్థానాలకు పోటీ చేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఎన్డీఏ విజయానికి మాదిగల కృషి

- పురందేశ్వరితో భేటీలో మంద కృష్ణ



బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిసిన మంద కృష్ణమాదిగ, ఇతర నేతలు

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి రాష్ట్రంలోని మాదిగలందరూ కృషి చేస్తారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరితో ఆయన భేటీ అయ్యారు. ఎన్డీఏ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయాలంటూ మంద కృష్ణను పురందేశ్వరి కోరారు. జాతి కోసం పోరాడుతున్న మీకు... అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం శ్రమిస్తోన్న నరేంద్ర మోదీ మాటిచ్చారంటే మీ కల నెరవేరి తీరుతుందని పురందేశ్వరి అన్నారు.

## నేడు రాష్ట్రానికి బీజేపీ ఇన్‌చార్జి

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జి అరుణ్ సింగ్‌తోపాటు సహ ఇన్‌చార్జి సిద్ధార్థనాథ్ సింగ్ మంగళవారం విజయవాడకు రానున్నారు. రాష్ట్రంలో బీజేపీ పోటీ చేస్తున్న పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేయనున్నారు. పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలో జరిగే రాష్ట్ర పదాధికారుల సమావేశం ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరుగుతుంది.

## ఓటరు ఐడీ లేకున్నా.. ఓటేయొచ్చిలా..!

- ఆధార్ సహా 12 రకాల కార్డులు చూపిస్తే చాలు

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితాలో పేరుండి.. ఓటరు ఐడీ కార్డు ఉన్నవారు దాన్ని పోలింగ్ బూత్‌లో చూపించి ఓటు వేయవచ్చు. మరి.. జాబితాలో పేరున్నప్పటికీ ఓటరు ఐడీ కార్డు లేనివాళ్లు ఓటేయాలంటే ఎలా? అనే ఆందోళన చాలామందిలో ఉంటుంది..! అలాంటి వారికోసం కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఓటరు ఐడీ లేకున్నా 12 రకాల ఇతర గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించి ఓటేయొచ్చని కేంద్ర ఎన్నికల సంఘం భరోసా కల్పించింది. ఓటరు ఐడీ లేని పక్షంలో తమ ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డ్, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్‌పోర్టు, బ్యాంక్/పోస్టాఫీస్ జారీచేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కార్మికశాఖ మంజూరు చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, ఎన్‌పీఆర్ స్మార్ట్‌కార్డ్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు జారీచేసిన సర్వీస్ ఐడీ కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అధికారిక గుర్తింపు కార్డులు, దివ్యాంగులకు జారీచేసిన ఐడీ కార్డుల(యూడీఐడీ)లలో ఏదో ఒకటి చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ప్రవాసాంధ్రులు ఒరిజినల్ పాస్‌పోర్టును పోలింగ్ సిబ్బందికి చూపించాల్సి ఉంటుంది.

## వాణిజ్య పన్నుల సిబ్బందికి ఎన్నికల విధుల్లేవు!

అమరావతి, మార్చి 25(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ అధికారులు, సిబ్బందికి 2024-లోక్‌సభ, శాసనసభ ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇచ్చారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

# పేదల పెన్షన్.. రూ.4 వేలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. 175 నియోజకవర్గాల్లోనూ టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సంకల్పం తీసుకోవాలన్నారు. కేంద్రంలో ఎన్డీయే 400 ఎంపీ సీట్లను గెలవాలని, రాష్ట్రంలో మూడు పార్టీల కూటమి 160కిపైగా అసెంబ్లీ స్థానాలు గెలవాలని లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకూడదని పవన్ కల్యాణ్ ముందుకొచ్చారని.. రాష్ట్ర పరిస్థితి చూసి మోదీ కూడా ముందుకొచ్చారని తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే తపన తప్ప వేరే ఆలోచన లేదని.. తమను ఆశీర్వదించి తమతో నడవాలని, టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపిచ్చారు. ఇంకా ఏమన్నారంటే..



కుప్పంలో మహిళల సమావేశానికి హాజరైన జనం, చంద్రబాబు అభివాదం

### వీటి కోసం ఎన్డీయే రావాలి..

రాష్ట్రంలో ఎన్డీయే ఎందుకు అధికారంలోకి రావాలంటే.. రాజధాని కట్టుకోవాలి, పెట్టుబడులు తెచ్చుకోవాలి, పోలవరం పూర్తి చేయాలి, రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటో తారీఖున జీతం ఇవ్వాలి. మాకు అధికారం ఇస్తే సహజ వనరుల దోపిడీ ఉండదు. ధరల బాదుడు ఉండదు. కక్షపూరిత రాజకీయాలుండవు. కూటమికి ఓటేస్తే ముస్లింలకు రక్షణ ఉండదని కొందరు రెచ్చగొడుతున్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను కాపాడింది టీడీపీనే. వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని కాపాడాం. ఉర్దూను రెండో భాషగా చేశాం. ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశాం.

### కిళ్లీ కొట్టులోనూ డ్రగ్స్

విశాఖకు ఇటీవల 25 వేల కిలోల డ్రగ్స్ విదేశాల నుంచి వచ్చాయి. కిళ్లీ కొట్టులో కూడా డ్రగ్స్, గంజాయి అందుబాటులో ఉన్నాయి. డ్రగ్స్‌ను ఇలాగే నిర్లక్ష్యంగా వదిలేస్తే జీవితాలు నాశనమవుతాయి. వైసీపీ డ్రగ్స్, గంజాయిని ప్రోత్సహిస్తోంది. ఇవి వాడినవారికి తల్లికి, చెల్లికి తేడా తెలియదు. నేను గతంలోనే డ్రగ్స్, గంజాయి గురించి మాట్లాడితే.. డీజీపీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న టీడీపీ ప్రధాన కార్యాలయంపై దాడి చేశారు. ఎవరూ వైసీపీకి ఓట్లు వేయొద్దు. ఎన్‌డీఏ మిత్రపక్షాల అభ్యర్థులకే ఓటేయండి.

### సుబ్బారావు కుటుంబ ఆత్మహత్య బాధించింది

కడప జిల్లా ఒంటిమిట్టలో ఓ సాధారణ పద్మశాలి కుటుంబానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తికి మూడు ఎకరాల భూమి ఉంది. పిల్లల చదువుల కోసం చేసిన అప్పును భూమి అమ్మేసి తీరుద్దామనుకున్నాడు. వైసీపీ దుర్మార్గపు నాయకులు ఆన్‌లైన్‌లో రికార్డులు మార్చేశారు. కార్యాలయాల చుట్టూ ఆ వ్యక్తి ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేక చివరికి రైలు కింద పడి చనిపోయాడు. ఆ విషయం తెలుసుకున్న అతడి భార్య, కుమార్తె కూడా విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. దుర్మార్గపు ప్రభుత్వం తీరుతో నిండు కుటుంబం బలైపోయింది. నాకు చాలా బాధేసింది. సుబ్బారావుకు ఉన్న మరో కుమార్తెతో మాట్లాడాను. టీడీపీ వచ్చాక ఆ భూమి ఇప్పిస్తానని హామీ ఇచ్చాను. ప్రస్తుతం ఆ అమ్మాయి చదువుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తానని చెప్పాను. ఇలాంటి వాళ్లు రాష్ట్రంలో చాలామంది ఉన్నారు.



కుప్పం సభలో టీడీపీ జెండా చేతబట్టి చంద్రబాబుకు అభివాదం చేస్తున్న బాలుడు

- వైజాగ్‌లో ఓ ఎన్ఆర్ఐకు గన్ పెట్టి 5 ఎకరాల భూమి రాసిమ్మన్నారు. 'వైఎస్సార్ హయాంలోనే భూమిని రెగ్యులరైజ్ చేసుకున్నాను. రూ.వంద కోట్ల భూమిని మీకెందుకు ఇస్తాను'అని అతను నిరాకరించారు. దీంతో అధికారుల ద్వారా రికార్డులను మార్చేసి వేధింపులు మొదలుపెట్టారు. కోర్టులను ఆశ్రయించి ఐదేళ్లుగా భూమిని కాపాడుకుంటున్నారాయన. వైసీపీ నాయకుల తీరుకు ఇదే నిదర్శనం.
- తిరుపతిలో ఓ ఎన్ఆర్ఐ మహిళ డాక్టర్ సునీత కొంత భూమి కొనుగోలు చేశారు. తిరుపతి కైకాల చెరువు సర్వే నంబరు 1 లో భూమి కొంటే వైసీపీ దొంగలు ఆ భూమిని ఆక్రమించుకుని రికార్డులు మార్చేశారు. పోరాడినా ఫలితం లేక ఆస్ట్రేలియా వెళ్లిపోయింది. అక్కడి నుంచి 'నా భూమిని వైసీపీ దొంగలు ఆక్రమించుకున్నారు' అని వీడియో తీసి పెట్టింది.
- నంద్యాల జిల్లాలో అబ్దుల్ సలాం కుటుంబంలో నలుగురు సభ్యులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారంటే ఎంత మనోవేదన అనుభవించి ఉంటారో అర్థం చేసుకోండి. ఊరూరా వాడవాడలా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

### కుప్పానికి వచ్చేందుకు సీఎంకు సిగ్గుందా..?

హంద్రీ-నీవా నీళ్లంటూ సైకో సీఎం హంగామా చేశాడు. అయ్యా జగన్.. నీళ్లతో మా కుప్పం మునిగిపోయింది.. మమ్మల్ని రక్షించడానికి హెలికాప్టర్ పంపించు.. ఈ నియోజకవర్గానికి రావడానికి నీకు సిగ్గుందా? పులివెందులకు నీళ్లిచ్చాను. 90 శాతం హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ పనులు నేనే పూర్తి చేశాను. ఎన్నికలకు ముందు వి.కోట వరకు నీళ్లను తెచ్చాను. అక్కడి నుంచి కుప్పానికి నీళ్లు తేలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. వచ్చే సీజన్‌లో హంద్రీ-నీవా పూర్తి చేసి అన్ని చెరువులకు, ప్రతి ఎకరాకు నీళ్లిచ్చి పాలారును పూర్తిగా పారించే బాధ్యత నాది.

## నా గౌరవాన్ని మీరే కాపాడాలి

### రాజకీయంగా నన్ను వేధించారు

- అసెంబ్లీలో నా భార్యను అవమానించారు
- అందుకే కౌరవ సభ అంటూ బయటికొచ్చా
- రాజకీయాల్లో మహిళల వేగానికి మగాళ్లు కుర్చీలు వెతుక్కోవాలి
- టీడీపీ అధినేత చమత్కారం
- మహిళా బూత్ కమిటీ సభ్యులతో భేటీ

'40 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా రాజకీయాలు చేసిన నన్ను వేధించారు. రాజకీయాలతో ఏ మాత్రం సంబంధం లేని నా భార్యను అవమానించారు. నాకు అవమానం జరిగిన చోటును కౌరవ సభ అని చెప్పి బయటికి వచ్చేశాను. దాన్ని గౌరవ సభగా మార్చి అడుగుపెడతానన్నాను. నా గౌరవాన్ని మీరే కాపాడాలి' అని చంద్రబాబు మహిళల బూత్ కమిటీ సభ్యులతో సమావేశంలో అన్నారు. తనను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు ప్రపంచంలోని తెలుగువారంతా బాధపడ్డారని.. సంఘీభావం తెలిపారని చెప్పారు. 'ఆడబిడ్డలు రాజకీయాల్లోకి రావాలి. ఆ వేగానికి మగవాళ్లు కుర్చీలు వెదుక్కోవాలి' అని చమత్కరించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు ఆడబిడ్డలకు సైకిళ్లిచ్చి చదివించానని, ఉద్యోగాల్లో 33% రిజర్వేషన్ కల్పించానని గుర్తు చేశారు. విదేశాల్లో మహిళలు టాక్సీ డ్రైవర్లుగా రాణిస్తున్నారని, ఈసారి అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ డ్రైవర్ ఉద్యోగాలు చేసుకునేలా చేస్తానని హామీ ఇచ్చారు. వరకట్నం ఇచ్చి పెళ్లి చేసే స్థాయి నుంచి... రివర్స్ కట్నం ఇచ్చి ఆడబిడ్డలను పెళ్లి చేసుకునే స్థాయికి పరిస్థితులు మారాయంటే అది టీడీపీ ఘనతేనన్నారు. మరికొన్ని కొత్త పథకాలతో మహిళల ముందుకొచ్చానని చంద్రబాబు చెప్పారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకు రూ.15 వేలు, ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు వంటి పథకాలను ప్రస్తావించారు. 'టీడీపీ వల్ల మీకు ఎంతో మే లు జరిగింది. ఆ నిజం మీకు తెలుసు. అందువల్ల ఎన్నికల్లో టీడీపీకే ఓటేయాలని మీఇంట్లో మగాళ్లను డిమాండ్ చేయండి. లేదంటే భోజనం పెట్టేదిలేదని కరాఖండీగా చెప్పండి' అన్నారు.

### వలంటీర్ల మాటలు నమ్మొద్దు

మహిళలకు ఆస్తిలో హక్కు, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించింది టీడీపీయేనని చంద్రబాబు చెప్పారు. 40 ఏళ్లుగా మహిళల కోసం చేయలేకపోయిన పనులు వచ్చే ఐదేళ్లలో చేసి చూపిస్తానన్నారు. జగన్‌కు ఓటేయకుంటే పథకాలు రద్దవుతాయని వలంటీర్లు బెదిరించినా, ప్రచారం చేసినా తరిమేయాలని.. వారికి భయపడొద్దని కోరారు.

# రఘురామకు పశ్చిమలో సీటు!

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో తామే టీడీపీ తరఫున టికెట్ ఇవ్వడంపై టీడీపీ నాయకులు దృష్టి సారించారు. తొలుత విజయనగరం లోక్‌సభ స్థానంలో పోటీచేయిస్తే ఎలా ఉంటుందని ఆలోచించారు. కొందరు నేతలు ప్రతిపాదించగా.. ఉత్తరాంధ్ర నాయకులు అంగీకరించలేదు. తమ ప్రాంత సామాజిక సమీకరణల రీత్యా ఈ యోచన ఉపయుక్తం కాదని.. పార్టీకి ఇబ్బంది అవుతుందని అన్నట్లు తెలిసింది. చివరకు ప్రత్యామ్నాయంగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఏదైనా అసెంబ్లీ సీట్లో ఆయనను నిలపాలన్న ప్రతిపాదన వచ్చింది. ఆ జిల్లాలో తమ కోటా కింద వచ్చిన అన్ని అసెంబ్లీ సీట్లకు టీడీపీ ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసింది. వారిలో ఎవరినైనా ఆపి రఘురామ రాజును నిలిపితే ఎలా ఉంటుందన్నదానిపై సమాచారం సేకరిస్తున్నారు.

### రాఘవరెడ్డి కాదు.. శ్రీనివాసులరెడ్డే..

ఒంగోలు లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థి మారారు. తన కుమారుడు రాఘవరెడ్డి బదులు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డే బరిలోకి దిగనున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు తీవ్రత పెరగడంతో.. మొదట ఖరారుచేసిన రాఘవరెడ్డిని కాదని.. ఆయన తండ్రి మాగుంట శ్రీనివాసులరెడ్డిని నిలపాలని తాజాగా నిర్ణయించారు. ఈ కేసులో రాఘవరెడ్డి నిందితుడిగా ఉన్నారు. పోటీ నుంచి తప్పుకొంటున్నానని ఆయన సోమవారం బహిరంగంగా ప్రకటించారు కూడా. కాగా.. టీడీపీ నాయకత్వం ఇంకా విజయనగరం, కడప, అనంతపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. కడపకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి పేరు ప్రతిపాదనలో ఉండగా తాజాగా జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కూడా తెరపైకి వచ్చారు. అనంతపురం లోక్‌సభ స్థానానికి అంబికా లక్ష్మీనారాయణ, పూల నాగరాజు, ప్రొఫెసర్ రాజేశ్, కంబూరి నాగరాజు పేర్లు పరిశీలనలో ఉన్నాయి. విజయనగరం ఎంపీ స్థానానికి కొందరు నేతలు మాజీ మంత్రి కిమిడి కళావెంకట్రావు పేరు ప్రతిపాదించగా.. మరి కొందరు నేతలు విజయనగరం మాజీ ఎమ్మెల్యే మీసాల గీత పేరు ముందుకు తెచ్చారు. ఎచ్చెర్ల నేత కలిశెట్టి అప్పలనాయుడు పేరు కూడా వినిపిస్తోంది.

### వారిని మారుస్తారా?

ఇప్పటికే ప్రకటించిన ఇద్దరు ముగ్గురు అసెంబ్లీ అభ్యర్థులపై టీడీపీ పునరాలోచన చేస్తున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అనంతపురం జిల్లా మడకశిర(ఎస్సీ) స్థానానికి తొలుత అనిల్ పేరు ప్రకటించారు. కానీ ఆయనతో మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి వర్గం తీవ్రంగా విభేదిస్తోంది. దీంతో ఆ సీటుకు పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు పేరు తెరపైకి వచ్చింది. విజయనగరం జిల్లా గజపతినగరం అభ్యర్థిగా కొండపల్లి శ్రీనివాస్ పేరు మొదట ప్రకటించారు. కానీ అక్కడ కొన్ని సమస్యలు వచ్చి ప్రచారం ముందుకు నడవడం లేదు. తాజాగా ఈ సీటుకు కళావెంకట్రావు పేరు పరిశీలిస్తున్నట్లు సమాచారం. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట (ఎస్సీ) అభ్యర్థినిగా డాక్టర్ నెలవల విజయశ్రీ పేరు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం ఆమె తండ్రి. ఆయనతో వస్తున్న తలనొప్పులతో ఆ సీటుపై కూడా పునరాలోచన జరుగుతున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. తంబళ్లపల్లె అభ్యర్థి జయచంద్రారెడ్డి పనితీరుపై కూడా పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. కర్నూలు జిల్లాలో ఆదోని సీటును బీజేపీకి ఇచ్చారు. ఆ సీటు బదులు ఆలూరు తీసుకోవాలని టీడీపీ నేతలు ప్రతిపాదించారు. బీజేపీ నేతలు ఇందుకు సుముఖత చూపడం లేదు. ఆదోనిలో బీజేపీ పోటీ చేస్తే అక్కడ ఆ పార్టీ అభ్యర్థి సామాజిక వర్గాన్ని బట్టి ఆలూరులో తమ అభ్యర్థిని ఎంపిక చేయాలని టీడీపీ నాయకత్వం భావిస్తోంది. మంత్రాలయంలో టీడీపీ అభ్యర్థిగా రాఘవేందర్‌ను ఖరారుచేసింది. ఆదోని అభ్యర్థిత్వం మంత్రాలయంపై కూడా ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని టీడీపీలో కొన్ని వర్గాలు ఊహాగానాలు చేస్తున్నాయి.

### ఇండిపెండెంట్‌గా గెలిపించుకుంటాం: బాలకోటయ్య

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 25: 'నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు స్వతంత్ర అభ్యర్థిగాపోటీ చేసినా మేం ఆయనకు అండగా ఉండి గెలిపిస్తాం. వైసీపీ అప్రజాస్వామిక పాలనా విధానాలు, సీఎం జగన్‌పై ప్రాణాలొడ్డి పోరాడిన ఏకైక నాయకుడు త్రిబుల్ ఆర్' అని అమరావతి బహుజన జేఏసీ అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య అన్నారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. 'రఘురామకు ఎంపీ సీటు ఇవ్వడానికి కూటమిలోని మూడు పార్టీలకు ఎందుకు చేతులు రావడం లేదు? ఆయనకు సీటు ఇవ్వకపోవడాన్ని రాష్ట్ర ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు ఇంద్రధనస్సును మించిన రంగుల్లో కనిపిస్తున్నాయి. సీట్ల కేటాయింపులు కొంత గందరగోళంగా, నిరాశ నిస్పృహలతో ఉండటం చాలా మందిని బాధిస్తోంది' అని బాలకోటయ్య అన్నారు. నవక్రాంతి పార్టీ అధ్యక్షుడు కనకం శ్రీనివాసరావు, రెల్లి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శిరంశెట్టి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ ఇంటిపై నిఘా..



(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ నెక్స్ట్ లెవెల్‌లో జరిగిందని తేలింది. ఇజ్రాయెల్ నుంచి తెప్పించిన ప్రత్యేక డివైజ్ సహాయంతో ఇంట్లో ఏం మాట్లాడుకుంటున్నారో కూడా తెలుసుకున్నట్లు దర్యాప్తు అధికారుల దృష్టికి వచ్చింది. ఇందుకోసం రవిపాల్ అనే సాంకేతిక నిపుణుడి సేవలను కన్సల్టెంట్ పేరుతో వినియోగించుకున్నట్లు సమాచారం. మావోయిస్టులపై నిఘా పేరుతో ఇజ్రాయెల్ నుంచి ఓ పరికరాన్ని దిగుమతి చేసుకున్నట్లు తెలిసింది. ఆ పరికరం 300 మీటర్ల పరిధిలోని ఎలక్ట్రానిక్ డివైజ్‌లలోకి చొరబడి.. వాటి మైక్రోఫోన్‌ను ఆన్ అయ్యేలా చేస్తుంది. ఆ పరిధిలో వైఫై, ఇంటర్నెట్ డేటాతో కనెక్ట్ అయిన ఎన్ని ఫోన్లు, స్మార్ట్‌టీవీలు, అలెక్సా వంటి టూల్స్ కూడా ఆ డివైజ్ పరిధిలోకి వస్తాయని సమాచారం. జూబ్లీహిల్స్‌లోని రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో ఓ కార్యాలయాన్ని అద్దెకు తీసుకున్న ప్రణీత్‌రావు, రవిపాల్.. ఆయన కుటుంబ సభ్యులు ఏం మాట్లాడుకుంటున్నారు? ఎన్నికల వ్యూహాలేంటి? పార్టీ ముఖ్యుల సమావేశంలో ఏం చర్చలు జరిగాయి? అనే సంభాషణలను నేరుగా విన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ పరికరాన్ని ఇజ్రాయెల్ నుంచి తెప్పించి, రేవంత్ ఇంట్లో జరుగుతున్న విషయాలను చేరవేసినందుకు రవిపాల్‌కు రూ.కోట్లు చెల్లించినట్లు సమాచారం.

### ఎలా సాధ్యం?

ఏదైనా సెల్‌ఫోన్‌ను ట్యాప్ చేయాలంటే.. హ్యాకర్లు అందులో మాల్‌వేర్‌ను చొప్పించాల్సి ఉంటుంది. స్మార్ట్‌ఫోన్లలో భద్రతా ఫీచర్లు పెరుగుతున్నా.. అదే స్థాయిలో లొసుగులు ఉంటున్నాయని సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. ఒకప్పుడు టార్గెట్ ఫోన్ హ్యాకర్ చేతికి వస్తేగానీ, మాల్‌వేర్ చొప్పించే అవకాశం ఉండేది కాదు. అయితే.. హ్యాకర్లు పంపే లింకులను క్లిక్ చేసినా.. మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యే ప్రమాదముంటుంది. వాట్సాప్‌లో ఒక ఫొటోను పంపి, దాన్ని క్లిక్ చేయగానే మాల్‌వేర్ ఇన్‌స్టాల్(స్టాగినోగ్రఫీ) అయ్యేలా చేయవచ్చని వివరిస్తున్నారు. పెగాసస్ వంటి స్పైవేర్‌లు వచ్చాక.. స్మార్ట్‌ఫోన్ చేతికి రాకున్నా.. ఫొటో, లింకులు పంపకున్నా.. టార్గెట్‌గా చేసుకున్న స్మార్ట్‌ఫోన్‌లో వాడే ఏదైనా నిత్యావసర యాప్‌లో లొసుగులను ఆధారంగా చేసుకుని, మాల్‌వేర్‌ను చొప్పించవచ్చని నిరూపితమైందని గుర్తుచేస్తున్నారు. పైన పేర్కొన్న డివైజ్ కూడా అలాంటిదే అయ్యి ఉంటుందని అనుమానిస్తున్నారు. 300 మీటర్ల పరిధిలో ఉండే.. నెట్ కనెక్టివిటీ ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి చొచ్చుకుపోవడానికి ఆ డివైజ్ దోహదపడి ఉంటుందని పేర్కొంటున్నారు. "పబ్లిక్ వైఫైలో ఉంటే.. హ్యాకర్లు కొన్ని పేలోడ్స్ ద్వారా మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలోకి చొరబడుతారు. ఇక్కడ కూడా ఆ డివైజ్ ఇలాంటి పనే చేసి ఉంటుంది. ఇజ్రాయెల్‌కు చెందిన సంస్థలు తయారు చేసే టూల్స్/డివైజ్‌లలో అన్నిరకాల ఆపరేటింగ్ సిస్టమ్‌లలో ఉండే లొసుగులు, వాటిలోకి చొరబడేందుకు దోహదపడే పేలోడ్స్ (ఉదాహరణకు విండోస్ 7లో మీటర్‌ప్రిటర్, విండోస్ 10, 11లో ఎటర్నల్‌బ్లూ) ఉంటాయి. ఆపరేటింగ్ సిస్టమ్ అప్‌గ్రేడ్ అయినా.. కొత్త వెర్షన్ వచ్చినా.. వెంటనే వాటి అప్‌డేట్స్‌ను ఇజ్రాయెల్ సంస్థలు అందజేస్తాయి. ఇక ఆ డివైజ్‌లను ఉపయోగించడానికి ఎలాంటి సాంకేతిక/కోడింగ్ పరిజ్ఞానం అవసరం లేదు. ఇప్పుడు వస్తున్న టూల్స్/డివైజ్‌లు అన్నీ.. గ్రాఫిక్ యూజర్ ఇంటర్‌ఫేస్(జీయూఐ)గా.. యూజర్‌ఫ్రెండ్లీగా ఉంటున్నాయి" అని నగరానికి చెందిన సైబర్‌సెక్యూరిటీ నిపుణుడు ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

### మూసీ వంతెన కింద హార్డ్‌డిస్క్‌లు

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాతి రోజు ఎస్ఐబీలో హార్డ్‌డిస్క్‌లను కటర్‌తో ధ్వంసం చేసిన ప్రణీత్‌రావు.. వాటి ముక్కలను అనంతగిరి అడవుల్లో పారేసినట్లు వాంగ్మూలమిచ్చిన విషయం తెలిసిందే..! పంజాగుట్ట ఠాణాకు చెందిన ఓ బృందం అనంతగిరి అడవుల్లో వెతికినా.. వాటి జాడ దొరకలేదు. అయితే.. ఈ కేసులో నిందితులుగా మారిన పోలీసు అధికారులు భుజంగరావు, తిరుపతన్నల విచారణలో.. హార్డ్‌డిస్క్‌ల ముక్కలను నాగోల్‌లోని మూసీ వంతెన కింద పారేసినట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం ఆ ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, డేటా రిట్రీవ్ చేయించే ప్రయత్నాలు చేస్తున్నారు.

### కర్ణాటక ఎన్నికల్లోనూ ట్యాపింగ్

గత ఏడాది జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ తెలంగాణ ఎస్ఐబీ కేంద్రంగా అక్కడి కాంగ్రెస్ నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అధికారులు గుర్తించారు. బీఆర్ఎస్ మద్దతిచ్చిన జనతాదళ్(సెక్యులర్)కు అనుకూలంగా.. కాంగ్రెస్ వ్యూహాలను, ఆర్థిక వనరులను తెలుసుకుని, ఆ సమాచారాన్ని జేడీఎస్ ముఖ్యులకు చేరవేసినట్లు సమాచారం. కాంగ్రెస్ నేతలకు నిధులు ఎలా వస్తున్నాయి? వాటిని ఎలా పంపిణీ చేస్తున్నారు? అనే సమాచారం ద్వారా అక్కడి ఎన్నికల అధికారులు దాడులు నిర్వహించినట్లు తెలుస్తోంది. కర్ణాటకలో పట్టుబడ్డ నగదు మొత్తంలో సింహభాగం కాంగ్రెస్ పార్టీకి చెందినదేనని తెలుస్తోంది. ఇక తెలంగాణ ఎన్నికల సమయంలోనూ.. కాంగ్రెస్ తరఫున ప్రచారానికి కర్ణాటక నేతలు కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలో కూడా వారి ఫోన్లు ట్యాప్ అయినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

### బెదిరించి.. ఎలక్టోరల్ బాండ్స్!

విపక్ష నేతల ఫోన్లతోపాటు.. వ్యాపారుల స్మార్ట్‌ఫోన్లను కూడా ప్రణీత్‌రావు ట్యాపింగ్ చేసినట్లు దర్యాప్తు అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. అయితే.. విపక్ష నేతలకు సహకరించే రియల్‌ఎస్టేట్, ఫార్మా, సాఫ్ట్‌వేర్ సంస్థల అధినేతల ఫోన్ ట్యాపింగ్‌లతో సుమారు 36 మంది దిగ్గజ వ్యాపారులతో ప్రణీత్‌రావు టచ్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. ఈ క్రమంలో వారిని బెదిరించి, ట్యాప్ చేసిన వారి ఆడియో/వీడియో క్లిప్‌లతో లొంగదీసుకుని, బీఆర్ఎస్‌కు పెద్దమొత్తంలో ఎలక్టోరల్ బాండ్స్ వచ్చేలా చేసినట్లు అనుమానిస్తున్నారు.





# హోలీ సంబరాలు అదుర్స్

**లబ్బీపేట, మార్చి 25:** నగరంలో హోలీ సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. లబ్బీపేట లోని వజ్ర గ్రౌండ్స్‌లో క్లౌడ్ 9కలర్ ఫెస్టో పేరుతో నిర్వహించిన సంబరాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే నగరం లో పలుచోట్ల చిన్నా పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా రంగులు చల్లుకుంటూ గడిపారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన డీజే పాటలకు స్టెప్పులేస్తూ మైమరిచిపోయారు. చిన్నారులు వాటర్ ఫౌంటేషన్‌లో కేరింతలు కొట్టారు. నిర్వాహకులు ఈశ్వర కోలా మాట్లాడుతూ తాము ఈ వెంట్‌ను మొద టిసారి ఏర్పాటు చేశామని, ప్రజల అపూర్వ అదరణ లభించిందన్నారు.







## హోలీ సంబరాల్లో కేశినేని చిన్ని

**భారతీనగర్:** ఈ రంగుల పండుగ మనందరి జీవితాల్లో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని, హోలీ పండుగ ముందురోజు పాత వస్తువులను, పనికి రాని వస్తువులను కాల్చివేసినట్టు ఈ ఎన్నికల్లో సైకో జగన్ పార్టీని కాల్చేసి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలతో అద్భుతమైన రంగుల కలయికగా ఉన్న ఎన్డీఏ కూటమి అధికారంలోకి తేవాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. సోమవారం విజయవాడ క్లబ్‌నందు వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన హోలీ సంబరాల్లో ఆయన పాల్గొని హోలీ శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కేశినేని చిన్నికి రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ ఈ వేడుకతో పాటు రానున్న 2 నెలల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి ప్రజల జీవితాల్లో హరివిల్లు కురిపిస్తుందన్నారు.


హోలీ సంబరాల్లో పాల్గొన్న కేశినేని శివనాథ్ (చిన్ని)

# నగరంలో కొత్తరకం మోసం!

- తక్కువ ధరకు ఖరీదైన వస్తువులు ఇస్తామని డబ్బులు వసూళ్లు
- నాసిరకం వస్తువులు అంటగట్టి పరార్
- అమాయక, ఒంటరి మహిళలే టార్గెట్

**రాణిగారితోట, మార్చి 25:** నగరంలో మరో కొత్తరకం మోసకారులు బయలుదేరారు. అమాయకంగా, ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి నాలుగు ఖరీదైన వస్తువులు తక్కువ ధరకు ఇస్తామని డబ్బులు తీసుకుని నాసిరకం వస్తువులు అంటగట్టి మరో రెండు వస్తువులు తమ కార్యాలయానికి వస్తే ఇస్తామని నమ్మబలికి చల్లగా జారుకుంటారు. ఈ విధమైన మోసం కృష్ణలంకలో సోమవారం జరిగింది. స్థానిక పచ్చమేడ బజార్‌లో నివశించే సత్యవతి అనే మహిళ వంటలు చేస్తూ జీవనం సాగిస్తుంది. సోమవారం ఉదయం ఒక మహిళ ఆ ప్రాంతానికి వచ్చి తమ వద్ద రూ.10తో ఒక వస్తువు కొంటే ఒక లాటరీ టికెట్ ఇస్తామని దానిలో ఉండే రూ.5వేల విలువైన వస్తువులు కేవలం రూ.3వేలకే ఇస్తామని నమ్మబలికింది. దీంతో సత్యవతి రూ.10తో వస్తువు కొనగా లాటరీ ఇచ్చింది. అందులో రూ.5900 విలువైన మిక్సీ, టేబుల్ ఫ్యాన్ రూ.3వేలు అని ఉండడంతో రూ.3వేలిచ్చి తీసుకుంది. వాటితో పాటు తమ నూతన కార్యాలయాన్ని నల్లగేటు వద్ద ఉన్న గ్యాస్ కంపెనీ వద్ద ప్రారంభించామని, మధ్యాహ్నం 12 గంటలకు వస్తే వాషింగ్ మిషన్ గానీ, మూడు ఖరీదైన కుర్చీలు, గ్రైండర్ గానీ అదనంగా అందిస్తామని నమ్మబలికింది. సత్యవతి వద్ద రూ.3వేలు తీసుకుని మార్కెట్‌లో ఎక్కడా లభించని గంగా పేరుతో ఉన్న నాసిరకం టేబుల్, ఫ్యాన్, మిక్సీ ఇచ్చి జారుకుంది. రూ.5వేలకే ఇన్ని వస్తువులని సంతోషించిన సత్యవతి 12గంటలకు గ్యాస్ కంపెనీ వద్దకు వచ్చి కార్యాలయం గురించి వాకబు చేయగా అక్కడ కార్యాలయం లేకపోవడం, వస్తువులు నాసిరకమని తెలియడంతో మోసపోయానని గ్రహించి ఇంటిముఖం పట్టింది. ఇళ్ల వద్ద ఒంటరిగా ఉన్న మహిళలు మోసాల పట్ల జాగ్రత్తగా ఉండడమే కాక ఇళ్ల వద్దకు వస్తువుల అమ్మడానికి వచ్చేవారి గురించి పోలీసులకు తెలిపితే మరొకరు మోసం పోకుండా ఉండే అవకాశం ఉంది.

# టీడీపీ మ్యానిఫెస్టోతో డీలర్స్‌కు భరోసా

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ



**మొగల్రాజపురం, మార్చి 25:** రేషన్ డీలర్స్‌కు మేలు జరిగిందంటే అది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనేనని, ఇపుడు మీ సమస్యల పరిష్కారానికి చంద్రబాబుతో మాట్లాడి మ్యా నిఫెస్టోలో మేలు జరిగే చూస్తానని జడ్పీ మాజీ చైర్ పర్సన్ గద్దె అనూరాధ హామీ ఇచ్చారు. నగరంలో మొగల్రాజపురంలో ఏర్పాటు చేసిన జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం డీలర్స్ ఫేడరేషన్ రాష్ట్ర కార్యాలయాన్ని అమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు మాధవరావు తమ సమస్యలను ప్రస్తావిస్తూ ఆమెకు వినతి పత్రం ఇచ్చారు. టీడీపీ హయాంలో రేషన్ షాపులను మినీ సూపర్ బజార్‌గా మార్చి డీలర్లకు ఆదాయం పెంచారని, 2019లో చంద్రబాబు ఇచ్చిన మట్టి ఖర్చుల జీవోను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయలేదని టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయాలని, చంద్రన్న బీమా రూ.10లక్షలకు పెంచాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డీలర్ల నుంచి వచ్చిన వినతులను విన్న ఆమె మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబుతో మీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ సాయిరాం గౌడ్, ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అడపా వెంకటరమణ, కోశాధికారి గంగాధర గౌడ్, బోడెపూడి ఫణికుమార్, పెనుగోండ శ్రీను, యంసిహెచ్ కాసిం, కందుల బాపూజీక్రిష్, కామిరెడ్డినాని పాల్గొన్నారు.




వంగవీటి రాధా, గొట్టిపాటితో బోడె ప్రసాద్

## టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

- వంగవీటి రాధా, గొట్టిపాటి

**పెనమలూరు, మార్చి 25:** నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబుకు కానుకగా ఇద్దామని మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, ప్రముఖ న్యాయవాది గొట్టిపాటి వెంకట శివరామకృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం పెనమలూరు టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ వారిద్దరినీ కలిసి వచ్చే ఎన్నికల్లో మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం తమ శాయశక్తులా పని చేస్తామని హామీ ఇచ్చారు. చంద్రబాబును సీఎంగా చేసేందుకు అహర్నిశలూ కృషి చేస్తామన్నారు. బోడె ప్రసాద్‌కు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ విజయం కోసం అన్ని వర్గాల నేతలను కలుపుకొని ముందుకు వెళతానన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయానికి అందరం కలిసి కృషి చేస్తామన్నారు.


సింహధ్వని చిత్ర ఆడియో ఫంక్షన్‌లో పాల్గొన్న నటీనటులు

## అట్టహాసంగా సింహధ్వని చిత్ర ఆడియో ఫంక్షన్

**గవర్నర్‌పేట, మార్చి 25:** యువతను చెడు వ్యసనాలకు దూరంగా సక్రమ మార్గంలో నడిపేలా సందేశాత్మక చిత్రంగా సింహధ్వని తెరకెక్కిందని చిత్ర నిర్మాత ఎస్ఎస్ స్వామి అన్నారు. లక్ష్మీభవానీ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన సింహధ్వని చిత్ర ఆడియో విడుదల సోమవారం ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. హీరో వవిష్ణ, హీరోయిన్ త్రివేణి పావని, నటులు నిడదవోలు శ్రీనివాసరావు, ఏలూరు రాంబాబు, నవరంగ్ థియేటర్ అధినేత వాసిరెడ్డి రాజా భూపాల్ ప్రసాద్ హాజరై ఆడియోను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ వీక్షించి విజయవంతం చేయాలని కోరారు. భూపాల్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిత్రాన్ని వీక్షించి చిత్ర విజయానికి దోహదపడాలని కోరారు.

## ఆర్చరీలో ఏపీకి చాంపియన్‌షిప్



**విజయవాడ స్పోర్ట్సు, మార్చి 25:** తమిళనాడు రాష్ట్రం తాంబరంలోని సాయిరామ్ ఇం జనీరింగ్ కళాశాలలో 23, 24న జరిగిన ఖేలో ఇండియా ఎన్‌టీపీసీ సౌత్‌జోన్ ఓపెన్ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ఏపీకీ ప్రాతినిధ్యం వహించిన నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ క్రీడాకారులు చాంపియన్‌షిప్‌ను వశం చేసుకున్నారు. మహిళల రికర్వ్ విభాగంలో కొండపావులూరు యుక్తశ్రీ ప్రథమస్థానం, పురుషుల కాంపౌండ్‌లో కుందేరు వెంకటాద్రి ప్రథమస్థానం, టి.గణేష్ మణిరత్నం కాంస్యం, కాంపౌండ్ మహిళా విభాగంలో కర్రి సుష్మిత్ కాంస్యం, రికర్వ్ పురుషుల విభాగంలో బైరాగి నాయుడు రజతం వశం చేసుకున్నారు. చెరుకూరి డాలీ శివానీ రికర్వ్ మహిళా విభాగంలో యుక్తశ్రీపై 6-4 తేడాతో క్వార్టర్ ఫైనల్స్‌లో పరాజయం పాలై పతకం సాధించే అవకాశం చేజార్చుకుంది. పతకాలను సాధించిన క్రీడాకారులను చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీ అధ్యక్షుడు, చీఫ్‌కోచ్ సత్యనారాయణ అభినందించారు.


ఆర్థిక సాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ ప్రతినిధులు

## దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం

**అజిత్‌సింగ్‌నగర్:** అరుదైన వ్యాధితో బాధపడుతున్న వాంబేకాలనీకి చెందిన నామాల అక్షిత అనే 13 ఏళ్ల పాపకు దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయాన్ని అందజేసింది. ట్రాఫిక్ కానిస్టేబుల్ నాగేంద్రబాబు, అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చందు, ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యుడు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు పాప గురించి తెలుసుకుని సోమవారం వాంబేకాలనీలోని ఇంటికెళ్లి రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఇచ్చారు.

# చర్చి సెంటర్‌లో ప్రభుత్వ స్థలం కబ్జా

- రాత్రిరాత్రికే షెడ్డు ఏర్పాటు
- తెల్లారేసరికి వెలసిన చికెన్, మటన్ షాపు
- కబ్జా స్థలం విలువ రూ.లక్షల్లోనే..!




**భవానీపురం, మార్చి 25:** 43వ డివిజన్ భవానీపురం బైపాస్ రోడ్డులో కబ్జాల పర్వం కొనసాగుతోంది. రెండు వైపులా విస్తరణ పరిస్థితి లేకపోవడం, సుందరీకరణ, గ్రీన్ బెల్ట్ పేరుతో వీఎంసీ అధికారులు ఫ్లవర్ బ్లాక్స్‌ను ఏర్పాటు చేస్తుండటంతో కబ్జాదారులు రెండడుగులు ముందుకేసి దర్జాగా ఆక్రమణకు తెగబడ్డారు. ఇక్కడ గజం స్థలం లక్షపైనే పలుకుతుండటంతో కబ్జాదారులు వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల అండతో చెలరేగిపోతున్నారు. కొద్ది నెలల క్రితమే చర్చిని ఆనుకుని ఓ బిర్యాని పాయింట్ ముందుకొచ్చి ఆక్రమణకు తెగబడగా, టౌన్‌ప్లానింగ్ అధికారులు కొంత కూల్చేశారు. కొద్దికాలం ఆగాక దాన్ని పునర్నిర్మించడంతో ఇటు వైపు స్థలందారులు కూడా ఆక్రమణలకు ముందుకు దూకినట్టు సమాచారం. కొంత ప్రైవేట్ స్థలం సాకుగా చూపి కొండంత స్థలాన్ని కబ్జాతో తమ ఖాతాల్లోకి రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి సిద్ధపడ్డారు. ఓ యజమాని తనకిక్కడ స్థలం ఉందంటూ నమ్మబలికి భారీ షెడ్డును రాత్రికి రాత్రే బరితెగించి ఏర్పాటు చేశారు. ఇప్పుడు రంజాన్ పురస్కరించుకుని వ్యాపారం సాగుతుండటంతో అటు పావులు కదిపి రూ.లక్షల్లో విలువైన స్థలాన్ని కాజేశారు. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండటంతో దర్జాగా ఆక్రమణ చేసిన స్థలంలోనే చికెన్, మటన్ షాపునకు ద్వారాలు తెచిరి దర్జాగా వ్యాపారం ప్రారంభించడం గమనార్హం. దీనికి స్థానిక కార్పొరేటర్ అండదండలతో పాటు, జిల్లా స్థాయి వైసీపీ నేత చక్రం తిప్పినట్టు సమాచారం. కబ్జా స్థలానికి అడ్డు చెప్పేవారు లేకపోవడం, టౌన్‌ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో ఈ స్థలానికి కాగితాలు పుట్టించి సొంత స్థలంగా చెలామణి కావడానికి ఏర్పాట్లు ముమ్మరమయ్యాయని తెలుస్తోంది.

## అర్ధరాత్రి ఇసుక అక్రమ తరలింపు

- అధికార పార్టీ అండతో తరలిపోతున్న వందలాది ట్రాక్టర్లు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీసు అధికారులు

**కంకిపాడు, మార్చి 25:** అధికార పార్టీకి అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఎన్నికల కోడ్ వచ్చినా మాకేంటి, మనల్ని ఎవడు ఆపుతాడనే అన్నచందంగా అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలోని కృష్ణానదీ తీరం నుంచి ఇసుక అక్రమంగా తరలింపు జరుగుతుంది. అర్ధరాత్రి 11 నుంచి 2-3 గంటల మధ్యలో సుమారు 500 ట్రాక్టర్లతో ఇసుక అక్రమ తరలింపునకు అధికార పార్టీ నేతలు పాల్పడుతున్నారు. ఎడ్ల బళ్ల సాయంతో ఇసుకను మద్దూరు గ్రామంలోని ఖాళీ స్థలాల్లో నిలువ చేసి ట్రాక్టర్లు, టిప్పర్లలో లోడింగ్ చేసి వేలాది రూపాయలకు అమ్మేస్తున్నారు. ఎన్నికల నిబంధనలను సైతం అధికారులు పక్కదోవ పట్టిస్తున్నారు. రెవెన్యూ అధికారులను వివరణ కోరగా ఇసుక తవ్వకాలను మైనింగ్ అధికారుల చూస్తానని, తమకు సంబంధం లేదని తేల్చి చెబుతున్నారు.



## ఏపీని డ్రగ్స్ రాష్ట్రం మార్చిన జగన్‌రెడ్డి

- టీడీపీ మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర


**విద్యాధరపురం, మార్చి 25:** ఏపీని జగన్‌రెడ్డి డ్రగ్స్ రాష్ట్రంగా మార్చారని టీడీపీ మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర అన్నారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు హయాంలో పెట్టుబడుల్లో రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిస్తే జగన్‌రెడ్డి హయాంలో డ్రగ్స్‌లో నెంబర్ వన్‌గా ఉందన్నారు. విశాఖకు బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రగ్స్ విషయంలో కూనం పూర్ణచంద్రరావుకు, విజయసాయిరెడ్డికి సమీప సంబంధాలు ఉన్నాయన్నది బ్రెజిల్ దేశాధ్యక్షుడికి విజయసాయిరెడ్డి శుభాకాంక్షలు తెలపడాన్ని బట్టి అర్థమవుతోందన్నారు. గతంలో రాష్ట్ర పోలీసులే డ్రగ్స్ అమ్ముతూ పట్టుబడ్డారన్నారు. డ్రగ్స్ సరఫరాలో వైసీపీలోని ప్రజాప్రతినిధులు, ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం ఉందన్నారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ నుంచి విముక్తి చేసి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమిలో ఉమ్మడి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు.

### గ్రీన్‌కో కంపెనీకి చౌకగా భూముల కేటాయింపు దుర్మార్గం

ఎన్నికల కోడ్ వచ్చాక గ్రీన్‌కో కంపెనీకి కొన్ని వేల ఎకరాల భూమిని జగన్‌రెడ్డి అతిచౌకగా కేటాయించడం దుర్మార్గమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కోగంటి రామారావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ చర్యను టీడీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థిగా ఉన్న చలమశెట్టి సునీల్‌కు ఈ భూమిని కట్టబెట్టారని ఈ అక్రమ చర్యని దీన్ని ఖండిస్తున్నామని, దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని కోరుతున్నామన్నారు.

# భక్తులను బురిడీ కొట్టిస్తున్న 'సంస్థాన్'

- ట్యాగ్, ఐడీ, టీషర్టు ఉన్న కిట్ రూ.500
- కిట్ కొనుగోలు చేస్తే దుర్గమ్మ వీఐపీ దర్శనం ఉచితమని ప్రచారం
- క్యూలో వెళుతున్న భక్తుడిని అడ్డుకోవడంతో వ్యవహారం బట్టబయలు



కనక దుర్గమ్మ గిరిప్రదక్షిణ సంస్థాన్ పేరుతో జారీ చేసిన గుర్తింపు కార్డు

**వన్‌టౌన్, మార్చి 24:** ఈజీ మనీ సంపాదించడం ఎలాగో కొంతమందికి వెన్నతో పెట్టిన విద్య. ఎక్కడైనా, ఏ రంగంలోనైన సరే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుంటారు. నేరుగా దుర్గమ్మ పేరుతోనే డబ్బు సంపాదించడానికి ఓ ప్రబుద్ధుడు తెరలేపాడు. పౌర్ణమి రోజున గిరిప్రదక్షణ వేడుకను వేదిక చేసేకున్నాడు. కనకదుర్గమ్మవారి గిరిప్రదక్షణ సంస్థాన్ పేరుతో ఉన్న కిట్లను భక్తులకు అంటగట్టి ఒక్కో కిట్‌కు రూ.500 వసూలు చేసిన వైనం తాజాగా బయటపడింది. గిరిప్రదక్షణానంతరం దుర్గగుడిలోకి కిట్‌లో ఉన్న టీషర్ట్‌ను ధరించి ఒక భక్తుడు దర్శనానికి వెళుతున్న సమయంలో ఉద్యోగులు గుర్తించడంతో గుట్టు రట్టయింది. దుర్గగుడి ఆధ్వర్యంలో గత చైత్రపౌర్ణమి నుంచి క్రమం తప్పకుండా ప్రతినెలా పౌర్ణమినాడు గిరిప్రదక్షణ జరుగుతోంది. వందలాది మంది భక్తులు పాల్గొంటున్నారు. గిరిప్రదక్షణలో పాల్గొనే భక్తులకు దేవస్థానం ఎలాంటి గుర్తింపు కార్డులు కానీ, ఇతరత్రా దర్శన సౌకర్యాలను కానీ కల్పించలేదు. ఏలూరు రోడ్డులోని విజయటాకీస్ ప్రాంతంలో ఫొటోగ్రాఫర్‌గా చెప్పుకుంటున్న కోనేటి వెంకటరాజు ఓ ఐడెంటీ కార్డును తయారు చేశాడు. దానిపై ప్రతి నెలా పౌర్ణమి గిరిప్రదక్షణ అని మాత్రం రాసి ఉంది. ఫొటో పేరు ముద్రించి ఉంటుంది. దీంతో పాటు భక్తులకు టీషర్టు, ట్యాగ్‌ను ఇస్తున్నాడు. గుర్తింపు కార్డుతో పాటు టీషర్టు వేసుకుని వెళితే వీఐపీ క్యూలో దుర్గమ్మను ఉచితంగా దర్శనం చేసుకోవచ్చని నమ్మబలుకుతూ వారి నుంచి రూ.500 చొప్పున వసూలు చేస్తున్నాడు. కొంతమంది అమాయక భక్తులు నిజమేనని నమ్మి కొనుగోలు చేయడం విశేషం. సోమవారం గిరిప్రదక్షణ సందర్భంగా ఈ అక్రమ చర్య బయటపడింది. ఈవో రామారావు దీనిపై ఇంకా తనకు సమాచారం రాలేదని విషయాన్ని తెలుసుకుని చర్యలు తీసుకుంటామని ఆంధ్రజ్యోతితో తెలిపారు.

## భక్తి ప్రపత్తులతో దుర్గమ్మ గిరిప్రదక్షిణ

**వన్‌టౌన్, మార్చి 25:** దుర్గగుడి దేవస్థానం యథావిధిగా పౌర్ణమి నాడు నిర్వహించే గిరిప్రదక్షణను సోమవారం ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భక్తి ప్రపత్తులతో నిర్వహించింది. గంగా, పార్వతీ సమేత మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను పూలతో అలంకరించిన వాహనంపై ఉంచి ఘాట్‌రోడ్డు వద్ద బలిహరణలిచ్చి ప్రారంభించారు. ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు యజ్ఞ నారాయణ శర్మ, ఆర్.శ్రీనివాసశాస్త్రి, ఏఈవో రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన గిరిప్రదక్షణ మేళతాళాలు, మహిళల కోలాటాలు, భక్తజనుల దుర్గాభవానీ నినాదాలతో గిరిప్రదక్షణ సాగింది. కుమ్మరిపాలెం సెంటర్, నాలుగుస్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్, కబేళా రోడ్డు, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ల మీదుగా తిరిగి గిరిప్రదక్షణ కొండపైకి చేరుకుంది. మళ్లీ ఉత్సవమూర్తులకు హారతులు సమర్పించి గిరిప్రదక్షణను ముగించారు. ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య గర్భాలయంలోకి చేర్చారు.



### అర్చనలు, హోమాలు

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా దేవస్థానానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కొంతమంది భక్తులు మొక్కుబడుల ప్రకారం ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. చండీహోమం, నవవారణార్చన, ప్రత్యేక కుంకుమార్చనలో పాల్గొన్నారు.

## భావి భారత శాస్త్రవేత్తల్ని తయారు చేయాలి

- జనవిజ్ఞాన వేదిక పిలుపు

**భవానీపురం:** విద్యార్థినీ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసి, భావి భారత శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎం. గేయానం ద్, కుర్రా రామారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాలపై నెలరోజుల పాటు ఆన్‌లైన్లో వీడియో పోటీలను నిర్వహించారు. ఇందు లో విజేతలకు రాష్ట్రస్థాయి వర్చువల్ సమావేశంలో విజేతలను ప్రకటించారు. ప్రథమ బహుమతి కర్నూ ల్ జిల్లా బాష్యం స్కూల్ విద్యార్థులు స్నేహిత, అ మూల్య, ప్రణీత, ద్వితీయ బహుమతులను శ్రీకాకు ళం జిల్లా సిగడాం మండలం డి. బొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.చరణ్ తే జ, తృతీయ బహుమతిని పల్నాడు జిల్లా మండలం బొగ్గారం స్కూల్ విద్యార్థి చెన్నకేశవ సాధించారు

## న్యాయ పోరాటం చేస్తాం

- మెకానిక్ యాసీన్ బేగ్, అతడి భార్య ఆయేషా

**వన్‌టౌన్:** కుటుంబసభ్యులతో సహా తనను, తన భర్తను చంపుతానని బెదిరించిన 18వ డివిజన్ కార్పొరేటర్ సత్యంపై చర్యలు తీసుకోవాలని బాధితులు మెకానిక్ యాసీన్ బేగ్ భార్య ఆయేషా డి మాండ్ చేశారు. కృష్ణలంక పోలీసులు కార్పొరేటర్‌పై కేసు నమోదు చేయకుండా అతని ఇద్దరి అనుచరులపై అనుమానితులుగా కేసు నమోదు చేసి కేసును పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను చంపుతామని బెదిరించిన కార్పొరేటర్ సత్యం పై పోలీసులు చర్యలు తీసుకోకుంటే న్యాయం జరిగేవరకు పోరాడుతామన్నారు.

## తాగునీటి సమస్య చెబితే బెదిరింపులు

**విద్యాధరపురం:** కొండప్రాంతంలో తాగునీరు సరఫరా సమస్యను గుర్తించిన స్థానికుడు వలీ వీఎంసీ వాటర్ విభాగం ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఖాజా దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సమస్యను పరిష్కరించకుం డా ఫిర్యాదు చేసిన వలీని అసభ్యకరంగా దూషించి బెదిరించిన సంఘటన సోమవారం జరిగింది. 38వ డివిజన్ పరిధి దళవాయి సుబ్బరామయ్య హై స్కూల్ ఎదురుగా కొండ ప్రాంతం చర్చి వరకు 4 రోజుల నుంచి తాగునీరు నిలిచిపోయింది. దీంతో వలీ వాటర్ విభాగం ఏఈ అహ్మద్, సిబ్బంది ఇస్మాయేల్, దుర్గారావుకు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో వలీ ట్యాప్ ఇన్స్‌పెక్టర్ ఖాజాకు ఫోన్‌చేసి సమస్యను వివరించాడు. అయితే ఖాజా వాటర్ రాదు.. ఏం చేస్తావో చేసుకో.. అంటూ అసభ్యకరంగా దూషించి బెదిరించినట్టు బాధితుడు చెప్పాడు. ఈఈ నారాయణ మూర్తి దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను పరిష్కరించి ట్యాప్ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకుంటానన్నారని చెప్పాడు.

## శ్రీరామకోటి పుస్తకాల వితరణ

**పటమట:** శ్రీరామసేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం గురునానక్ కాలనీలో బీజేపీ నేత, సుప్రీం కోర్టు న్యాయవాది కిలారు దిలీప్ చేతులమీదుగా శ్రీరామకోటి పుస్తకాల వితరణ నిర్వహించారు. దిలీప్ మాట్లాడుతూ భగవద్గీత శ్లోకాలను అందరికీ అర్థమయ్యేలా పాకెట్ డైరీలుగా ముద్రించి హిందూ భక్తకోటికి అందజేస్తున్నాయన్నారు. శ్రీరామసేవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు టి.రామగణేష్ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన సేవ, గో సేవ, ఆధ్యాత్మిక సేవతో పాటు, హిందూ సనానత ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 5వేల నామాలతో శ్రీరామ నామ లేఖన గ్రంథాన్ని ఆవిష్కరించి, జన బాహుళ్యంలోకి తీసుకువెళుతున్నామన్నారు. రామకోటి పూర్తి చేసి భద్రాచలం రామాలయంలో అందిస్తామని, రాసిన భక్తుల గోత్రనామాలతో పూజాధికాలు నిర్వహిస్తామన్నారు.

## వైసీపీ నేత బెజ్జం రవికుమార్‌పై ఫిర్యాదు

**వన్‌టౌన్:** సెంట్రల్‌లోని ముత్యాలంపాడుకు చెందిన వైసీపీ ప్రధాన కార్యదర్శి బెజ్జం రవికుమార్‌పై సోమవారం కేసు నమోదైంది. శ్రీనగర్ 3వ రోడ్డులో నివాసం ఉంటున్న కల్వపురి నరసింహారావు రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి బెజ్జం రవికుమార్‌తో పరిచయముంది. దీంతో రైతుబజార్‌లో రెండు షాపులిప్పిస్తానని జనవరిలో నరసింహారావు వద్ద రూ.50వేలు తీసుకున్నాడు. అప్పటి నుంచి బాధితుడికి షాపులివ్వకపోవడంతో కాలయాపన చే స్తున్నాడు. ఈ విషయాన్ని సోమవారం ఆంధ్రజ్యోతి లో వైసీపీ నేతల చేతివాటం కథనం ప్రచురితమైం ది. ఈ వార్తను చూసిన బాధితుడు నరసింహారావు సత్యనారాయణపురం పోలీసులకు రవికుమార్‌పై ఫిర్యాదు చేశాడు. సీఐ వెంకటనారాయణ రవికుమార్‌ను పిలిపించి విచారించారు. దీంతో రవికుమార్ బాధితుడికి ఒకట్రెండు రోజుల్లో తీసుకున్న డబ్బులు ఇస్తానని పోలీసులకు చెప్పినట్టు తెలిసింది.

# పదోన్నతుల్లో నగదు 'బదిలీ'లు

- కింది సిబ్బంది అకౌంట్లలోకి ఫోన్‌పే ద్వారా ఆ సొమ్ములు
- డిప్యూటేషన్‌కూ చేయి తడవాల్సిందే
- ఎన్నికల వేళ నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగులు
- వ్యవసాయ అనుబంధ శాఖల్లో ఇదీ తీరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఉద్యోగుల పదోన్నతులు కొందరు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగులు ఇస్తుండగా, పదోన్నతులు, డిప్యూటేషన్లలో ముడుపుల చెల్లింపులు సర్వసాధారణంగా మారాయి. రూల్ ప్రకారం ఇచ్చే పదోన్నతులకు ప్రతిఫలం ఉండదంటూ.. తాత్కాలిక పదోన్నతులిచ్చినప్పుడు పెద్ద మొత్తాల్లో పిండేస్తున్నారు. చివరికి డిప్యూటేషన్లకూ సొమ్ములు వసూలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమైనా, దొడ్డిదారిలోనైనా పదోన్నతి దక్కితేచాలని భావించే వారు ముడుపులు చెల్లించడానికి వెనుకాడటం లేదు. దీంతో కొందరు అధికారులు అడ్డగోలుగా పదోన్నతులు ఇచ్చి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఉన్నత విద్యార్హత, సీనియారిటీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ కంటే.. లంచాలే పదోన్నతులకు ప్రమాణికం అవుతున్నాయి. దీంతో అన్ని అర్హతలున్నా కొందరికి పదోన్నతి పొందడం దుర్లభంగా మారుతోంది. వ్యవసాయ అనుబంధ శాఖల్లో ఇటీవల జరిగిన ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియ లోపభూయిష్టంగా మారింది. అయినా శాఖాపరమైన పదోన్నతుల కమిటీ(డీపీసీ) ఆమోదం ఉంటే చాలనే వాదనతో.. పదోన్నతుల ప్రక్రియను నడిపిస్తున్నారు. ఆయా శాఖల్లో అడ్మిన్ విభాగంలోని అధికారులు పదోన్నతులు, డిప్యూటేషన్ల సమయంలో ముడుపులు అందుకుంటున్నారన్న విమర్శలున్నాయి. తమ వద్ద పని చేసే సిబ్బంది అకౌంట్లకు ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ చేయించుకున్నట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించకుండా, పదోన్నతి పొందిన ఉద్యోగులు చేసే సన్మానాలతో సంతోషపడుతుండటంతో అవినీతి తంతు యథేచ్ఛగా సాగిపోతోంది. సహకారశాఖలో 30 మంది డిప్యూటీ రిజిస్ట్రార్లకు సీనియారిటీ, రోస్టర్ పాయింట్లతో నిమిత్తం లేకుండా, డేట్ ఆఫ్ జాయినింగ్ ప్రకారం అడ్‌హాక్ ప్రమోషన్లు ఇచ్చారు. ఈ విధానం సరికాదన్న చర్చ ఆ శాఖలో జరుగుతున్నా, పట్టించుకునేవారే లేరు. మార్కెటింగ్ యార్డుల్లో పని చేసే సూపర్‌వైజర్ స్థాయి నుంచి స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ వరకు పెద్ద సంఖ్యలో పదోన్నతులు ఇచ్చారు. మూడు ప్లేస్‌మెంట్ల ఆప్షన్లతో పదోన్నతులు, పోస్టింగులు ఇచ్చారు. ఓ అధికారి.. ఉన్నతాధికారులకు తెలియకుండా, పదోన్నతులు, పోస్టింగ్‌లకు పెద్ద మొత్తంలో నగదు వసూలు చేసినట్లు సమాచారం. ఉద్యానశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లకు డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రమోషన్లు ఇచ్చారు. ఇవి రూల్స్‌కు వ్యతిరేకంగా జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తగా, పదోన్నతిపొంది, ఆశించిన పోస్టు దక్కించుకున్నవారు మాత్రం అంతా పారదర్శకంగా జరిగిందని, ఎవ్వరికీ పైసా ఇవ్వలేదంటూ బుకాయిస్తున్నారు. పశుసంవర్ధకశాఖలో పదోన్నతులు, డిప్యూటేషన్ల వ్యవహారంపైనా ఆరోపణలున్నాయి. అధికార పార్టీ నేతల సిఫారసులతో ఇష్టారాజ్యంగా పోస్టింగులు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తాయి. మత్స్యశాఖలోనూ పదోన్నతుల సమయం వసూళ్ల షరా మామూలే అయ్యాయి. తాజాగా గ్రామ వ్యవసాయ సహాయకులకు విస్తరణాధికారులుగా పదోన్నతి కల్పించే ప్రక్రియలోనూ నగదు బదిలీ జరిగిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



## ఆర్మీ క్యాంటీన్ నుంచి లిక్కర్ తెచ్చి.. అమ్మేస్తున్నాడు!

- రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఇంట్లో 303 బాటిళ్లు స్వాధీనం చేసుకున్న సెబ్

అనంతపురం క్రైం, మార్చి 25: అనంతపురం నగరంలో రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఇంట్లో రూ.5.50 లక్షల విలువైన 303 డిఫెన్స్ లిక్కర్ బాటిళ్లను సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నార్పల మండలం తుంపెర గ్రామానికి చెందిన రిటైర్డ్ బీఎస్ఎఫ్ జవాను ఎన్.హనుమంతరెడ్డి అనంతపురం నగర శివారులోని శిల్పా లేపాక్షి నగర్‌లో ఉంటున్నారు. బెంగుళూరులోని ఆర్మీ క్యాంటీన్‌లో తను, తన సహచర రిటైర్డ్ జవాన్లు కొనుగోలు చేసిన లిక్కర్ బాటిళ్లను అనంతపురానికి తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ ఆదివారం రాత్రి తన సిబ్బందితో కలిసి హనుమంతరెడ్డి ఇంటిపై దాడులు నిర్వహించారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని సెబ్ ఏఎస్పీ తెలిపారు.

## ఒకే కాన్పులో మూడు కోడెదూడలు

ఒక ఆవు ఒకే కాన్పులో మూడు కోడె దూడలకు జన్మనిచ్చిన సంఘటన కృష్ణా జిల్లా గన్నవరం మండలం అల్లాపురం పశు వైద్యశాలలో సోమవారం జరిగింది. ఆవులు సాధారణంగా ఒక కాన్పులో ఒక దూడకు మాత్రమే జన్మనిస్తాయి. అప్పుడప్పుడు రెండు దూడలు (కవలలు) కూడా జన్మిస్తాయి. కానీ మూడు దూడలు పుట్టడం అరుదైన సంఘటనగా ఆవుకు కాన్పుచేసిన వెటర్నరీ ఏడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు. మూడు దూడలు ఆరోగ్యం ఉండటంతో గుణదలకు చెందిన రైతు నక్కినబోయిన రాము ఆనందం వ్యక్తం చేశారు.

\- ఉంగుటూరు




# మేక శరణ్ పాత్ర ఏంటి?

**ఢిల్లీ మద్యం స్కామ్‌లో డబ్బులెలా చేతులు మారాయి?.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై ఈడీ అధికారుల ప్రశ్నల వర్షం**

**నేడు కోర్టులో హాజరు.. కస్టడీ పొడిగింపు కోరే చాన్స్.. 23న కవిత వేసిన బెయిల్ పిటిషన్‌పైనా నేడే విచారణ**

న్యూఢిల్లీ, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఈడీ కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోమవారం ప్రశ్నల వర్షం కురిపించింది. హోలీ సందర్భంగా విచారణకు విరామం ఇస్తారని.. ఒకవేళ విచారించినా గంటో, రెండు గంటలో ప్రశ్నిస్తారని కవితతోపాటు కుటుంబసభ్యులు భావించారు. కానీ.. కస్టడీ చివరిరోజు సోమవారమే కావడంతో ఈడీ అధికారులు ఆమె నుంచి రాబట్టాల్సిన సమాచారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ముఖ్యంగా.. ఈ వ్యవహారంలో కవిత మేనల్లుడు మేక శరణ్ పాత్ర ఏమిటి? డబ్బులు ఎలా చేతులు మారాయి? ఎవరెవరి మధ్య లావాదేవీలు జరిగాయి? తదితర అంశాలపై ఈడీ ఆమెను ప్రశ్నించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే.. కవిత, ఆమె భర్త అనిల్, వ్యక్తిగత సహాయకుల నుంచి స్వాధీనం చేసుకున్న మూడు ఫోన్లలోని డేటాను కవిత ముందుంచి, ఆ సమాచారంపైన కూడా ప్రశ్నించారని.. మద్యం వ్యాపారి సమీర్ మహేంద్ర పాత్రపై ఆరా తీశారని తెలుస్తోంది. కాగా.. ఇప్పటికే రెండుసార్లు కవితను కస్ట



డీకి తీసుకుని విచారించిన ఈడీ అధికారులు మంగళవారం మధ్యాహ్నం 11 గంటలకు మరోసారి ఆమెను రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరచనున్నారు. కవిత నుంచి మరింత సమాచారం రాబట్టాల్సి ఉన్నందున ఆమెను మరో ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని వారు కోరనున్నట్టు తెలిసింది.

### బెయిల్ పిటిషన్ పైనా..

ఢిల్లీ మద్యం పాలసీ కేసు రాజకీయ కక్షసాధింపు చర్యలో భాగమేనని పేర్కొంటూ ఈ నెల 23న రౌస్ అవెన్యూ కోర్టులో కవిత బెయిల్ పిటిషన్ వేయగా.. 26న విచారిస్తామని న్యాయమూర్తి తెలిపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. కవితను ఈడీ కోరినట్టు కస్టడీకి ఇస్తారా? జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపుతారా? లేక బెయిల్‌పై విడుదల చేస్తారా? అనేది మంగళవారం తేలనుంది. కాగా, సోమవారం సాయంత్రం 7 గంటలకు కవితను ఆమె భర్త అనిల్‌తో పాటు న్యాయవాది మోహిత్ రావు కలిశారు. మంగళవారం కోర్టు ముందుకు రానున్న బెయిల్ పిటిషన్‌పై వారు చర్చించినట్టు తెలిసింది. ఈడీ అధికారులు మళ్లీ కస్టడీ కోరితే ఏం చేయాలి? బెయిల్ నిరాకరిస్తే భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి? అనే అంశాలపై వారు చర్చించినట్టు సమాచారం.

## టికెట్ ఇవ్వలేదని ఎంపీ ఆత్మహత్యాయత్నం

- తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గంలో ఘటన
- పరిస్థితి విషమంగా ఉందన్న వైద్యులు

ఈరోడ్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ టికెట్ దక్కలేదని లోక్‌సభ సభ్యుడు ఆత్మహత్యకు యత్నించారు. తమిళనాడులోని ఈరోడ్ నియోజకవర్గంలో ఆదివారం జరిగిందీ ఘటన. ఈరోడ్ ఎంపీ ఎ.గణేశమూర్తి ఎండీఎంకే పార్టీ తరపున లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన వయసు 76 సంవత్సరాలు. ప్రస్తుతం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అధిష్ఠానం ఆయనకు టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన పురుగుల మందును నీటిలో కలుపుకొని తాగారు. వాంతులు చేసుకుంటున్న ఆయనను కుటుంబసభ్యులు హుటాహుటిన స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కోయంబత్తూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పార్టీ ప్రధానకార్యదర్శి వైగో ఆదివారం రాత్రి కోయంబత్తూరు ఆస్పత్రిని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు సీటు ఇవ్వడం కుదరకపోతే, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనను బరిలోకి దించుదామని నిర్ణయించామని, ఈలోపే ఆయన ఆత్మహత్యకు యత్నించారని వైగో విలేకరులకు చెప్పారు. 48 గంటలు గడిస్తేగానీ ఏమీ చెప్పలేమని వైద్యులు తెలిపారన్నారు. ఆయన మూడుసార్లు ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారని చెప్పారు.

### యాప్‌లో రీచార్జ్ చేస్తే డబుల్ అంటూ

# 5 కోట్లకు టోకరా!

**గ్రామీణ ప్రజల్ని నమ్మించి సైబర్ నేరగాళ్ల మోసం**

- 'ఐపీజీ' యాప్ పేరుతో భారీ మోసం
- మోసంపై గత ఏడాదే పోలీసు కేసు నమోదు
- బాధితుల ఘర్షణతో తాజాగా వెలుగులోకి
- తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో ఘటన

చౌటుప్పల్ టౌన్, మార్చి 25: ఐపీజీ అనే మొబైల్ యాప్‌లో కనీసం రూ.200తో రీచార్జ్ చేస్తే.. 15 నుంచి 20 రోజుల్లో అధిక వడ్డీతో అసలుతో సహా చెల్లిస్తామన్నారు. చెప్పినట్లుగానే నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. మూడు నెలలపాటు నమ్మకంగా చెల్లించారు. దీనిని నమ్మి.. గ్రామీణ ప్రాంత ప్రజలు రోజురోజుకూ రీచార్జ్ పెంచుకుంటూ పోయారు. రూ.వందల నుంచి రూ.లక్షలకు రీచార్జ్ చేరగానే మూడు రోజులపాటు భారీ వడ్డీని ప్రకటించి రూ.5 కోట్ల దాకా వసూలు చేసి సుమారు 1000 మందిని మోసం చేశారు సైబర్ నేరగాళ్లు. ఇంటర్ పబ్లిక్ గ్రూప్(ఐపీజీ) యాప్ పేరిట గత ఏడాది ఏప్రిల్‌లో ఈ సైబర్ మోసం చోటుచేసుకుంది. అప్పట్లోనే దీనిపై పోలీసు కేసు నమోదైనా.. తాజాగా బాధితులు ఘర్షణకు దిగటంతో విషయం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. ఐపీజీ యాప్‌లో రీచార్జ్ చేసిన వారికి రోజువారీగా అసలుతో పాటు వడ్డీ కూడా చెల్లిస్తామంటూ సైబర్ మోసగాళ్లు 2023 జనవరిలో యూట్యూబ్ ద్వారా విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ యాప్‌కు డబ్బును రీచార్జ్ చేసేందుకు ఒక లింక్‌ను ఏర్పాటుచేశారు. ఈ లింక్ ద్వారా రీచార్జ్ చేసిన వారికి 15 నుంచి 20 రోజుల్లో వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తామని నమ్మించారు. యాప్‌లో మొదటగా రూ.200 నుంచి రీచార్జ్ చేసే వెసులుబాటును కల్పించారు. దీనిని నమ్మిన చాలా మంది.. యాప్‌ను స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని రీచార్జ్ చేశారు. తక్కువ మొత్తాలను రీచార్జ్ చేసిన సందర్భంలో వెంట వెంటనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. డబ్బులు ప్రతిరోజూ జమ అవుతుండడంతో అందరిలోనూ నమ్మకం పెరిగింది. యాప్‌కు రీచార్జ్ చేసే వ్యక్తుల సంఖ్య పదుల నుంచి వందలకు చేరింది. అత్యాశకు పోయిన కొందరు రీచార్జ్ చేసే డబ్బును కూడా రూ.వందల నుంచి రూ.లక్షలకు పెంచేశారు. రీచార్జ్ వ్యవహారం ఏకంగా రూ.2లక్షల వరకు చేరుకుంది.

### మూడు రోజుల్లో పెద్దమొత్తం వసూలు చేసి..

అందరూ తమను నమ్మినట్లు తెలుసుకున్న సైబర్ నేరగాళ్లు ఏప్రిల్ 1, 2, 3వ తేదీల్లో బంపర్ ఆఫర్ అంటూ అధిక వడ్డీ ఆశ చూపించారు. వేర్వేరు మొత్తాలకు రూ.2.50 నుంచి రూ.4.50 వరకు వడ్డీ ఇస్తామని ప్రకటించడంతోపాటు ఈ మూడు రోజుల్లో మాత్రమే అవకాశం అని ప్రకటించారు. దీంతో ఎక్కువ మొత్తాల్లో గ్రామీణ ప్రజలు రీచార్జ్ చేశారు. కొంతమంది స్నేహితులు, బంధువుల వద్ద అప్పులు తెచ్చి రూ.వేలు, రూ.లక్షల్లో ఐపీజీ యాప్‌కు రీచార్జ్ చేశారు. ఎక్కువగా ఈ మూడు రోజుల్లో రూ.50వేల చొప్పున వందలాది మంది రీచార్జ్ చేశారు. అమాయకుల నుంచి రూ.కోట్లలో డబ్బులను రాబట్టిన సైబర్ నేరగాళ్లు తమ యాప్‌ను ఏప్రిల్ 4వ తేదీన క్లోజ్ చేశారు. ఆ రోజు నుంచి బ్యాంక్ ఖాతాలకు ఐపీజీ యాప్ ద్వారా డబ్బులు జమ కాకపోవడం, యాప్ రీచార్జ్ పనిచేయకపోవడంతో మోసపోయామని బాధితులు గ్రహించారు. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, నల్లగొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామాల్లో వందల సంఖ్యలో అమాయకులు ఈ మోసా




నికి గురయ్యారు. ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ 1000 మంది ఐపీజీ బాధితులు సుమారు రూ.5 కోట్లకు పైగా మోసపోయినట్లు సమాచారం. చౌటుప్పల్‌కు చెందిన ఎండీ గౌస్ అనే వ్యక్తి ఏకంగా రూ.రూ.7.81 లక్షలు పోగొట్టుకున్నాడు. నారగోని శంకరయ్య రూ.1.50 లక్షలు మోసపోయాడు. ఐపీజీ యాప్‌తో మోసపోయిన ఉమ్మడి జిల్లాకు చెందిన సుమారు 150 మంది బాధితులు 2023 ఏప్రిల్ 10వ తేదీన ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

## వ్యాపారిపై మోయలేని భారం



జగన్ సర్కారు ఇటీవల ధాన్యంపై 1% సెస్ విధించింది. మిల్లర్లు, డీలర్లు, టోక్ వ్యాపారులపై సెస్ భారాన్ని మోపింది. ఈ నిర్ణయం బియ్యం ధరలను పెంచినట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ప్రభుత్వ విధానం ఇలాగే కొనసాగితే, రానున్న రోజుల్లో మరింతగా ధరలు పెరగవచ్చునని అంటున్నారు. అప్పుడిక అన్నం తినడం కూడా కష్టమవుతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, బొండాలు, ముతక, లావు రకాల ధాన్యం ధరల్లో మాత్రం మార్పు లేదు.

# పొయ్యి ఎక్కని సన్నాలు


- తినకుండానే ఆకలిని చంపేస్తున్న ధరలు
- తుఫాన్ దెబ్బకు నాణ్యమైన బియ్యానికి రెక్కలు
- కిలో రూ.60-65...మరో 10 పెరిగే అవకాశం!
- రాష్ట్రంలో తరిగిపోతున్న పాత బియ్యం నిల్వలు
- కేంద్రం ఎగుమతులు నిషేధించినా దిగిరాని ధర
- జగన్ సర్కారు 'సెస్' పోటుతో వ్యాపారులు కుదేల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని చాలా నగరాల్లో నాణ్యమైన బియ్యం కిలో రూ.60-65 చొప్పున అమ్ముతున్నారు. ఆ ధరలకే సామాన్యుడు అమ్మో.. అంటున్నాడు. కానీ, బియ్యం రేటు మరో రూ.5-10పెరిగే సూచనలున్నాయి. దీంతో అన్నం తినకుండానే ఆకలి చచ్చిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. 2023ఖరీఫ్‌లో వరి సాగు తగ్గింది. పండిన పంట కూడా మిచౌంగ్ తుఫాన్‌కు దెబ్బతింది. 2022 నాటి(పాత) బియ్యం నిల్వలు పూర్తిగా తరిగిపోయాయి. రాష్ట్రంలో నాణ్యమైన బియ్యానికి (సన్న రకాలు) డిమాండ్ పెరగడానికి ఇవన్నీ కారణాలుగా చెబుతున్నారు. దీంతో ఉత్పత్తి- సరఫరాలో పెరిగిన అంతరం బియ్యం ధరలను భగ్గుమనిపిస్తోంది. గత ఏడాది దేశంలో వరి సాగు, ఉత్పత్తి తగ్గిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం గత ఆగస్టు, సెప్టెంబరులో ఇతర దేశాలకు బియ్యం ఎగుమతిపై నిషేధం విధించింది. అయినా సూపర్‌ఫైన్ రకం బియ్యం కిలోకు రూ.10పైన పెరగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మన రాష్ట్రంలో ప్రస్తుతం సూపర్‌ఫైన్ రకం బియ్యం 25కిలోల బ్యాగ్ రూ.1,625 ఉండగా, సన్న రకాలు రూ.1,500, సాధారణ రకాలు రూ.1,250కు తగ్గడంలేదు. మిల్లర్ రేటు ప్రకారం నిరుడు సెప్టెంబరులో క్వింటా ధాన్యం రూ.2,050 పలికితే, ఇప్పుడు రూ.2,200 ఇస్తున్నారు. కానీ క్వింటా బియ్యం గత ఏడాది మార్చి నుంచి అక్టోబరు వరకు రూ.3,500వరకు ఉండగా, నవంబరు నుంచి రూ.4,500కు పెరిగింది. దీనికి జీఎస్టీ, రవాణ ఖర్చులు, రిటైలర్ల లాభాలు కలుపుకొంటే క్వింటా రూ.6వేలు అవుతోంది. కరువు వల్ల సాగు తగ్గడం, పండిన ధాన్యం పాడైపోవడంతో బియ్యం ఉత్పత్తి పడిపోయింది. ఒడిశా, బీహార్, డెహ్రాడూన్, మహరాష్ట్ర నుంచి వచ్చే శ్రీరామ్ (హెచ్‌ఎంటీ) సాంబమసూరి, నెల్లూరు, కర్నూలు సన్నాలు, ఆర్ఎన్ఆర్ 15048 రకాల సన్నరకాల బియ్యం ధరలు పేదవర్గాలకు అందనివిధంగా 25కిలోలు రూ.1,600పైన పలుకుతున్నాయి. ఏపీలో చాలావరకు ధాన్యం దెబ్బతిని, బియ్యం ఉత్పత్తి-సరఫరాలో అంతరం ఏర్పడినందునే బియ్యం ధరలు పెరిగాయని వ్యాపారుల చెబుతున్నారు. కరువు, తుఫాన్ ప్రభావం దక్షిణాది రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా బియ్యం ఉత్పత్తి, మార్కెట్‌పై పడింది. రాష్ట్రంలో ఖరీఫ్ వరి సాగు 11.25లక్షల ఎకరాల్లో తగ్గింది. కృష్ణా, తుంగభద్ర జలాశయాల కింద సాగునీటి సమస్యతో సన్నరకాల సాగు తగ్గింది. గోదావరి డెల్టాకు అధిక శాతం సాగునీటి లభ్యతవల్ల అక్కడ అన్ని రకాల ధాన్యం పండించారు. కానీ తుఫాన్ కబళించి, రైతుల్ని దెబ్బతీసింది. ఈ ఏడాది ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటకలో కూడా సన్నరకాల వరి పండించే ప్రాంతాల్లో ఖరీఫ్ ప్రారంభంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో సన్నరకాల సాగు గణనీయంగా తగ్గింది. ఇదే అదునుగా సన్నరకాల బియ్యాన్ని బ్లాక్ చేసి, మార్కెట్‌లో డిమాండ్ సృష్టించి, అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న వారూ లేకపోలేదు. ఖరీఫ్ ధాన్యం మిచౌంగ్ తుఫాన్‌కు తడిసి, గింజ దెబ్బతినడంతో నాణ్యత తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. కానీ తేమ శాతం ఎక్కువ ఉందని రైతు దగ్గర తక్కువ ధరకు కొని, మిల్లుల్లో బియ్యంగా మార్చి, మార్కెట్‌లో మాత్రం అధిక ధరలకే విక్రయించడం గమనార్హం.

# సజ్జలను పదవి నుంచితొలగించండి

- సలహాదారు రాజకీయ నేతలా మాట్లాడుతున్నారు
- ఈసీకి అచ్చెన్న ఫిర్యాదు



అమరావతి, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పదవిలో ఉన్న సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి రాజకీయ నాయకుడిలా మాట్లాడుతున్నారు. గత ఐదేళ్లుగా ప్రభుత్వ సలహాదారుడిగా కాకుండా వైసీపీ కార్యకర్తలా ప్రతిపక్షాలపై విషం చిమ్ముతున్నారు. ప్రభుత్వ సంచిత నిధి నుంచి జీతం తీసుకుంటూ ప్రభుత్వ ఖజానా ఖర్చుతో అధికార పార్టీ పనులు చేస్తున్నారు' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆయన సీఈఓ ముఖేశ్ కుమార్ మీనాకు సోమవారం లేఖ రాశారు. 'ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ మార్చి 18, 22న ప్రెస్‌మీట్‌లు పెట్టి ప్రతిపక్షాలపై బహిరంగ ఆరోపణలు చేశారు. ఐపీసీ 171, ప్రజాప్రాతినిధ్య చట్టం 123, 129, 134, 134 ఏ సెక్షన్ల ఉల్లంఘన చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలి. సలహాదారు పదవి నుంచి సజ్జలను తొలగించాలి' అని అచ్చెన్న, ఈసీని కోరారు.

### ఓటమి భయంతో వైసీపీ హింసా రాజకీయం

ఓటమి భయంతోనే వైసీపీ మూకలు హింసా రాజకీయాలు చేస్తూ పెట్రేగిపోతున్నాయని అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో ఆరోపించారు. అధికార మదంతో టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు వైసీపీ కార్యాలయం తగలబడిన ఘటనలో టీడీపీ కార్యాకర్తలు కంచేటి సాయి, దండ నాగేంద్ర జానీలపై అక్రమ కేసులు బనాయించారన్నారు. వైసీపీ నేతలే కార్యాలయాన్ని తగలబెట్టి ఆ నెపాన్ని టీడీపీపై మోపడం దుర్మార్గమన్నారు.

# వైసీపీ నేతల అరాచకాలతో చేనేత కుటుంబం బలి

- జగన్ మీడియా వాహనాల్లో పోలీస్ ఎస్కార్ట్‌తో డబ్బుల తరలింపు
- డీజీపీని తొలగించి నిజాయితీపరుడిని నియమించాలి: బుద్దా వెంకన్న

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, మార్చి 25: రాయలసీమలో అబ్దుల్ సలాం కుటుంబం ఆత్మహత్య ఘటన మరవకముందే ఒంటిమిట్టలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు వైసీపీ నేత అరాచకాలే కారణమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఆరోపించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ ఆదేశాల మేరకు బడుగు బలహీనవర్గాల ఆస్తులను కాజేస్తున్నారు. ఆత్మహత్యకు కారకులైన దోషులపై డీజీపీ 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే సాక్ష్యాధారాలతో పీఎం, కేంద్ర శాఖలకు ఫిర్యాదు చేస్తాం. ప్రభుత్వం దిగిపోతుందని తెలిసే జగన్ రాష్ట్రం మొత్తం మీద బడుగు, బలహీనవర్గాల ఆస్తులను కాజేస్తున్నారు. కడప జిల్లాలో పులివెందులకు కూతవేటు దూరంలో ఉన్న చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకుంటే జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదు? ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలి. వైసీపీ కుటుంబం బీసీ వ్యతిరేక కుటుంబం. జగన్ తాత కాలం నుంచీ బీసీలను అణిచివేస్తున్నారు. డీజీపీని విధుల నుంచి తొలగించి పార్టీలకు సంబంధం లేని నిజాయితీ పరుడిని డీజీపీగా నియమించాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తున్నాం' అని బుద్దా వెంకన్న ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీగా ఉన్న తనపైనే రౌడీ షీటర్లపై పెట్టే బైండోవర్ కేసులు పెడుతున్నారన్నారు. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడించేందుకు రూ.500 కోట్ల ప్రజాధనాన్ని డంప్ చేశారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి అన్ని నియోజకవర్గాలకు సాక్షి వాహనాల్లో పోలీస్ ఎస్కార్ట్ సహాయంతో డబ్బులు పంపుతున్నారని బుద్దా ఆరోపించారు.

### బస్సు యాత్రను క్షమాపణ యాత్రగా మార్చాలి: వర్ల

ఐదేళ్లు గడపదాటి బయటకు రాని సీఎం జగన్‌కు.. ఇప్పుడు బస్సు యాత్ర అంటూ ప్రజల్లోకి వెళ్లే కనీస అర్హత లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. సోమవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'జగన్ బస్సు యాత్రను క్షమాపణ యాత్రగా మార్చాలి. బస్సు యాత్రకు వెళ్లే ముందు జగన్ ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. ప్రజల అనుమానాలు, సందేహాలను నివృతి చేయాలి. పాదయాత్రలో, ఎన్నికల మేనిఫెస్టోలో దాదాపు 730కి పైగా హామీలిచ్చారు. ఆ హామీల్లో ఎన్ని నెరవేర్చారో సమాధానం చెప్పాలి. 99 శాతం హామీలు అమలు చేశామంటూ సీఎం హోదాలో అబద్ధాలు చెప్పడం బాధాకరం' అని వర్ల అన్నారు.